
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 25.10.2025 | సంపుటి : 12 సంచిక : 94 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్
Simultaneously Published from Hyderabad & Karimnagar
ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



తెల్లవారుజామున మంటల్లో కాలిపోతున్న బస్సు

## బెంగుళూరు హైవే ప్రైవేటు బస్సులు

# మృత్యుశకటాలు

### కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

బైకును ఢీకొని నిప్పంటుకున్న బస్సు • ప్రమాదం గుర్తించని డ్రైవర్లు
నిమిషాల్లోనే ఊహించని ఘోరం • క్షతగాత్రులకు ఆస్పత్రిలో చికిత్స

## ప్రమాదంలో 19 మంది ప్రాణాలు బుగ్గి



మంటలకు పూర్తిగా దగ్ధమైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు.. కొనసాగుతున్న సహాయక చర్యలు

- బస్సులో ఇద్దరు డ్రైవర్లుతో కలిపి మొత్తం 43 మంది..
- ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని దిగ్భ్రాంతి
- మృతులకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు 50వేల పరిహారం
- ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సంతాపం
- క్షతగాత్రులకు మంత్రులు అనిత తదితరుల పరామర్శ
- మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు..క్షతగాత్రులకు రూ.2లక్షల పరిహారం
- డీఎన్ఏ పరీక్షల ఆధారంగా ఆనవాళ్లు అప్పగింత

వార్త 2లో

*ఊహకందని విషాదం..తెల్లవారు జామున ఏం జరిగిందో తెలుసుకునే లోపే 19 నిండుప్రాణాలు బుగ్గిగా మారాయి. నిద్రలోనే ప్రాణాలు హరీమన్నాయి. మంటల్లో బస్సు తగలబడు తోందన్న విషయం తెలిసే లోపు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి. ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరెందరో ఆశలను బుగ్గి చేసింది. కర్నూలు జిల్లాలో జరిగిన ట్రావెల్ బస్సు దుర్ఘటన కనీవినీ ఎరుగని విషాదాన్ని నింపింది. బస్సుకు మంటలు అంటుకుని బూడిదయ్యింది. బస్సులోనే ఈ 19మంది సజీవ దహనం అయ్యారు. తాము ఎక్కిన బస్సే శ్మశానవాటికి అవుతుందని...అందులో తాము సజీవ దహనం అవుతామని ఊహించని ఘటన ఇది...*

## అన్నీ అక్రమాలే..

- వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమాలు బట్టబయలు
- సిట్టింగ్ పర్మిషన్‌తో స్లీపర్‌గా మార్చి ట్యాక్స్ ఎగవేత
- బస్సుపై 16 చలాన్లు.. రూ.23,120 ఫైన్లు..



**హైదరాబాద్(జనంసాక్షి):**కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో 19 మందిని విగత జీవులుగా చేసిన వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమ బాగోతం తేటతెల్లం అయ్యింది. ఆ సంస్థ నిర్వహించిన ఈ బస్సు సీటింగ్ క్యారియరే కానీ స్లీపర్ సర్వీస్ కాదని తేలింది. వేమూరి కావేరి ట్రావెల్స్ పేరిట హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విశాఖపట్నం రూట్‌లలో టూరిస్టు పర్మిషన్లతో పర్యాటక ప్రాంతాలకు బస్సులను తిప్పే సంస్థగా నమోదైంది. తెలంగాణకు చెందిన హెబ్రాన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ బస్సును 2018లో కొనుగోలు చేసి 2023 వరకు నిర్వహించింది. ఆ తర్వాత వేమూరి వినోద్ కుమార్ ఈ బస్సును కొనుగోలు చేసి తీసుకుని కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూ డామన్‌లో తిరిగి రిజిస్ట్రేషన్ చేశారు. ఇక్కడే వేమూరి కావేరి సంస్థ అక్రమానికి తెరలేపింది. తెలుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తే అధికారులు కొంత కఠినంగా ఉంటారన్న అంచనాతో డయ్యూ డామన్‌లో చేశారు. వాస్తవానికి ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉంది. డయ్యూ డామన్‌లో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకున్న కావేరి ట్రావెల్స్ .. ఒడిశాలోని రాయగడలో ఆల్ట్రేషన్, ఫిట్‌నెస్ చేయించుకున్నారు. రాయగడ అధికారులు ఆల్ట్రేషన్, ఫిట్‌నెస్ మంజూరు చేసేటప్పుడు బస్సు సామర్థ్యం, సీటింగ్ వివరాలను

మిగతా 2లో..

## తెలంగాణ చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు విడుదల

**3610 మందికి రూ.94.77 కోట్ల బిల్లుల చెల్లింపు**

**హైదరాబాద్(జనంసాక్షి):** చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా 3,610 మంది చిన్న కాంట్రాక్టర్లకు రూ.94.77 కోట్ల బిల్లులు చెల్లించింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి ఈ సందర్భంగా చిన్న కాంట్రాక్టర్లంతా ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన పెండింగ్ బిల్లులు కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. బిల్లుల చెల్లింపుతో ఉపశమనం కలిగిందని కాంట్రాక్టర్లు తెలిపారు.

## సాహితీ ఇన్‌ఫ్రాపై ఈడీ కొరడా

**రూ.12.65 కోట్ల విలువైన సంస్థ ఆస్తుల అటాచ్**

**హైదరాబాద్(జనంసాక్షి):** స్థిరాస్తి ప్రాజెక్టుల పేరుతో వినియోగదారులను నిండా ముంచిన సాహితీ ఇన్‌ఫ్రాకు చెందిన రూ.12.65 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. ఈ సంస్థ ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో బాధితుల

మిగతా 2లో..

## జూబ్లీహిల్స్ ఓటర్లు 4,01,365

### ఉపఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు



**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. "నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం" అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

**ఉపఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో ఇవాళ వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో

మిగతా 2లో..

## హెచ్-1బీ వీసా వ్యవస్థల్లో మోసాలు





### ఈ వ్యవహారంపై కోర్టులో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం

- వైట్‌హౌస్ సంచలన ప్రకటన

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో హెచ్-1బీ వీసాల అంశంలో వైట్‌హౌస్ సంచలన ప్రకటన చేసింది. హెచ్-1బీ వీసా వ్యవస్థల్లో మోసాలు జరుగుతున్నాయని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలీనా లివిట్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంలో కోర్టులో పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు. హెచ్-1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ నిర్ణయానికి వ్యతిరేకంగా.. కోర్టుల్లో పలు పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో పిటిషన్ల వ్యవహారమై తాజాగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలీనా లివిట్ స్పందించారు. ఈ సందర్భంగా లివిట్ మాట్లాడుతూ..'అమెరికాలో చాలాకాలంగా హెచ్-1బీ వీసా వ్యవస్థలో మోసాలు జరుగుతున్నాయి. అమెరికన్ల వేతనాలను హెచ్-1బీ వీసాలు తగ్గించేస్తున్నాయి. కాబట్టి ట్రంప్ ఈ వ్యవస్థను మెరుగుపరచాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్యలు చట్టబద్ధమైనవి. అయితే, ట్రంప్ నిర్ణయంపై కొందరు కోర్టులను ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై కోర్టులో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం. అమెరికన్ కార్మికులకు అవకాశాలు అందడంతో పాటు వీసా వ్యవస్థను బలోపేతం చేయడమే అధ్యక్షుడు ట్రంప్ తొలి ప్రాధాన్యం. దీనిపై కోర్టులో పోరాడేందుకు సిద్ధం. వీసా ఫీజుపెంపుపై కోర్టుల్లో వచ్చిన పిటిషన్లను

మిగతా 2లో..

## ఆరు నెలల్లో పుతిన్‌కు అంతా అర్థమవుతుంది



- ఆంక్షల తీవ్రత ఏమిటో పుతిన్‌కు అప్పుడు తెలిసొస్తుంది
- రష్యాకు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ఆంక్షల ఒత్తిడికి తలొగ్గేది లేదంటూ ఆ దేశాధ్యక్షుడు పుతిన్ గట్టిగా బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా స్పందించిన ట్రంప్.. పుతిన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు ఆంక్షల విధింపు స్నేహపూర్వక చర్య కాదని పుతిన్ భావించడం తనకు సంతోషంగా ఉందంటూ విలేకరులతో పేర్కొన్నారు. తమ చర్యల తీవ్రత ఏంటో ఆరు నెలల్లో వారికి అర్థమవుతుందన్నారు. ఇదంతా ఎలా జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించారు. ఈ ఆంక్షల విధింపు సముచితమని, అవసరమని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో ట్రంప్ పలుమార్లు హెచ్చరికలు కూడా చేశారని, ఇప్పుడు అవి అమలు చేశారన్నా రు. యుద్ధం ముగింపు విషయంలో పుతిన్ తీరుపై ట్రంప్ గత కొంతకాలంగా నిరాశతో ఉన్నారన్నారు. శాంతి దిశగా ముందుకుసాగేందుకు రష్యా ఆసక్తి చూపకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. పుతిన్- ట్రంప్‌ల భేటీ గురించి ఇప్పుడే ఏం చెప్పలేమన్న ఆమె.. ఈ సమావేశంలో సానుకూల స్పందన రావాలని యూఎస్ కోరుకుంటుందన్నారు. రష్యా అధ్యక్షుడితో జరిగే సమావేశం వల్ల తన సమయం సద్వినియోగం అవ్వాలని ట్రంప్ భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆయన మాటలకు కాకుండా.. చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలను కుంటున్నారని వెల్లడించారు. పదవీకాలం చేపట్టినప్పటి నుంచి

మిగతా 2లో..

## ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది



**ఐక్యరాజ్య సమితి పసనితీరు అందుకు తగ్గట్లుగా లేదు**

**భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ విమర్శ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్తుందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేవని వ్యాఖ్యానించారు. ఈక్రమంలో యూఎన్‌లో అంతా సరిగా లేదన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అత్యవసరమైనప్పటికీ.. యూఎన్‌లో మార్పులు జరిగేలా ఆ సంస్కరణలు ఉండాలన్నారు. ఐరాసకు భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని.. అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ.. యూఎన్ నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. ఐరాస 80వ వార్షికోత్సవం నేపథ్యంలో పోస్టల్ స్టాంపు విడుదల చేసిన సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడారు. వివాదాల యుగంలో శాంతి అనేది అవసరమని జైశంకర్ పేర్కొన్నారు. ఇటీవల మైనారిటీల రక్షణకు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలంటూ ఐరాస మానవ హక్కుల కమిషన్ ప్రస్తుత ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. దీనికి భారత్ దీటుగా బదులిచ్చింది. ఆ దేశం జాత్యహంకారం, క్రమబద్ధమైన వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావించింది. ముందు వాటిని పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాలని సూచించింది. మరోవైపు.. పహల్గాంలో పౌరులపై జరిగిన ఉగ్రదాడిని

మిగతా 9లో..

## పాకిస్తాన్‌లో ఎస్పీ ఆత్మహత్య

భారత్ ఏజెంట్?

ఆపరేషన్ సిందూర్‌లో సాయం?

## తమిళనాడులోనూ ఎస్ఐఆర్

ఎలక్షన్ కమిషన్ వెల్లడి

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి కనబడటం లేదా?

నేరాల రేటులో ముందున్న డబుల్ ఇంజన్ సర్కార్లు

మేము అధికారంలోకి వస్తే అవినీతిరహిత పాలన ఇస్తాం

మోడీ జంగల్ రాజ్ వ్యాఖ్యలకు తేజస్వి యాదవ్ కౌంటర్

వివరాలు 2వ పేజీలో..

## అమెరికా ఒత్తిళ్లకు భారత్ తలొగ్గదు

అగ్రరాజ్యంతో వాణిజ్య ఒప్పందం వేళ పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం రెండు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్

## కెనడాతో వాణిజ్య చర్చలు నిలిపివేత

ఆ దేశంలో టారిఫ్ ప్రకటనల నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25.10.2025

# బెంగుళూరు హైవే ప్రైవేటు బస్సులు

# మృత్యుశకటాలు

**కర్నూలు(జనంసాక్షి):** శుక్రవారం తెల్లవారుజాము సుమారు 2-3 గంటల సమయం. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోంది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం.. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు. కర్నూలు శివారు చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణమైన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. భయానకమైన ఘటనా స్థలి దృశ్యాలు ప్రమాద స్థాయిని కళ్లకు కడుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం తెలుగు రాష్ట్రాలను ఉలిక్కిపడేలా చేసింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 41 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 43 మంది ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా.. 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా.. మరొకరు పోలీసుల అదుపులో ఉన్నారు. బస్సు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ఢీకొన్న తర్వాత ద్విచక్రవాహనదారుడు కిందపడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఆ సమయంలో బైక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకొని హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు.. పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నుంచి రామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, నవీన్‌కుమార్, అఖిల్, జష్మిత, అకీర, రమేష్, జయసూర్య, సుబ్రహ్మణ్యం బయటపడ్డారు. హిందూపూర్‌కు చెందిన నవీన్ అనే యువకుడు బస్సు ప్రమాదంలో గాయాలైన వారిని ఆరుగురిని తన కారులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమారెడ్డి బస్సులో మంటలు చెలరేగడాన్ని చూసి ఆగారు. పోలీసులకు ఆమె సమాచారం అందించడంతో వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

కర్నూల్ జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ టూ బెంగళూరుకు వెళ్తోన్న కావేరీ ట్రావెల్స్



బస్సు చిన్నటేకూరులో బైకును ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ప్రమాదం సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా, అందులో బైకర్‌తో పాటు 20మంది చనిపోయినట్లు సమాచారం. ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. అయితే, బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు. బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా స్పందించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరా

ఏపీ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయకచర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్: కర్నూలు జిల్లా బస్సు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏపీ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయకచర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనపై సీఎస్, డీజీపీతో మాట్లాడారు. తక్షణమే హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. గద్వాల కలెక్టర్, ఎస్పీ ఘటనాస్థలికి వెళ్లాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో అగ్నిప్రమాదం జరిగి 19 మంది సజీవ దహనమయ్యారు.

ఆపద్బాంధవుడు నవీన్

జిల్లాలో ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగి దగ్ధం కావడం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం నింపింది. ఈ సమయంలో ఓ యువకుడు సమయస్ఫూర్తి ప్రదర్శించి ఆరుగురిని కాపాడాడు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సును బైక్ ఢీకొనడంతో చెలరేగిన మంటలు పలువురి ప్రాణాలను బలి తీసుకున్నాయి. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 39మంది ప్రయాణికులు ఉన్నారు. మంటల్లో చిక్కుకుని 19మంది సజీవ దహనం కాగా.. మిగతా ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అద్దాలు పగలగొట్టి బస్సు నుంచి బయటపడిన కొందరు ప్రాణాలను దక్కించుకున్నారు. ప్రయాణికుల్లో కొందరిని నవీన్ అనే వ్యక్తి తన కారులో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. క్షతగాత్రుల పాలిట ఆపద్బాంధవుడిలా నిలిచారు. ఆ సమయంలో ఏం జరిగిందనే విషయాలను ఆయన మీడియాకు తెలిపారు. హిందూపూర్ నుంచి నంద్యాలకు తాను వెళుతుండగా ఘటనా స్థలంలో బస్సు మంటల్లో దగ్ధమవుతూ కనిపించిందని నవీన్ చెప్పారు. బస్సులో నుంచి బయటపడ్డ ఆరుగురిని తన కారులో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్టు తెలిపారు. బస్సు చుట్టూరా మంటలు వ్యాపించాయని, వాహనాన్ని సమీపించే అవకాశమే లేకుండా పోయిందని వాపోయారు. రమేశ్ అనే ఓ ప్యాసెంజర్ బస్సు అద్దం పగలగొట్టుకుని బయటకు వచ్చినట్టు అతడు తెలిపారు. అది మనిషి పట్టేంత వెడల్పు కూడా లేకపోవడంతో కొందరికి గాజు గుచ్చుకుని గాయాలయ్యాయని వెల్లడించారు. ఆరుగురు క్షేమంగానే ఉన్నారని చెప్పారు. ఇక పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమా రెడ్డి.. బస్సులో మంటలు చెలరేగడాన్ని చూసి పోలీసులు సమాచారం అందించారు. బస్సును బైక్ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. టూ వీలర్ నడుపుతున్న వ్యక్తి పక్కకు పడిపోగా బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఈ క్రమంలో పెట్రోల్ లీక్ కావడంతో ఒక్కసారిగా చెలరేగిన మంటలు బస్సును దగ్ధం చేశాయి. బస్సు డ్రైవర్లలో ఒకరు పరారవ్వగా.. మరొకరు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నారు.

బస్సు ప్రమాదంలో బైకర్ శివశంకర్ మృతి

కర్నూలు జిల్లా శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘోర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో మొత్తం 19 మంది ప్రయాణికులు, ఒక బైకర్ మృతిచెందారు. ఈ ప్రమాదంలో మొత్తం 11 మందికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన వ్యక్తి పేరు శివశంకర్‌గా తెలుస్తోంది. శివశంకర్ కర్నూలు పట్టణంలోని ప్రజానగర్‌కి చెందిన వ్యక్తి. శివశంకర్ మృతిచెందాడని సమాచారం అందిన వెంటనే ఆయన కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చారు. ఈ సందర్భంగా శివశంకర్ కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద కన్నీటి పర్యంతం అయ్యారు. శివశంకర్ గ్రానైట్ పనికి వెళ్తాడని, గురువారం రాత్రి ఇంటికి వచ్చాడని తల్లి చెబుతూ కన్నీరు మున్నీరుగా విలపించింది. శుక్రవారం తెల్లవారుజామున పనికోసం వెళ్లాడని తెలిపింది. తన పని అయిపోయిన తర్వాత ఇంటికి వస్తానని శివశంకర్ చెప్పాడని అతని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. గ్రానైట్ పనులతో పాటు పెయింటింగ్ పనులకి కూడా రోజువారీ కూలిగా వెళ్తాడని శివశంకర్ సోదరుడు చెప్పాడు. శివశంకర్ ఎక్కువగా గ్రానైట్ పనులకి పల్సర్ బైక్ పైనే వస్తుండేవాడని గ్రానైట్ యజమాని తెలిపారు. ఆ బైక్‌నే శివశంకర్ వినియోగిస్తుంటాడని గ్రానైట్ యజమాని పేర్కొన్నారు.

కర్నూలు బస్సు ప్రమాదంలో ఇద్దరు టెక్కీల మృతి

కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మృతిచెందారు. ఏపీలోని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి (27), తెలంగాణలోని యాదాద్రి జిల్లా గుండాల మండలం వస్తకొండూరుకు చెందిన అనూషరెడ్డి చనిపోయారు. వీరిద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. ధాత్రి ఇటీవల హైదరాబాద్‌లోని పెదనాన్న ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు గురువారం రాత్రి వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న ధాత్రి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీర య్యారు. మృతురాలి తల్లి వాణి, బంధువులు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. ధాత్రి మృతికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. యాదాద్రి జిల్లాకు చెందిన అనూషరెడ్డి దీపావళికి స్వగ్రామానికి వచ్చి గురువారం రాత్రి బెంగళూరుకు బయల్దేరారు. ఖైరతాబాద్‌లో బస్సు ఎక్కి ఈ దుర్ఘటనలో మృతిచెందారు. అనూష మృతితో ఆమె తల్లిదండ్రులు కన్నీమున్నీరవుతున్నారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన మరికొందరిని గుర్తించాల్సి ఉంది.

**మంటలు గుర్తించి కిందకు దూకా**

కర్నూలు జిల్లాలో వేమూరి కావేరి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఘోర ప్రమాదానికి గురి కావడంతో పలువురు సజీవదహనమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాద సమయంలో కొందరు ఎమర్జెన్సీ ఎగ్జిట్ నుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. ప్రాణాలతో బయటపడిన ప్రయాణికుడు ఆకాశ్.. ప్రమాదం జరిగిన తీరును వివరించారు. తాను దీపావళికి హైదరాబాద్ వచ్చి తిరిగి బెంగళూరు వెళ్లేందుకు బస్సు ఎక్కినట్లు చెప్పారు. బస్సులో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. హఠాత్తుగా లేచి చూడగా పెద్దఎత్తున మంటలు వచ్చాయి. వెంటనే బస్సు అద్దం పగలగొట్టి బయటకు దూకేశాను. నాతో పాటు బస్సులో నుంచి మరో ఇద్దరు బయటకు దూకారని ఆకాశ్ వివరించారు.

**క్షతగాత్రులకు మంత్రులు అనిత తదితరుల పరామర్శ**

బస్సు ప్రమాద ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. మృతుల్లో ఏపీ, తెలంగాణ నుంచి ఆరుగురు చొప్పున, ఒడిశా, బిహార్ నుంచి ఒక్కొక్కరు, తమిళనాడు, కర్ణాటక నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారని వెల్లడించారు. మరొకరి మృతదేహం గుర్తించాల్సి ఉంది. కర్నూలు వ్యాస్ ఆడిటోరియంలో మంత్రులు అనిత, రాం ప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బస్సులో 39 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులతోపాటు గుర్తు తెలియని మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ప్రమాదం నుంచి ఇద్దరు డ్రైవర్లు సహ 27 మంది బయటపడ్డారు. స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హోం మంత్రి వెల్లడించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయాయన్నారు. చనిపోయిన వ్యక్తుల డీఎన్ఏ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేస్తామన్నారు. ఈ ప్రమాదంపై 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎన్ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు పని చేస్తాయన్నారు. ప్రమాదానికి కారణాలు అన్వేషించేందుకు మరో 4 బృందాలు, రసాయన విశ్లేషణ కోసం 2 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బస్సు డ్రైవర్లిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. రోడ్డుపై పడి ఉన్న బైకును ఢీ కొట్టినట్లు బస్సు డ్రైవర్ చెప్పాడని, అంతకుముందే రోడ్డు ప్రమాదంలో బైక్ పడిపోయి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. బైకు పైనుంచి బస్సు వెళ్లడంతో మంటలు చెలరేగాయని డ్రైవర్ చెప్పాడు. ప్రమాదానికి గల కారాణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందని ఎస్పీ వివరించారు. కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తీవ్రంగా కలచివేసిందని చెప్పారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో శుక్రవారం వేకువజామున మంటలు చెలరేగాయి. బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో అగ్నిప్రమాదం జరిగి 19 మంది సజీవ దహనమయ్యారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## అన్నీ అక్రమాలే..

స్పష్టంగా పొందుపరిచారు. కేవలం ప్రమాదానికి గురైన బస్సుకు 43 సీట్ల సీటింగ్ పర్మిషన్ మాత్రమే ఇచ్చారు. కానీ కావేరి ట్రావెల్స్ సంస్థ స్లీపర్ క్యారియర్‌గా మార్చింది. ఇలా మార్చడం బస్సు సామర్థ్యాన్ని అధిగమించడమే. డయ్యూ డామన్‌లో సీటింగ్ సామర్థ్యం ఉన్న బస్సు రవాణా పన్ను ఒక్క సీటుకు రూ.450 మాత్రమే అదే స్లీపర్ సీటు అయితే రూ.800 అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఛార్జీలు చాలా ఎక్కువ. తెలుగు రాష్ట్రాల్లో ఒక్క సీటుకు రూ.4500 పన్ను చెల్లించాలి. అదే స్లీపర్ సీటుకు అయితే రూ.12వేల చొప్పున ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించాలి. ఇలా ట్యాక్స్‌లను ఎగవేసేందుకే వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ అక్రమ రిజిస్ట్రేషన్, ఆల్ట్రేషన్ చేయించింది. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి.

## జూబ్లీహిల్స్ ఓటర్లు 4,01,365

వెల్లడించారు. ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతోపాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరపున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరఫున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు. తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు సమర్పించారు.

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి కనబడటం లేదా?

పాట్నా(జనంసాక్షి): నేరాల రేటులో భాజపా పాలిత రాష్ట్రాలే ముందు వరుసలో ఉన్నాయని, అక్కడ వారు ఏం చేస్తున్నారని తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. మహాగఠ్‌బంధన్ ఈ నిరుపయోగమైన డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కూలదోస్తుందన్నారు. ఒక ఇంజిన్ అవినీతిమయమైందని, మరో ఇంజిన్ నేరపూరితమైందని దుయ్యబట్టారు. బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించిన సంగతి తెలిసిందే. దానిపై తాజాగా మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ స్పందించారు. తమ కూటమి అధికారంలోకి వస్తే.. అవినీతి రహిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బిహార్ రాజధాని పట్నాలో మాట్లాడారు. నీతీశ్ కుమార్ ప్రభుత్వం పాల్పడిన 55 కుంభకోణాల గురించి ప్రధాని మోదీనే వెల్లడించారు. ఆ అవినీతిపై ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారు..? మోసాలు జరుగుతున్నప్పుడు, ఎలాంటి చర్యలు లేనప్పుడు దానిని జంగల్ రాజ్ అంటారని ఎత్తి పొడిచారు. ఆర్జేడీ తేజస్వి వ్యాఖ్యల వేళ.. భాజపా స్పందించింది. ఆయన్ను అవినీతిపరుడని కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్ అభివర్ణించారు. అవినీతికి పర్యాయపదంగా మారిన వ్యక్తి దాని గురించి మాట్లాడుతుంటే షాకింగ్‌గా ఉంది. అపారమైన సంపదను కూడబెట్టుకున్న ఈ కుటుంబం వల్ల బిహార్ వెనక్కి వెళ్లిపోయిందని వ్యాఖ్యలు చేశారు.

## తమిళనాడులోనూ ఎస్ఐఆర్

చెన్నై(జనంసాక్షి):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తమిళనాడులోనూ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఒక వారంలో ఎస్ఐఆర్ ప్రారంభం అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం మద్రాస్ హైకోర్టుకు తెలిపింది.

## సాహితీ ఇన్‌ఫ్రాపై ఈడీ కొరడా

నుంచి రూ.842 కోట్లు వసూలు చేసినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. కంపెనీ డైరెక్టర్ పూర్ణచందర్ రావుతో పాటు కుటుంబ సభ్యులపై మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినట్టు గుర్తించారు. రూ.216.91 కోట్లు నగదు లెక్కల్లో చూపలేదని అధికారుల దర్యాప్తులో తేలింది. కస్టమర్ల నుంచి వసూలు చేసిన డబ్బుతో.. కంపెనీ డైరెక్టర్లు స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ గుర్తించింది. ఈడీ ఇప్పటికే రూ.161.50 కోట్ల ఆస్తులు సీజ్ చేసింది. ప్రస్తుతం లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావు జైలులో ఉన్నారని, దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

## పాకిస్తాన్‌లో ఎస్పీ ఆత్మహత్య..

- భారత్ ఏజెంట్?

- ఆపరేషన్ సిందూర్‌లో సాయం?

ఇస్లామాబాద్(జనంసాక్షి): దాయాది దేశం పాకిస్తాన్‌లో సంచలన ఘటన చోటుచేసుకుంది. సీనియర్ పోలీసు అధికారి గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. అయితే, ఒక ఫోన్ కాల్ అందుకున్న కాసేపటికే ఆయన ఆత్మహత్య చేసుకోవడం మిస్టరీగా మారింది. మరోవైపు.. సదరు అధికారి భారత్ ఏజెంట్ అని.. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆయనే భారత్‌కు సాయం చేశారంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వివరాల ప్రకారం.. ఇస్లామాబాద్‌లోని ఐ-9 ప్రాంతంలో ఉన్న ఎస్పీ కార్యాలయంలో అదీల్ అక్బర్ ఎస్పీగా పని చేస్తున్నారు. ఇండస్ట్రియల్ ఏరియా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజులాగే విధులకు వెళ్లిన అక్బర్.. గురువారం కూడా స్టేషన్‌కు వెళ్లారు. ఇంతలో ఆయనకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. అది మాట్లాడిన కాసేపటికే.. ఆయన ఆవేశంతో ఊగిపోతూ తన గన్‌మెన్ వద్ద నుంచి తుపాకీని లాక్కుని ఛాతీలోకి కాల్చుకున్నారు. దీంతో, షాకైన గన్‌మెన్ వెంటనే తేరుకుని.. అదీల్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించాడు. అయితే చికిత్స పొందుతూ ఎస్పీ ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అసలు ఆయనకు చివరగా ఫోన్ చేసింది ఎవరు, ఆయనతో ఏం మాట్లాడారు అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కాల్ రికార్డింగ్‌లు, మొబైల్ డేటాను విశ్లేషిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. ఇక, అదీల్ అక్బర్ సియాల్‌కోట్ జిల్లాలోని కమోంకి ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఈయన గతంలో బలూచిస్థాన్‌లో కూడా సేవలు అందించారు.

# హెచ్-1బీ వీసా వ్యవస్థల్లో మోసాలు



ఎదుర్కొంటాం' అని కామెంట్స్ చేశారు. హెచ్-1బీపై ట్రంప్ నిర్ణయాన్ని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. పలు ఉద్యోగ సంఘాలు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ క్రమంలో ట్రంప్ నిర్ణయం కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను ఇది దెబ్బతీస్తోందని ఆ గ్రూప్ ఆందోళన వ్యక్తంచేసింది. హెచ్-1బీపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని తన వ్యాజ్యంలో వాదించింది. ఇదిలా ఉండగా.. హెచ్1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లకు(దాదాపు రూ. 88 లక్షలు) పెంచిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం నెలరోజుల తర్వాత ఫీజును ఎలా చెల్లించాలో, ఈ ఫీజు నుంచి ఎవరికి మినహాయింపు లభిస్తుందో వివరాలు వెల్లడించింది. అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఫీజు పేమెంట్ పోర్టల్‌ను ప్రవేశపెడుతూ ఫీజు చెల్లించినట్లు రసీదు సమర్పించిన దరఖాస్తుదారులు మాత్రమే తదుపరి అడుగులు వేయాలని, అయితే కొందరు స్టూడెంట్ వీసాదారులకు మాత్రం ఫీజు రాయితీ ఉంటుందని తెలిపింది. ఎఫ్-1 వీసాలపై ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, ఎల్-1 వీసాలపై ఉన్న ప్రొఫెషనల్స్‌తో సహా ప్రస్తుత వీసాదారులు హెచ్-1బీ హోదా కోసం దరఖాస్తు చేసినపుడు లక్ష డాలర్లను చెల్లించవలసిన అవసరం లేదని యూఎస్‌సీఐఎస్ వెల్లడించింది. అమెరికా వెలుపల ఉన్న వ్యక్తులు దాఖలు చేసే దరఖాస్తులకు మాత్రం కొత్త ఫీజు వర్తిస్తుందని గ్రీన్ అండ్ స్పీగెల్‌కు చెందిన డాన్ బెర్గర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు ఫోర్బ్స్ తెలిపింది. అమెరికాను వీడి ఉండి ప్రస్తుత హెచ్-1బీ వీసాపై దేశంలోకి తిరిగి ప్రవేశించడం కోసం మళ్లీ దరఖాస్తు చేసుకునే వారికి కొత్త ఫీజు వర్తిస్తుందని యూఎస్‌సీఐఎస్ తెలిపింది. హోదా మార్పు లేదా స్టే పొడిగింపునకు దరఖాస్తుదారు అర్హుడు కాదని తాము నిర్ధారిస్తే కంపెనీ యజమాని ఫీజును చెల్లించాల్సిన అవసరం ఉంటుందని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది.

## ఆరు నెలల్లో పుతిన్‌కు అంతా అర్థమవుతుంది

ఈ యుద్ధం ముగించేందుకే కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు సంస్థలపై ట్రంప్ ఆంక్షలు విధించారు. ఈయూ కూడా ఆ దేశంపై మరిన్ని ఆర్థిక ఆంక్షలు విధించింది. అయితే, ఇవన్నీ తమపై ఒత్తిడి తెచ్చేందుకేనని, ఆత్మగౌరవమున్న ఏ దేశమూ ఇలాంటి వాటికి తలొగ్గబోదని పుతిన్ పేర్కొన్నారు. ఇది అమెరికా వినియోగదారులపై కూడా ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

## అమెరికా ఒత్తిళ్లకు భారత్ తలొగ్గదు..

కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ ఎవరి ఒత్తిడికీ తలొగ్గదని.. హడావిడి నిర్ణయాలు తీసుకోబోదని స్పష్టంచేశారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఉన్నతస్థాయి సమావేశంలో కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్ పలు వ్యూహాత్మక విధానాలను అనుసరిస్తోందన్నారు. కొవిడ్ మహమ్మారి వల్ల ప్రపంచ దేశాల మధ్య ఏర్పడిన అంతరాయాల తర్వాత 2021లో భారతదేశ వాణిజ్య విధానంలో వచ్చిన మార్పును పీయూష్ గోయల్ గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలోనే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఒంటరిగా ఉండకూడదని ప్రపంచ దేశాలతో విశ్వసనీయ సంబంధాలను కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య సంబంధాలు ఏర్పరుచుకుంటోందని తెలిపారు. దీనివల్ల సాంకేతికత, పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్లు వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ విధంగా భారత్ వాణిజ్య ఒప్పందాలకు కట్టుబడి ఉందని.. కానీ ఒత్తిడితో మాత్రం చర్చలు జరపదని స్పష్టం చేశారు. ఇప్పటికే భారత్‌పై ఉన్న సుంకాల ను అంగీకరిస్తున్నాం కదా అనే కారణంతో మరిన్ని సుంకాలను వేస్తామని బెదిరిస్తే.. ప్రత్యామ్నాయ మార్గాలు, కొత్త మార్కెట్లను వెతుక్కోవాల్సి వస్తుందని పీయూష్ గోయల్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరచూ భారత్‌పై సుంకాల బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో పీయూష్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## కెనడాతో వాణిజ్య చర్చలు నిలిపివేత

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాతో నడుస్తోన్న వాణిజ్య చర్చలను నిలిపివేశారు. యూఎస్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ ఆ దేశం ఇచ్చిన ప్రకటనలే అగ్రరాజ్య అధ్యక్షుడి ఆగ్రహానికి కారణమైంది. ఇది దారుణమైన ప్రవర్తన అని సోషల్‌మీడియాలో ట్రంప్ పోస్ట్ పెట్టారు. "అమెరికా జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థకు సుంకాలు చాలా ముఖ్యం. వారు దారుణమైన ప్రవర్తన కారణంగా కెనడాతో అన్ని వాణిజ్య చర్చలు రద్దు చేసుకుంటున్నాం" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ప్రీమియర్ డగ్‌ఫోర్డ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "ఒంటారియో కొత్త ప్రకటన ప్రచారం ప్రారంభించింది. మాపై అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా మా ప్రచారాన్ని కొనసాగిస్తాం అందుబాటులో ఉన్న ప్రతీ సాధనాన్ని ఉపయోగిస్తాం. కలిసి పనిచేయడమే ఇరువర్గాల శ్రేయస్సుకు మంచి మార్గం" అని రాసుకొచ్చారు. మరోవైపు, అమెరికాలో సుంకాలతో ముప్పు పొంచి ఉన్నందున ఆ దేశాన్ని దాటి మిగతా దేశాలతో ఎగుమతులు పెంచుకోవాలనుకుంటున్నట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ట్రంప్ మండిపడ్డారు. వాణిజ్య చర్చల నిలిపివేతపై ప్రకటన చేశారు కెనడా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 35 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. అంతేగాకుండా రంగాలవారీగా సుంకాలను ప్రకటించారు. అమెరికా-మెక్సికో-కెనడా అగ్రిమెంట్ కింద కవర్ అయిన వస్తువులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ టారిఫ్‌ల ప్రకటన తర్వాత నుంచి అమెరికా-కెనడాల మధ్య మాటల యుద్ధం నడిచింది. రెండు దేశాల సంబంధాలు ఒత్తిడికి గురయ్యాయి. అయితే కొన్ని రోజుల క్రితం ట్రంప్‌తో కెనడా ప్రధాని మార్క్ కార్నీ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా జరిగిన చర్చల వల్ల ఎలాంటి ఫలితం లేదని తాజాగా వెల్లడైంది. కాగా.. అమెరికా అధ్యక్ష ఎన్నికల నాటినుంచే కెనడా 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని కెనడా సర్కారు ఖండిస్తూ వస్తోంది. తమ దేశం అమ్మకానికి లేదంటూ గట్టిగా చెప్పింది. ఈ క్రమంలోనే అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగుదేశంపై ట్రంప్ సుంకాలతో విరుచుకుపడ్డారు. ప్రతిగా కెనడా కూడా టారిఫ్‌లు విధించింది.

# రైతుల ఆమోదం తర్వాతే భూసేకరణ చేయాలి

- హెచ్ఎండీఏ కమిషనర్‌తో సీపీఎం ప్రతినిధి బృందం చర్చలు



హైదరాబాద్ (జనంసాక్షి) : రైతుల ఆమోదం తర్వాతే భూసేకరణ చేయాలని హెచ్ఎండీఏ కమిషనర్ సీపీఎం ప్రతినిధి బృందం కోరింది. ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై సీపీఎం రాష్ట్ర ప్రతినిధి బృందం హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో చర్చలు జరిపింది. ప్రతినిధి బృందంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్, రాష్ట్ర సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, డీజీ నరసింహారావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఉన్నారు. ట్రిపుల్ ఆర్ భూ సేకరణ అలైన్మెంట్ మార్చడం వల్ల రైతులు గందరగోళ పడుతున్నారని, ఉత్తరం భాగంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం భూసేకరణ చేసిందని ప్రతినిధి బృందం కమిషనర్ దృష్టికి తెచ్చింది. కానీ ఇప్పటికీ స్థానిక రైతులతో అధికారులు చర్చించలేదు. గ్రామసభలు జరిపి రైతులతో మాట్లాడలేదు. నష్టపరిహారం నిర్ణయించలేదు. రైతుల ఆమోదం లేకుండానే భూమిని తీసుకోవడం పూర్తయిందని ప్రకటించడం సమంజసం కాదని ప్రతినిధి బృందం కమిషనర్ దృష్టికి తెచ్చింది. దక్షిణ ప్రాంతంలో ప్రస్తుతం ప్రకటించిన అల్కెన్మెంట్ చేర్పులు, మార్పులతోఅస్పష్టంగా వున్నప్పటికీ, అల్కెన్‌మెంట్‌లో ఏమార్పులూ చేయలేదని కమిషనర్ చెప్పడం విడ్డూరంగా ఉంది. కొంతమంది పెత్తందార్ల కోసం, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం అల్కెన్మెంట్లు మార్చుతూ పేద రైతుల భూములు లాక్కునే చర్యను సీపీఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, ఆ రకంగా జరగడానికి వీల్లేదని ప్రతినిధి బృందం కమిషనర్ దృష్టికి తెచ్చింది. ప్రతినిధి బృందం తమ దృష్టికి తెచ్చిన అంశాలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కమిషనర్ చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రైతుల తరపున ఆందోళన పోరాటాలు కొనసాగిస్తుందని సీపీఎం ప్రతినిధులు బృందం హెచ్చరించింది.

# సీఎం ప్రజావాణి చొరవతో....
# 1087 మందికి డబుల్ బెడ్ రూంలు కేటాయింపు

- చిన్నారెడ్డి, దివ్యలను సన్మానించిన లబ్దిదారులు



హైదరాబాద్ (జనంసాక్షి) : సీఎం ప్రజావాణి చొరవతో 1087 మందికి డబుల్ బెడ్ రూం లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ శుక్రవారం ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజావాణికి తరలి వచ్చారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ లను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపులు జరిగాయని చిన్నారెడ్డి, దివ్య తెలిపారు. ఈ ఘనత సీఎం రేవంత్ రెడ్డిదే అని వారు పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో డబుల్ బెడ్ రూమ్ లను ప్రస్తుత లబ్ధిదారులకు కేటాయించగా, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడం, కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ నగర శివారులో పలు ప్రాంతాలలో కొత్తగా డబుల్ బెడ్ రూమ్ లను కేటాయిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారి చేసింది.

### సీఎం ప్రజావాణిలో 229 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 229 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 64, రెవెన్యూ శాఖకు సంబంధించి 54, ఇందిరమ్మ ఇండ్ల కోసం 46, హెూం శాఖకు 14, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటాం


- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 24 (జనం సాక్షి) : కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడ్డ తెలంగాణ ప్రాంతానికి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ప్రమాద ఘటనా స్థలాన్ని జోగులాంబ గద్వాల జిల్లా అధికారులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు ప్రమాద ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు మృతి చెందారని, పదిమంది గాయాలతో బయటపడ్డారన్నారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. మృతి చెందిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి సీఎం రేవంత్ రెడ్డి రూ.5 లక్షలు, గాయపడ్డ వారికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారన్నారు. ఈ ప్రమాదం బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహబూబ్నగర్ జిల్లాలోనూ 2013లో పాలెం వద్ద జరిగిన ఘటనలో 48 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు సుశిక్షకులైన డ్రైవర్లను నియమించుకునేలా రవాణా శాఖ నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. మంత్రితోపాటు తెలంగాణ జెన్కో సిఎండి హరీష్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య. ఆర్డీవో అలివేలు, ఉండవెల్లి ఎమ్మార్వో ప్రభాకర్,తదితరులున్నారు.

# ఆస్ట్రేలియాలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

- విక్టోరియా పార్లమెంట్ సందర్శన



హైదరాబాద్, అక్టోబర్ 24 (జనంసాక్షి) : ఆస్ట్రేలియాలో తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా విక్టోరియా పార్లమెంట్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబుకు లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్నమెంట్ విప్ లీ తార్లామిస్, పార్లమెంటరీ సెక్రటరీ షీనా వాట్ ఘన స్వాగతం పలికారు. శాసన పక్రియలు, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీపై సుదీర్ఘంగా చర్చించారు. పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే పౌరుల భాగస్వామ్యం కీలకమని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. టెక్నాలజీ ఆధారిత, పౌర కేంద్రిత పాలన వైపు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ? విక్టోరియా ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్ పెంచేందుకు చొరవ చూపుతామని మంత్రి తెలిపారు. అలాగే తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్‌ను విక్టోరియా ప్రతినిధులకు మంత్రి వివరించారు. ఇక... రాష్ట్రంపై విక్టోరియా నేతలు ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ రోల్ మోడల్ రాష్ట్రం అంటూ కొనియాడారు. ద్వైపాక్షిక సహకారం పెంపొందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా విక్టోరియా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# ప్రిన్సిపాల్ వేధింపులకు విద్యార్థిని ఆత్మహత్య


- వంగర గురుకులంలో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య
- నా బిడ్డ ఆత్మహత్యకు ప్రిన్సిపాల్
- పాఠశాల సిబ్బంది కారణం అంటూ తండ్రి ఫిర్యాదు



భీమదేవరపల్లి, అక్టోబర్ 24 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని డాక్టర్ పివి రంగారావు మెమోరియల్ తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మనం తిరుపతి మమత దంపతులకు కుమార్తె (శ్రీ హర్షిణి 14) ప్రిన్సిపాల్ వేధింపులు కారణంగా ఆత్మహత్య చేసుకుంది. పదో తరగతి విద్యార్థిని వనం శ్రీ వర్షిణి దీపావళి సెలవుల అనంతరం గురువారం మధ్యాహ్నం ఆమె తండ్రి వనం తిరుపతి వర్షిణిని తిరిగి పాఠశాలకు చేర్పించారు.అయితే శుక్రవారం ఉదయం వర్షిణి తన తండ్రికి ఫోన్ చేసి డాడీ స్కూల్లో భయంగా ఉంది, త్వరగా రండి అని చెప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు.దీనిపై తండ్రి ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి నేను వచ్చేవరకు నా కూతురి వద్ద ఎవరో ఉండాలి అని కోరినప్పటికీ, సిబ్బంది పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత వర్షిణి వసతి గృహానికి వెళ్లి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొంతసేపటికి పాఠశాలకు చేరుకున్న తండ్రి గేటు వద్ద చాలాసేపు వేచి ఉన్నా సిబ్బంది తలుపులు తెరవకపోవడంతో ఆందోళన చెందారు. చివరికి లోపలికి వెళ్లి చూసేసరికి కూతురు మృతదేహంగా కనిపించిందని కన్నీరుమున్నీరయ్యారు. విద్యార్థిని మృతిచెందిన సమాచారం అందుకున్న వంగర ఎస్ఐ దివ్య, ముల్కనూర్ ఎస్ఐ రాజు,ఎల్కతుర్తి ఎస్ఐ ప్రవీణ్,సీఐ రమేష్ బృందాలతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడకు చేరడంతో ఉద్రిక్తత నెలకొంది.అనంతరం మృతదే హాన్ని హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఈ ఘటనపై సిపిఐ నాయకులు పాఠశాల గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టి, ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డీఈవో వసంతి,కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. మృతురాలి తండ్రి వనం తిరుపతి వంగర పోలీసులకు ఫిర్యాదు చేస్తూ ప్రిన్సిపాల్ ఇతర ఉపాధ్యాయుల వేధింపుల వల్లే నా కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. వంగర పోలీసులు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

# గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్దపీట

- రూ.74.43 కోట్ల నిధుల మంజూరు
- కొత్త రహదారులతో పల్లెల ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది : మంత్రి సీతక్క



హైదరాబాద్, అక్టోబర్ 24 (జనంసాక్షి) : ములుగు జిల్లా సహా పలు జిల్లాల్లో గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఈ దఫా మొత్తం రూ.74.43 కోట్ల నిధులతో 32 కొత్త రహదారుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ రహదారులు పల్లె ప్రజల జీవితాల్లో కీలకమైన పాత్ర పోషిస్తాయని, కొత్త రహదారుల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడటమే కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని పేర్కొన్నారు. పల్లెల మధ్య అనుసంధానం పెరిగి, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెట్లకు తరలించగలరని, విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు వంటి వర్గాలకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని ఆమె తెలిపారు. ప్రతి పల్లె అభివృద్ధి చెందేలా, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, రహదారులు, తాగునీరు, విద్యుత్, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాలు.. ప్రతి రంగంలో ప్రభుత్వం ప్రజల అవసరాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ములుగు జిల్లాలోని గిరిజన ఆదివాసి ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, అక్కడి పల్లెలు కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్న దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. కొత్త రహదారుల నిర్మాణం ద్వారా పల్లెల మధ్య రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా పర్యాటక అవకాశాలు కూడా పెరుగుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. 'ప్రభుత్వం మంజూరు చేసిన ఈ రూ.74.43 కోట్ల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కొత్త దశకు చేరుతుంది. రహదారులు మాత్రమే కాదు, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలే మారిపోతాయి. మరింత అభివృద్ధి పల్లెల తలుపు తడుతుంది" అని సీతక్క స్పష్టం చేశారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో లోపాలు సహించం

మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతిపై తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో శుక్రవారం నాడు సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరాలో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనె, బాలమృతం, మురుకులు, బియ్యం వంటి వస్తువుల సరఫరాపై జిల్లాలవారీగా సమీక్ష నిర్వహించిన ఆమె, కొన్ని జిల్లాల్లో సరఫరా 50 శాతానికి కూడా చేరకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.చిన్నారుల సంరక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది పూర్తి బాధ్యత వహించాలని ఆదేశిస్తూ, టేక్ హెూమ్ రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రాలు ఆలస్యంగా తెరుచుకుంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మంత్రి సీతక్కతో పాటు సమీక్షలో శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావగాహనతోనే మార్పు సాధ్యం

- హైడ్రాకు అన్నివర్గాల నుంచి సహకారం
- ఆ దిశగా విజయం సాధించామన్న హైడ్రా కమిషనర్



హైదరాబాద్, అక్టోబరు 24 (జనంసాక్షి) : ప్రజల్లో అవగాహన వచ్చినప్పుడే పరిస్థితుల్లో మార్పు వస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రాను ఎందుకు ఏర్పాటు చేశారు..? హైడ్రా ఏం చేస్తుందనే విషయమై ఇప్పుడు అందరిలో అవగాహన వచ్చిందని అన్నారు. ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ కల్చర్ అండ్ డిప్లమాటిక్ రిలేషన్స్ (ఐసీసీడీఆర్) ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ డే ను పురస్కరించుకుని "మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో సంస్కరణల అవసరం" అనే అంశంపై గ్రీన్ పార్కు హెూటల్‌లో శుక్రవారం జరిగిన సదస్సులో హైడ్రా కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి పెద్ద పీట వేస్తుందని అన్నారు. ఆ దిశగా నగరంలో మెరుగైన జీవన విధానాలు పెంపొందించేందుకు హైడ్రా పని చేస్తోందని చెప్పారు. ఆ క్రమంలోనే ఆక్రమణల తొలగింపు.. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను పెద్దయెత్తున చేపట్టామని అన్నారు. ఇటీవల హైడ్రా వార్షికోత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనలో నాలుగైదు తరగతు విద్యార్థులు కూడా చెరువు ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవెల్), బఫర్ జోన్ల గురించి వివరించిన తీరే హైడ్రా పట్ల ప్రజల్లో అవగాహన వచ్చిందనడానికి నిదర్శనమన్నారు.

### భారీ వర్షాలు పడినా.. వరదలు నివారించాం..

నగరంలో చెరువులను పునరుద్ధరిస్తున్నామని.. ఆక్రమణలతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిన బతుకమ్మ కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని హైడ్రా కమిషనర్ చెప్పారు. త్వరలోనే మరో 5 చెరువులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే నాలాలను కూడా పరిరక్షించే పనిని చేపట్టామని చెప్పారు. ప్యాట్నీ నాలా విస్తరణతో 7 కాలనీలకు వరద ముప్పు తప్పించామన్నారు. నాలాల్లో పెద్దమొత్తంలో పూడికను తొలగించి ఈ ఏడాది వరద ముప్పును తగ్గించామన్నారు. చెరువులు.. వాటిని అనుసంధానం చేసే నాలాలను కాపాడుకోకపోతే.. నగరాలను వరదలు ముంచెత్తుతాయని హెచ్చరించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నివేదిక ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు మాయం అయ్యాయని, ఇప్పటికైనా అప్రమత్తం కాకపోతే మిగతా 39 శాతం కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో హైడ్రాను ఏర్పాటు చేసి.. చెరువులు, నాలాల పరిరక్షణకు పెద్ద పీట వేస్తోందన్నారు.

### 15 నెల్లో వెయ్యి ఎకరాలు కాపాడాం..

ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షించుకోవాల్సిన అవసరంపై ప్రజల్లో ఇప్పుడు పూర్తి అవగాహన వచ్చిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. హైడ్రా ఏర్పాటు చేసి ఏడాది దాటి 3 నెలల వ్యవధిలో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామన్నారు. దీని విలువ దాదాపు రూ. 60 వేల కోట్లు ఉంటుందన్నారు. రియర్ అడ్మిరల్ ఆర్. శ్రీనివాసరావు, మేజర్ ఎస్‌పిఎస్ ఓబెరాయ్ గౌరవ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ శాంతి, అభివృద్ధి కోసం సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. హైడ్రా లక్ష్యాలు ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ (ఎస్డీజీఎస్) తో అనుసంధానంగా ఉన్నాయని ఆయన అన్నారు. పద్మ కాంత హజారిక (ఓఎస్డీ/మిషన్ డైరెక్టర్, ఏపీటీడీసీఎల్, అస్సాం), సర్సింగ్ ఎంగ్టి (ఛైర్మన్, డొరోతీ వాలంటరీ అసోసియేషన్) ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

# రైతులు నాణ్యమైన పత్తి తీసుకురావాలి


- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : మద్దతు ధరకు రైతులు నాణ్యమైన పత్తిని తీసుక రావాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు.శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రైతులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా రైతులకు క్వింటాకు రూ. 8,110 కనీస మద్దతు ధరను నిర్ధారించిందని, కాగా ప్రైవేట్ మార్కెట్ ధర సుమారు రూ. 6,500గా ఉన్నదని తెలిపారు. జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ వివరించారు. రైతులు "కపాస్ కిసాన్ యాప్" ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మార్కెట్ యార్డుల్లో తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, తూకం యంత్రాలు, కంట్రోల్ రూమ్ వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ నుండి పూర్తి స్థాయిలో పత్తి కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇప్పటికే రైతు సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి సూచనలను సేకరించినట్లు తెలిపారు. రైతుల మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసి, ముందస్తుగా స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించినట్లు వివరించారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం 4,31,042 ఎకరాలు కాగా ఉత్పత్తి 33,46,926 మెట్రిక్ టన్నులుగా ఉందని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 33 జిన్నింగ్ మిల్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడిందని, రైతులు ఏవైనా సందేహాలు, సమస్యల కోసం దానిని సంప్రదించవచ్చని సూచించారు. అలాగే త్వరలోనే సోయా, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఏడి మార్కెటింగ్ గజానన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, సీసీఐ బ్రాంచ్ మేనేజర్ పునీత్ రాటి, సెంటర్ ఇన్‌చార్జ్ ఎ. శరత్, చంద్రశేఖర్ రెడ్డి, ఏవో శక్తి పాత్రో, ఏఎం మార్కెటింగ్ (సీసీఐ) పూజ, దినేష్ బిస్త్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25 అక్టోబర్ 2025

# అస్తిత్వ సాహిత్య విస్మరణ అహేతుకం



సాహితీకారులను ఒకే వేదిక మీదికి చేర్చే ఉద్దేశ్యాలతో ప్రపంచవ్యాప్తంగా విభిన్న సాహితీ కార్యక్రమాలు అనేకంగా జరుగుతూనే ఉన్నాయి. ఈ తరుణంలో తెలుగు నేలలో సాహితీ సమాజాన్ని ఒక గొడుగు కిందకు చేర్చేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అందులో భాగంగానే ముఖ్యంగా రచయితలు, పాఠకులు, అనువాదకులు, విమర్శకులు, ప్రచురణకర్తలు మొదలైన వారి మధ్య సామాజిక, సాంస్కృతిక అంశాలపై సాహిత్య వ్యాప్తిని విశాలం చేసే లక్ష్యంతో తెలుగు సాహిత్యం కేంద్రంగా సాహితీ ఉత్సవాన్ని నిర్వహించాలని ఛాయా రిసోర్స్ సెంటర్ సంకల్పించింది. ఆ క్రమంలోనే ఈ నెల 25 నాడు హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో తొలిసారిగా లిటరేచర్ ఫెస్టివల్‌ను ఆ 'ఛాయ' రిసోర్స్ సంస్థ నిర్వహించనుండడం శుభపరిణామం. ముఖ్యంగా తెలుగు సాహిత్యం కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ ఫెస్టివల్‌లో తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు దక్షణాది భాషలైన దక్కనీ (ఉర్దూ), తమిళ, కన్నడ, మలయాళ సాహితీ ప్రముఖులు ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటుండడం హర్షించదగ్గ విషయం.

దక్షిణాదిలోని తమిళ, కన్నడ, మలయాళ సమాజాల్లో సాహిత్య, సాంస్కృతిక వారసత్వం ప్రబలంగా విలసిల్లుతున్ననూ తెలుగు సమాజం అందుకు మినహాయింపుగా ఉండడం విచారకరం. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర భాషా సాహిత్యాలతో కూడా పరాయితనం కనిపిస్తుండడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు. ముఖ్యంగా ఈ తెలుగు సాహిత్యరంగలో రచయితలు, పాఠకుల మధ్య సమన్వయలేమి ఉన్నట్లు చాలా ప్రస్ఫుటంగా విదితమవుతూనె ఉంది. ఈ తరుణంలోనే 'రచయితలు మరియు పాఠకుల మధ్య వారధిగా నిలిచే లక్ష్యంతో నిర్వహించనున్న ఈ లిటరేచర్ ఫెస్టివల్ సమకాలీన సాహిత్యంపై లోతైన చర్చలకు బలమైన వేదికగా నిలువనుంది' అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఈ లిటరేచర్ ఫెస్టివల్‌లో తెలుగుతో పాటు ఇంగ్లీష్, దక్షణాది భాషలైన దక్కనీ (ఉర్దూ), తమిళ, కన్నడ, మలయాళ సాహితీ ప్రముఖులు పాల్గొనుండడంతో 'నూతన శోభ'ను సంతరించుకుంది అని చెప్పవచ్చు. 'మొత్తం 16 సెషన్‌లో 50 మంది వక్తలు పాల్గొంటారు. పాఠకులు తమ అభిమాన రచయితలను నేరుగా కలవడంతో పాటు, వారి రచనల గురించి మాట్లాడే అవకాశాన్ని ఛాయ రిసోర్స్ సెంటర్ కల్పించనుండడం ఈ లిటరేచర్ ఫెస్టివల్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. సాహిత్యోత్సవంలో వివిధ ప్రచురణ సంస్థలు 14 పుస్తకాలను ఆవిష్కరిస్తాయి. పదికి పైగా ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలను ఇక్కడ ప్రదర్శిస్తాయి' అని ఛాయ రిసోర్స్ సెంటర్ వెల్లడించడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు.

ఈ లిటరేచర్ ఫెస్టివల్‌లో 'ప్రగతిశీల, ఉదార భావరంగాలకు, వాటి వివిధ ఛాయలకు చెందిన సాహిత్యాన్నే ఈ ఫెస్టివల్ పరిగణనలోకి తీసుకుంటుంది, పలు సాహిత్య ప్రక్రియలక మరియు వాటిలోని ధోరణు లకు ప్రాతినిధ్యం వహించేవి చర్చాంశాలుగా ఉంటాయి' అని వెల్లడించడం శుభపరిణామం. ఇంతవరకు బాగానే ఉంది. అయితే ఇంత విస్తారమైన ఈ లిటరేచర్ ఫెస్టివల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కోణాల్లోనూ మరియు మహిళావాద కోణాల్లోనూ మానవీయ విలువలు, సాహిత్య - సాంస్కృతిక అంశాలకు స్థానం కల్పించకపోవడం కడు విచారకరం. వారు ఆ విధంగా వ్యవహరించడంపై 'ఇది నా ఒక్కరికి సంబంధించిన సమస్య కాదు. మొత్తం మెజారిటీ సామాజిక ప్రధాన స్రవంతికి సంబంధించిన సమస్య' అని ప్రముఖ శతాధిక గ్రంథ రచయిత, సామాజిక తత్వవేత్త, తెలంగాణ రాష్ట్ర బి.సి. కమిషన్ తొలి చైర్మన్ బి.ఎస్.రాములు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేయడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

ఆ రకంగా 'మొత్తం మెజారిటీ సామాజిక ప్రధాన స్రవంతికి సంబంధించిన సాహిత్యాన్ని ప్రయత్నపూర్వకంగా విస్మరించాలనుకోవడం ఏమాత్రం సహేతుకం కాదు. ఆ విధంగా శీతకన్నుతో వ్యవహరిస్తూ అసంబద్ధంగా వ్యవహరించడం ప్రత్యక్షంగా, పరోక్షంగా బహుజన, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజల, అలాగే మహిళల చైతన్యాన్ని మరియు సాధికారికతను నిరాకరించడమే అవుతుంది' అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అంతిమంగా 'తెలుగు సాహిత్య చరిత్రలో అస్తిత్వ ఉద్యమ సాహిత్య ప్రస్థానానికి ఇది ఒక మాయని మచ్చగా మిగిలిపోతుంది' అని చెప్పవచ్చు. సాక్ష్యాత్తు దేశంలోనే ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో పేదల యూనివర్సిటీగా వెలుగొందుతున్న ప్రతిష్టాత్మక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో బహుళ అస్తిత్వాల సాహిత్య సెషన్లకు చోటు లభించకపోవడం కడు విచారకరం. ఈ కార్యక్రమానికి హాజరయ్యేవారు సదస్సులకు భంగం కలిగించకుండా ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా తమకు తోచిన రూపాలలో ఆ లిటరేచర్ ఫెస్టివల్ లోపాలను వేదికల మీద గుర్తు చేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అందువలన నిర్వాహకులు ఇకనైననూ ఆ సంకుచిత దృక్పథాన్ని విడనాడి విశాల దృక్పథంతో ముందుకు సాగుతూ నేడు తెలుగు సాహిత్యంలో వస్తున్న సాహిత్య ధోరణులకు ప్రాధాన్యమిస్తూ అందుకు అనుగుణంగా సాహిత్య ఉత్సవాలను నిర్వహించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



- జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## పాల సేకరణ కేంద్రాల్లో
# ముల్కనూర్ పాలు పోయాలి



ఆవు,బర్రె,మేక,గొర్రెలు విభిన్న రంగులలో ఉంటాయి. కాని వాటి పొదుగు నుండి పితికిన పాలు తెల్లగా ఉంటాయి.అందుకే ఆవు నలుపైతే పాలు తెలుపు అనే సామెత వచ్చింది.అంటే ? మనిషి రూపం ప్రధానం కాదు.గుణం, నడవడిక,నైతికత ముఖ్యమని పాలతో పోల్చారు.దాదాపు 1970 వరకు తెలంగాణ గ్రామాల్లో పాలు ఊరి దాటి ప్రయాణం కాలేదు.పట్టణాలకు దగ్గరగా ఉన్న గ్రామాల నుండి మాత్రమే కొద్ది గొప్పగా హెూటల్స్, ప్రజలకు పాలు పోశారు..అలాగే వ్యవసాయాన్ని మెజారిటీ కాపుదనపు మరియు యితర కొన్ని సామాజిక వర్గాలే చేశాయి.ప్రతి వ్యవసాయ కుటుంబంలో నాగలి ఎద్దులు,ఆవులు,బర్రె/గేదె ఉండేది.ఇంకా వ్యవసాయేతర కుటుంబాల వారు కూడా పాల కొరకు బర్రెను సాధుకునే వారు. ప్రతి ఊరికి ఊర చెరువు ఉన్నట్లుగానే "ఊరబర్లు"ఉండేవి.ఊరి బర్రెలను వయస్సు మీద పడిన పెద్ద మనిషి చెరువు శిఖం,బోర్ల వెంబడి మేపి ఉపాధిని పొందేవారు. చాల మంది రైతులు పాలిచ్చే ఆవులున్న గాని బర్రె పాలనే పిండేవారు.టీ/చాయ్ ను తక్కువ మంది తాగే వారు.పాలు,పెరుగు,సల్ల/మజ్జిగ వినియోగమే ఎక్కువ ఉండేది.లీటర్ల కొద్ది పాలను దాలి కుండలో పగలంతా కాగ బెట్టి పెరుగు తోడు వేసి సల్ల చేసి వెన్నతో నెయ్యి చేసేవారు.ఇక సల్లను వ్యవసాయ పనులకు వచ్చే కూలీలకు, పాలేర్లకు ఉదారంగా పోసేడి వారు.

క్రీస్తు పూర్వం 3,300 1300 మధ్య సింధు నాగరికత ప్రారంభం నాటికి జీబు పశువులను పాల కోసం పెంపకం చేశారని చరిత్ర చెపుతోంది.భారత దేశంలో 1919 లో బ్రిటిష్ వలస పాలకులు పాడి జంతువుల గణనను చేశారు.1920లో ఆధునిక పాల ప్రాసెసింగ్ మార్కెట్ గురించి ప్రయత్నాలు మొదలెట్టారు.పాల ఉత్పత్తి దారులు గుజరాత్ లోని ఆనంద్ లో త్రిభువందాస్ కిషిబాయ్ పటేల్ నాయకత్వమున 1946 డిసెంబర్
14 న "కైరా డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్"(కెడిసిఎంపియుఎల్) ను స్థాపించుకున్నారు.1948 లో బాంబే మిల్క్ స్కీమ్‌కు "పాశ్చరైజ్డ్ పాల సరఫరాను ప్రారంభించారు. ప్రభుత్వం సహకారంతో "వర్గీస్ కురియన్" అమెరికా మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను పూర్తి చేసిన పిదప భారత్ కు వచ్చాడు. కాని బర్రె/గేదె పాలలో ఉన్న అధిక కొవ్వు పదార్థం కారణంగా స్ప్రే ఎండి పోదు. ప్రపంచంలోనే మొదటిసారి "వర్గీస్ కురియన్,హరి చంద్ మేఘా దలయా" కృషి వలన గేదె పాల స్ప్రే- డ్రైయర్‌ను కనుగొన్నారు. వీరికి త్రిభువందాస్ కిషిబాయ్ పటేల్ కూడా చేయూతను ఇచ్చాడు. పాశ్చరైజ్డ్ పాలను దాని పరిమాణంలో దాదాపు 50 శాతం వరకు తయారైన పిదప వేడిగా ఉన్న గదిలో స్ప్రే అయిన వెంటనే నీరు ఆవిరై పాలు సూక్ష్మ కణాలుగా వెలువడి డ్రమ్ డ్రయింగ్ మరియు ఫ్రీజ్ డ్రైయింగ్ వంటి ప్రక్రియల ద్వారా పాలు పొడిగా మారుతుంది. అట్లా కిలో పాల పొడిని ఉత్పత్తి చేయడానికి 10 లీటర్ల పాలు అవసరం అవుతాయి.

కరీంనగర్ పాల డైరీని 1971 అక్టోబర్ 16 న అప్పటి ముఖ్యమంత్రి పీవీ.నరసింహారావు,వ్యవసాయ మంత్రి జె.చొక్కారావు ఆధ్వర్యంలో స్థాపించబడింది. 12 వేల లీటర్ల పాల సేకరణతో మొదలై 2018 నాటికి ఉత్తమ నాణ్యత గల పాల మరియు పాల ఉత్పత్తుల భారతీయ వ్యవసాయ అవార్డ్,2019లో ఉత్తమ రిటైలర్ హౌస్ ఇండియా అవార్డ్,2020 లో ఉత్తమ మధ్య తరహా కంపెనీ ఇండియా డైరీ, ఇంకా చాల అవార్డ్ లను సాధించుకుంది.ప్రతి రోజు సుమారు 1,000 గ్రామాల నుండి 70 వేల పాడి రైతుల సభ్యులను కలిగి,రోజుకు 1.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుంది. ముల్కనూర్ పాల డైరీ 2002 ఆగస్ట్ 17 న ఎకె విశ్వనాథ రెడ్డి నాయకత్వమున 375 మంది సభ్యులతో ఏర్పాటైంది. 67 గ్రామాల మహిళా సహకార సంఘాల నుండి 8 వేల లీటర్ల పాల సేకరణతో మొదలై రోజుకు 65 వేల లీటర్ల పాల సేకరణకు ఎదిగింది.21వేల మంది మహిళా పాడి రైతుల సభ్యులను కలిగి, రోజుకు లక్ష లీటర్ల పాలను ప్రాసెసింగ్ సామర్థ్యంకు అభివృద్ధి చెందింది. రాష్ట్రపతి నుండి నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ జాతీయ స్థాయి సహకార ఎక్సలెన్స్ అవార్డ్,నేషనల్ డైరీ డెవలప్ మెంట్ బోర్డ్ డైరీ ఎక్సలెన్స్ అవార్డ్ ఇంకా అనేక అవార్డ్ లను సాధించింది ఆదర్శ మహిళా డైరీగా పేరొందింది.

గ్రామాలలో ప్రతి రోజు పాడి రైతుల నుండి ""పాల సేకరణ కేంద్రాల ద్వారా "" కరీంనగర్ పాల డైరీ మరియు ముల్కనూర్ పాల డైరీ పాలను సేకరించి పాల ప్రాసెసింగ్ కేంద్రానికి ట్రాన్ పోర్టు చేసుకుంటున్నారు.ప్రతి గ్రామంలో కరీంనగర్ పాల డైరీ పాల సేకరణ కేంద్రాలలో రైతుల నుండి సేకరించిన పాల నుండి "గ్రామ ప్రజలకు కూడా లీటరు పాలకు రూ.80 చొప్పున అమ్ముచున్నారు. అందువలన మా గ్రామ పాడి రైతుల పాలను తాగుచున్నామని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.కాని "ముల్కనూర్ పాల డైరీ పాల సేకరణ కేంద్రాలలో మాత్రం పాడి రైతుల నుండి సేకరించిన పాల నుండి గ్రామ ప్రజలకు అమ్మడానికి నిరాకరించుచున్నారు. అందువలన గ్రామ ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.పాల సేకరణ కేంద్రాల నుండి సేకరిస్తున్న పాలు మా గ్రామ పాడి రైతుల పాలని, అందులో మా శ్రమ కూడా ఉందని ప్రశ్నించుచున్నారు. ప్రతి పాడి రైతు వ్యవసాయ ఉత్పత్తి పనులలో మేము కూడా శ్రమిస్తున్నామని గుర్తు చేస్తున్నారు.

గ్రామస్తుల అసంతృప్తి కార్య రూపం దాల్చకముందేముల్కనూర్ డైరీ మరియు యితర పాల డైరీల పాలక మండళ్లు నిర్ణయం తీసుకుని పాల సేకరణ కేంద్రాలలో గ్రామ ప్రజలకు కూడా పాలు పోసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేరుగు రాజయ్య
9441440791

## ఆమె పోరాటం క్యాంపస్ నుంచి..
# ఊరు వాడకూ



బీహార్ రాష్ట్రంలోని దిఘా (పాట్నా) అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కి చెందిన కామ్రేడ్, ప్రొఫెసర్ దివ్య గౌతమ్ పోటీ చేస్తుంది. అక్టోబర్ 16న నామినేషన్ వేసింది. మహాకూటమి మద్దతు లభించింది. ఆమె బాలీవుడ్ దిగవంత సినీ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ బంధువు. ఆమె ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేయటం బీహార్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. దిఘా నుంచి 2015, 2020లో బిజెపికి చెందిన సంజీవ్ చౌరసియా ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం ఆయనపై దివ్య గౌతమ్ పోటీలో నిలిచారు.

గత 15 ఏళ్లుగా సీపీఐ (ఎంఎల్) పార్టీతో ఆమెకు ప్రత్యేక అనుబంధాన్ని కలిగి ఉంది. మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత, వృత్తి విద్య కోర్సుల ఫీజుల పెంపుపై ఆందోళనలు, పోరాటాలు చేసింది. ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా) నాయకురాలిగా దివ్య గౌతమ్ 2012లో జరిగిన స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీ చేసింది. ఏబీవీపీకి చెందిన ఆశిష్ సిన్హా పై స్వల్ప ఓట్లతో ఓడిపోయింది. మతతత్వ రాజకీయాలను ఎండగడుతూ ముందుకు సాగింది. పాట్నా మహిళా కళాశాల విద్యార్థినిలలో బాగా ప్రాచుర్యం పొందింది. జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ లో డిగ్రీ, అదే సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ చేసింది. హైదరాబాద్ టీఐఎస్ఎస్ నుంచి ఎంఏ పట్టా తీసుకున్నారు. ప్రొఫెసర్ దివ్య గౌతమ్ బీహార్ ప్రభుత్వంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా తన వృత్తిని విడిచిపెట్టింది. పాట్నా విశ్వవిద్యాలయంలో బోధించడానికి ఎంచుకున్న బహుముఖ వ్యక్తిత్వం ఆమెది. సామాజిక సేవ, పరిశోధనను ఎంచుకుంది. ఈ కాలంలో ఇది అరుదైన నిర్ణయం. జూనియర్ రీసెర్చ్ ఫెలో అర్హత కలిగిన పీహెచ్డీ స్కాలర్. సామాజిక రాజకీయ నిబద్ధత కలిగిన దివ్య గౌతమ్ రంగ స్థల కళాకారిణి, సాహిత్యంలో తన ప్రత్యేక ఒరవడిని చాటారు. విద్య, ఉపాధి, లింగహక్కులు, దళితుల సమస్యలు, మహిళల సాధి కారత, అణగారిన వర్గాల సామాజిక న్యాయంపై కృషిని కొనసా గించింది. సాధారణ ప్రజానీకం కోసమే తన ప్రస్థానం కొనసాగిస్తున్నట్లు ఆమె చెబుతోంది.

2020 అసెంబ్లీ ఎన్నికల్లో దిఘా నియోజవర్గం నుంచి లిబరేషన్ అభ్యర్థిగా ట్రేడ్ యూనియన్ నాయకురాలు కామ్రేడ్ శశి యాదవ్ పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ఆమె ప్రస్తుతం శాసనమండలి సభ్యురాలుగా ఉంది. దీంతో ఈ నియోజకవర్గం నుంచి లిబరేషన్ పార్టీ 34 ఏళ్ల దివ్య గౌతమ్ ను వ్యూహాత్మకంగా బరిలో దించింది. ఈ ఎన్నికల్లో ఆమె పోటీ చేయడం ఓ సంచలన నిర్ణయంగా స్థానిక ప్రజలు చూస్తున్నారు. కేవలం క్యాంపస్ కే ఆమె పోరాటం పరిమితం కాలేదు, క్యాంపస్ నుంచి ప్రతి ఊరుకూ, వాడకూ మారింది. ముఖ్యంగా ఇక్కడ పాతుకుపోయిన బిజెపి పట్టును ఆమె సవాల్ చేస్తుంది. బిజెపి పాలనలో ప్రాథమిక, పౌర సమస్యలు పరిష్కారం కాలేదని, దీర్ఘకాలిక, తక్షణ సమస్యలు అలాగే ఉన్నాయని ప్రచారం చేస్తుంది. ఆమె గెలుపు ఈ ప్రాంత సమస్యల పరిష్కారంలో అర్థవంతంగా ఉండటమే కాకుండా అసెంబ్లీ గౌరవాన్ని, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు, ప్రజల హక్కులు కాపాడేందుకు ఆమె కృషి ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

- మామిండ్ల రమేష్ రాజా
సెల్ : 78932 30218

## వాణిజ్య ఘర్షణల యుగంలో నిలకడలేని
# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ!



నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితి గాలుల్లో తూలుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి తాజాగా విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ 2025 నివేదిక ప్రకారం ప్రపంచ వృద్ధి దిశ క్రమంగా మందగిస్తోంది. 2024లో 3.3 శాతంగా ఉన్న గ్లోబల్ వృద్ధి 2025లో 3.2 శాతానికి, 2026లో 3.1 శాతానికి తగ్గుతుందని అంచనా. ఈ మందగింపుకు మూల కారణాలు వాణిజ్య ఘర్షణలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విధాన అనిశ్చితి అని ప్రపంచ ఆర్థిక సంస్థ (ఐఎంఎఫ్) స్పష్టం చేసింది. ఒకప్పుడు బహుళపాక్షిక వాణిజ్య సహకారంతో సాగిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పరస్పర అవిశ్వాసం, టారిఫ్ పెరుగుదల, సరఫరా శృంఖల విఘాతం వంటి సవాళ్లతో తంటాలు పడుతోంది.వాణిజ్య విధానాల్లో సడలింపుల స్థానంలో కఠినత పెరిగి, ఉత్పత్తి-పంపిణీ వ్యవస్థల్లో కొత్త అవరోధాలు ఏర్పడుతున్నాయి. అమెరికా టారిఫ్ పెంపులు ఆసియా ఎగుమతులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. చైనాలో నిర్మాణాత్మక మందగింపు, యూరోపియన్ ప్రాంతంలో శక్తి ధరల తూగింపులు, లాటిన్ అమెరికాలో అప్పు భారంఇవన్నీ కలిపి ప్రపంచ ఆర్థికతను సున్నితంగా మార్చేశాయి. ఐఎంఎఫ్ ప్రకారం 2025లో ఆసియా వృద్ధి 4.5 శాతం చుట్టూ ఉండొచ్చని భావించినా, ఘర్షణల ప్రభావంతో 2026లో 4.1 శాతానికి పడిపోవచ్చని అంచనా ఉంది.

2.ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల మనోభావం కూడా తారుమారవుతోంది. విధాన అనిశ్చితి పెరిగేకొద్దీ రిస్క్ ప్రీమియాలు పెరిగి కరెన్సీలు తూలుతున్నాయి. వడ్డీ రేట్లు స్థిరంగా లేవు, బాండ్ల మార్కెట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఐఎంఎఫ్ హెచ్చరిక సూటిగా ఉందిమరింత టారిఫ్‌లు వస్తే, మరింత ఘర్షణలు చెలరేగితే ప్రపంచ వృద్ధిపై ఒత్తిడి మరింత తీవ్రమవుతుంది.ఈ గ్లోబల్ తుఫానులో భారతదేశం ఒక ప్రత్యేక స్థానం సంపాదించింది. IMF నివేదిక ప్రకారం భారత వృద్ధి 2025లో 6.2 శాతం, 2026లో 6.3 శాతానికి చేరవచ్చని అంచనా. అనేక అంతర్జాతీయ సంస్థలు దీన్ని 6.4 శాతం వరకు పెంచి చూపుతున్నాయి. ఇది ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే అత్యంత వేగవంతమైన వృద్ధి. యువ జనాభా పెరుగుదల, డిజిటల్ మార్పులు, దేశీయ వినియోగం, సేవా రంగ విస్తరణ వంటి అంశాలు ఈ బలానికి మూల కారణాలు.అయినా సవాళు చిన్నవికావు. గ్లోబల్ వాణిజ్య ఘర్షణలు భారత ఎగుమతులను ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. సరఫరా శృంఖల విఘాతం, ముడి పదార్థాల దిగుమతులలో వ్యత్యాసం, డాలర్ బలవంతం, చమురు ధరల ఎత్తుపల్లాలు భారత ఆర్థికతపై ఒత్తిడిని పెంచుతున్నాయి. విధాన మార్పులు స్పష్టత లేని స్థితిలో కొనసాగితే పెట్టుబడిదారుల నమ్మకం తగ్గే ప్రమాదం ఉంది.

ఈ పరిస్థితిలో భారతదేశం తీసుకోవాల్సిన దిశ స్పష్టంగా ఉంది. వాణిజ్య విధానాల్లో సమతౌల్యం సాధించి ఎగుమతి మార్కెట్ల విభిన్నీకరణను పెంచడం అత్యవసరం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహాన్ని బలోపేతం చేయడం, దిగుమతి నియంత్రణలను సులభతరం చేయడం, సరఫరా శృంఖల పునరుద్ధరణకు వ్యూహాత్మక చర్యలు తీసుకోవడం అత్యవసరమైన దశలు. ద్రవ్య విధానంలో స్థిరత్వం కల్పించి ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, దేశీయ పెట్టుబడులను ఆకర్షించే పన్ను-ప్రోత్సాహకాలు అమలు చేయడం ద్వారా దీర్ఘకాలిక బలం సాధ్యమవుతుంది.


ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చితి ఎక్కువైనంత మేరకు స్వావలంబన వైపు కదిలే భారత ప్రయత్నం వేగవంతం కావాలి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, హరిత ఇంధనాల ప్రోత్సాహం, ఎగుమతి సాంకేతికతల ఆధునికీకరణ వంటి చర్యలు దీర్ఘకాలిక స్థిరత్వానికి మార్గం చూపుతాయి. భారతీయ ఆర్థికత బలమైన అంతర్గత డిమాండ్ ఆధారంగా సాగుతున్నప్పటికీ, గ్లోబల్ మార్పుల ప్రభావం తప్పించుకోలేనిది.

మొత్తం దృశ్యం చెప్పేదేమిటంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక సున్నిత సమతౌల్యంపై నిలబడి ఉంది. వాణిజ్య ఘర్షణల అగ్నిజ్వాలల్లో పాలసీ దిశలు తడబడితే గ్లోబల్ వృద్ధి మరింత కుంచించుకుపోతుంది. ఐఎంఎఫ్ స్పష్టం చేసినట్లుగా ప్రమాదాలు దిగువ వైపే కదులుతున్నాయి. ఈ నేపథ్యంలోని భారతదేశం ఆర్థిక స్థిరత్వం, ద్రవ్య నియంత్రణ, వాణిజ్య విస్తరణ అనే మూడు దిశల్లో క్రమశిక్షణతో అడుగులు వేస్తే మాత్రమే భవిష్యత్తులో గ్లోబల్ వేదికపై నిలకడగా నిలవగలదు. ఈ అస్థిరత యుగం మనకు ఇచ్చిన స్పష్టమైన పాఠం ఇదే ః నిర్లక్ష్యం అనేది ఆర్థిక వెనుకబాటుకు దారి, సక్రమ సమన్వయం మాత్రమే స్థిరమైన అభివృద్ధికి పునాదిగా మారగలదు.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం.

# తెలంగాణ సాయుధ పోరాటంలో కక్కిరేణి



తెలంగాణ నేలకు ఘనమైన చరిత్ర ఉన్నది. ఇక్కడి ప్రతి మట్టి కణం పోరాటాన్ని శ్వాసించింది. అనాదిగా పరాయి పాలనకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పతాకను ఎత్తడానికి ఈ నేల అహరహం తపించింది. ఆ స్ఫూర్తితోనే భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దొరతనానికి వ్యతిరేకంగా పిడికిలెత్తి నిలిచింది. తలుపు పెట్టి కొడితే పిల్లి కూడా పులిలా తిరగబడ్డట్లు, గడ్డి పోచలు కూడా గడ్డపారలై ఎదురు తిరిగినట్లు సామాన్య జనం సైతం రాజరికాలనీ పెత్తందారీ వ్యవస్థల్ని ఎదిరించి ప్రశ్నించిన పౌరుషాల గడ్డ ఇది. ఈ నేల మీద ఏ ఊరిలో అడుగు పెట్టినా ఉద్యమాల చరిత్ర పుటలు పుటలు గా సామాన్య జనం నోళ్ల నుండి వినిపిస్తుంది. తెలంగాణ సాయుధ పోరాటంలో తమ మాన ప్రాణాలను త్యాగం చేసిన ఎందరో వీరులు ఇంకా చరిత్రకు ఎక్కనే లేదు. అట్లాంటి వీరుల గన్న పోరుగడ్డ కక్కిరేణి. ఉమ్మడి నల్లగొండ జిల్లా నేటి యాదాద్రి భువనగిరి జిల్లాలో రామన్నపేట మండలంలో ఒక మూలకు విసిరివేయబడ్డ ట్లుగా ఉన్న మారుమూల గ్రామం కక్కిరేణి. ఎంతో చైతన్య శీలత కలిగిన గ్రామమిది. నేటికీ ఎందరో రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, విశ్వవిద్యాలయం ఉపకులపతుల వరకు ఎందరో గొప్ప వారిని అందించిన నేల ఇది. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చరిత్రకెక్కని వీరుల అందించిన నేల ఇది.

నిజాం నిరంకుశ పాలనలో గ్రామాల్లో దొరల జాగీర్దార్ల ఏలుబడిలో సామాన్య జనం ఎదుర్కొన్న కష్టాలు అన్ని ఇన్ని కావు. దొరల భూముల్లో జీతగాళ్లుగా ఎంత కష్టం చేసినా నెలకు కుండెడు వడ్లు జీతం కూడా ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకునే దుస్థితి. వెట్టి చాకిరి చేయకపోతే కొట్టి చంపిన అమానవీయం ఊరూరా కనిపిస్తుండేది. దీనికి కక్కిరేణి మినహాయింపు ఏమీ కాదు. ఇక్కడ కూడా దొరల, పోలీస్ పటేల్ పెత్తనంలో ప్రజలు నలిగిపోయేవారు. గ్రామ కరణం ఎదురైతే వారిని దాటిపోయే వరకు చెప్పులు చేత పట్టుకుని గడగడ వణుకుతూ ముందుకు నడవ వలసినదుస్థితి. జీతగాళ్లకు జీతం పెంచాలని సంఘపోల్లు పోరాటం చేస్తున్నారని తెలిసి తాము కూడా సంఘంలో కలవాలని నిర్ణయించుకున్నారు ఈ గ్రామంలోని కొందరు యువకులు. ఆ సంఘం మరేదో కాదు. ఆనాటి ఆంధ్ర మహాసభ నుండి కమ్యూనిస్టు పార్టీగా ఆవిర్భవించిన రహస్య దళాలే. ప్రముఖ తెలంగాణ సాయుధ పోరాట యోధులు కట్కూరి రామచంద్రారెడ్డి , కాచం కృష్ణమూర్తి కప్రపెల్లి గ్రామానికి చెందిన మరొక పోరాటయోధుడు దూదిపాల సత్తిరెడ్డి నాయకత్వంలో దొరల భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఎదురు తిరిగారు. ఎన్నారం గ్రామంలో మిల్ట్రీ క్యాంపులు ఏర్పాటు చేశారు. దీనికి గ్రామస్థాయిలో నాయకత్వం వహించిన వారు సంగెం వెంకట నరసయ్య, భాష బోయిన లక్ష్మీనరసు, బుర్ర యాదగిరి. వీరు ముగ్గురు క్రియాశీలకంగా సంఘంలో సభ్యులయ్యారు. జీతగాండ్లకు జీతాలు పెంచాలని పెద్ద ఉద్యమమే నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ ఒత్తిడికి తలొగ్గిన భూస్వాములు నెలకు తూమెడు జీతం ఇవ్వడానికి పెండ్లి అయిన వారికి మూడు కుండల జీతం ఇవ్వడానికి అంగీకరించారు. దొరను చూస్తేనే తలవంచుకొని గడగడ వణికే స్థాయి నుండి దొరను ఎదిరించి ప్రశ్నించి జీతాన్ని పెంచుకునే స్థాయికి ఎదగడం అంటే ఆ రోజుల్లో ఇది గొప్ప విజయమే. కమ్యూనిస్టులకు సహకరిస్తున్నారనే అక్కసుతో కమ్యూనిస్టు ఇన్ ఫార్మర్ లుగా భావించి అనేకమందిని అనేక చిత్రహింసలకు గురి చేసిన సంఘటనలు కక్కిరేణిలో కథలు కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. గుతుపలు , బరిసెలు, వడిసేల తో కమ్యూనిస్టులను ఊరికి రానీయకుండా చేయాలని గ్రామంలోని పెద్దమనుషులు గుండాల నుండి దొంగలు వస్తున్నారని విష ప్రచారం చేసి కమ్యూనిస్టులపై దాడులు జరిపే ప్రయత్నం కూడా జరిగినదని కొందరు చెప్పారు. రజాకార్లు నిజాం పోలీసులు అకారణంగా వీపులపై బండలు పెట్టి ఎండలో వంగో పెట్టి శిక్షించిన అమానవీయ సంఘటనలు అనేకం చెప్తుంటారు. వీటిని తట్టుకొని కూడా కమ్యూనిస్టు పార్టీలో కొనసాగుతూ నిజాం పరిపాలనకు చరమగీతం పాడడానికి కమ్యూనిస్టు తో కలిసి పోరాటం చేసిన వీర యోధులు జైలు శిక్షలు కూడా అనుభవించారు. వారిలో కక్కిరేణి గ్రామానికి చెందినకట్ట వెంకట రాములు కన్నెబోయిన నరసింహ వంటి వారు దళాలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. గ్రామంలో గుప్పల సంఘాలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన సాగర్ల ధర్మయ్య ఆనాడు అర్ధరాత్రి వేళ లేదా పట్టపగలు జన సంచారం లేని వేళ కక్కిరేని అక్కినెపల్లి గ్రామాల మధ్య రహస్య ప్రాంతానికి వచ్చే కమ్యూనిస్టు పార్టీ నేతల కోసం సద్దులు మోయడం వంటి సంఘటనలు గుర్తు చేసుకుంటూ ఉంటారు.

1948 సెప్టెంబర్ లో హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం అయ్యే సందర్భంలో జరిగిన సంఘర్షణ పూర్వక వాతావరణం నేటికీ కొంతమంది వృద్ధులు చర్చించుకుంటూ ఉంటారు. అక్కనపల్లి గ్రామానికి చెందిన బషీరుద్దీన్ అనే రజాకారుల అనుయాయుడు అక్కనపల్లి కక్కిరేణి గ్రామాల్లో వందలాది ఎకరాల భూమిని కలిగి ఉన్నాడు. హైదరాబాద్ విలీన సమయంలో ఆ ఆస్తులను వదిలి పాకిస్తాన్ పారిపోయాడు. ఆ సమయంలో కమ్యూనిస్టులు ఆ భూములను పేదవారికి పంచే ప్రయత్నం చేశారు. ఈ సమయంలోనే ఇక్కడి కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచడానికి వల్లభాయ్ పటేల్ పంపిన సైన్యం ఒకవైపు, నిజాం బామ్మర్ది కాశీం రజ్వి ప్రైవేట్ సైన్యం రజాకార్లు మరొకవైపు కమ్యూనిస్టులపై దాడులు చేశారు. మిలటరీ దళాలు గ్రామం పై దాడి చేసి కమ్యూనిస్టుల జాడ చెప్పమని గ్రామస్తులను ఎంతగానో హింసించారు. గ్రామానికి చెందిన సంగం వెంకట నర్సు భారత సైన్యం చేతిలో హత్య గావించబడ్డాడు. సంఘం వెంకట నర్సు ఇంటిపేరు ఎవరికి తెలియదు. బహుశా ఆయన సంఘంలో నాయకుడు కావడం చేత ఆ పేరు వచ్చి ఉండవచ్చు అని గ్రామానికి చెందిన కన్నెబోయిన నరసింహ అనే ఆనాటి సాయుధ పోరాట ప్రత్యక్ష సాక్షి అభిప్రాయపడ్డారు. సైనికులు సంఘం వెంకట నర్సును పట్టుకొని తీసుకువెళ్లి కాల్చి చంపినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సైనిక బలగాలు గ్రామాలకు వచ్చి దొరికిన వారిని దొరికినట్టే చిత్రహింసల గురి చేశారని. మూడు సంవత్సరాల కాలాలపాటు అక్కడే భూమిలో బియ్యాన్ని పాతిపెట్టుకొని, దాచిపెట్టుకొని గడిపిన పరిస్థితి ఓ సందర్భంలో సైనిక బలగాలు వచ్చినప్పుడు చెట్టుపైనే ఉండి బిక్కుబిక్కుమంటూ దాచుకున్న పరిస్థితి కూడా ఉందని మర్రి మల్లయ్య తన నిజ జీవితంలో జరిగిన వివరాలు తెలిపారు. జైలుకు వెళ్లి వచ్చిన, పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న తెలంగాణ సాయుధ పోరాట యోధులు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొన్ని దశాబ్దాల కాలం పాటు ఇటీవల వరకు బతికే ఉన్నారు. వీరిని ఏ ప్రభుత్వము గుర్తించలేదు. సాయుధ పోరాట యోధులకు ఇచ్చిన పెన్షన్ సౌకర్యం వీరికి దక్కలేదు. సరి కదా వీరి పోరాటాన్ని చరిత్రలో కూడా ఎక్కడా ప్రస్తావించిన దాఖలాలు లేవు. ఇది ఒక కక్కిరేణి గ్రామ చరిత్ర మాత్ర మే. ఇట్లా ఊరురా ఆనాటి తరాన్ని కదిలిస్తే అసలైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర వెలుగులోకి వస్తుంది.

- సాగర్ల సత్తయ్య
7989117415

# విద్యార్థులకు తప్పని వేధింపులు..!!

- కామ కోరికలు తీర్చుకోవడం కోసం ఒకరు
- స్పెషల్ క్లాసుల పేరుతో మరొకరు
- పాఠశాలలో విద్యార్థులచే వెట్టి చాకిరి చేస్తున్నది ఇంకొకరు
- నిద్రమత్తులో విద్యాశాఖ అధికారులు
- అధికారుల పర్యవేక్షణ లోపం పంతుల ఆడిందే ఆట పాడింది పాట
- ప్రభుత్వ పాఠశాలల్లో గాడి తప్పుతున్న విద్యా విధానం
- బడిపంతులపై పెరుగుతున్న ఫోక్స్ కో కేసులు
- సస్పెన్షన్ శరమాములే.. మళ్లీ యధా రాజ తథాస్థితి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పవలసిన గురువులు.. బాధ్యత మర్చిపోయి శిష్యురాళ్లపై కన్నేసి కామ కోరికలు తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. గురువుకు శిష్యురాలికి ఉన్న పవిత్ర బంధాన్ని తెంచే ప్రయత్నం చేస్తున్నాను. శిష్యురాళ్ల ప్రైవేట్ భాగాలను తాకి గురుభక్తికి కళంకం తెస్తున్నారు. జిల్లాలో ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలలో ఇది సర్వసాధారణమైపోయింది. జిల్లా వ్యాప్తంగా తరచు బడి పంతులపై ఫోక్స్ కో కేసులు నమోదు కావడం విద్యాశాఖను కలవరం రేపుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బడిపంతుల్లా పని తనం వల్ల ఉత్తీర్ణ శాతంలో జిల్లా లాస్ట్ స్టేజిలో ఉండగా ఫోక్స్ కో కేసుల్లో మాత్రం ముందంజలో ఉండడం విశేషం. వివరాల్లోకి తెలంగాణ పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంచడానికి పోలీస్ శాఖ ప్రతి ఏటా వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తుంది. పోలీస్ శాఖ నేరాలను తగ్గించడానికి ఎంత కృషి చేస్తున్న బహిరంగ ప్రదేశాల్లో తరహా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినీల పట్ల వేధింపులు ఎక్కువయ్యాయి. ప్రతి ఏడాది ఉత్తీర్ణ శాతంలో జిల్లా లాస్ట్ స్టేజిలో ఉంటే ఫోక్స్ కో కేసుల్లో మాత్రం ముందంజలో ఉంటుంది. ఇటీవల జరిగిన నేరాలను విశ్లేషిస్తే జిల్లా విద్యాశాఖ పరిధిలో ఉన్న ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీల పట్ల బడిపంతుల్లా లైంగిక వేధింపులు అధికమైనట్లు స్పష్టంగా కనిపిస్తుంది. తాజాగా వికారాబాద్ జిల్లా తాండూర్ మండలంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న సామాన్య శాస్త్రం బోధించే బడిపంతులు రాఘవేందర్ రెడ్డి పై కరణ్ కో ట్ పోలీసు స్టేషన్ లో ఫోక్స్ కో కేసు నమోదయింది. ఈ మేరకు తాండూర్ రూరల్ సీఐ నాగేష్ కరణ్ కో ట్ ఇన్చార్జి ఎస్ఐ విట్టల్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బడిపంతులు రాఘవేందర్ రెడ్డి అదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తరచూ విద్యార్థిని ప్రైవేట్ భాగాలకు చేతులు తగిలిస్తూ వేధింపులకు గురి చేశారు. ఈ విషయమై సదరు విద్యార్థి పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేసింది. ప్రధానోపాధ్యాయుడు సామాన్య శాస్త్రం బోధించి ఉపాధ్యాయుడు రాఘవేందర్ రెడ్డిని అనేకసార్లు మందలించిన ఆయన ప్రవర్తన తీరు మారలేదు. విద్యార్థిని పట్ల మరోసారి రెచ్చిపోయి వేధింపులకు గురి చేశారు. ఈ విషయమై విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయడంతో ఉపాధ్యాయుడు రాఘవేందర్ రెడ్డి కి పాఠశాలలో దేహశుద్ధి చేశారు. అనంతరం కరణ్ కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ నాగేష్ ఎస్సై విట్టల్ రెడ్డి కేసు దర్యాప్తు జరిపి ఉపాధ్యాయుడు రాఘవేందర్ రెడ్డి పై ఫోక్స్ కో కు కేసు నమోదు చేశారు. ఇది ఇలా ఉంటే ధరూర్ తాండూర్ నవాబ్ పేట్ వికారాబాద్ మండలాలలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న బడిపంతులు విద్యార్థులు పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆయా మండలాల పోలీసులు బడిపంతులపై ఫోక్స్ కో కేసులు నమోదు చేశారు. ఈ కేసులన్నీ



కోర్టు పరిధిలో విచారణలో ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు జరగగానే జిల్లా విద్యాశాఖ స్పందించి మండల విద్యాశాఖ అధికారుల ద్వారా నివేదికలు తీసుకొని విద్యార్థినీలను లైంగికంగా వేధించిన ఉపాధ్యాయులను సస్పెండ్ చేసింది. వీరిపై కోర్టులో కేసు విచారణ జరుగుతుండగానే అదే విద్యాశాఖ నేరానికి పాల్పడిన బడిపంతులపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేసి వేసింది. బడిపంతులపై కేసులు ఉన్న మళ్లీ వారు యధావిధిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇంకేముంది ఈ యధారాజ తథాస్థితి అన్నట్లు కొందరు మరో పాఠశాలలో మరో విద్యార్థిని పట్ల లైంగిక వేధింపులకు పాల్పడి రెండోసారి ఫోక్స్ కో ఇరుక్కున్న సంఘటనలు ఉన్నాయి. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న బడిపంతుల పని తీరుపై పర్యవేక్షణ కొరవడిన కారణంగానే ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల లైంగిక వేధింపులు ఘటనలు వెలుగులోకి రావడం లేదని విమర్శ వినిపిస్తుంది. వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిగా రేణుక దేవి కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. కొన్ని గురుకులాలు ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలలపై డీఈవో రేణుక దేవి పర్యవేక్షణ ఉంటుంది. డీఈవో కార్యాలయానికి పరిమితం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గురుకులాలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలు వెలుగులోకి రావడం లేదు. విద్యార్థినీలు వారి తల్లిదండ్రులు మీడియా వెలుగులోకి తెప్పిస్తే తప్ప స్వయంగా వారి పర్యవేక్షణలో ఒక్క కేసు వెలుగులోకి రాలేదు. జిల్లా విద్యార్థినీలకు తల్లిగా ఉన్న డిఇఓ రేణుక దేవి ఆయా పాఠశాలకు వెళ్లినప్పుడు ప్రత్యేకంగా విద్యార్థినీలతో ముచ్చటించకపోవడమే కారణంగా చెప్పవచ్చు.

## రాష్ట్రంలో 5 లక్షల మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి

- మత్స్యకారులు ప్రమాదాలకు గురయినట్లయితే కోటి 40 లక్షల ఉచిత బీమా
- రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**తాండూరు, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పెను మార్పులు తీసుకువస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య , క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం కోట్ పల్లి ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల ప్రారంభోత్సవ కార్యక్రమానికి తాండూరు శాసనసభ్యులు బుయ్యని.మనోహర్ రెడ్డి తో కలిసి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కోట్ పల్లి చెరువులో మూడు రకాలతో కూడిన 10 లక్షలపై చీలుకు చేప పిల్లలను వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ముదిరాజు కుటుంబాలు కులవృత్తిని ఆధారంగా చెరువుల్లో చేపలను పట్టుకొని తమ కుటుంబాలను పోషించుకుం టారన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని సదుద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా పెద్ద ఎత్తున రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువులలో చేప పిల్లలను వదలడం జరుగుతుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వాలు మత్స్యకారులను సరిగ్గా పట్టించుకోలేదని చెరువుల్లో ఎన్ని చేపలను వదిలారో కూడా లెక్కలు లేవని ఆయన అన్నారు. జిల్లాలో ఒక కోటి 29 లక్షల చేప పిల్లలను వదిలేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం జరిగిందని దీనికి కోటి 7 లక్షల రూపాయలను వెచ్చించడం జరుగుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని 5 లక్షల మత్స్య కారుల కుటుంబాలకు జీవనోపాధి కలిగే విధంగా 123 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. మత్స్యకారులు ఏదైనా ప్రమాదాలకు గురి అయినట్లయితే కోటి 40 లక్షల ఉచిత బీమాకు గాను ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స శాఖ కార్పోషన్ చైర్మన్ మెట్టి సాయి కుమార్, మురిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, స్పోర్ట్స్ చైర్మన్ శివా రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, మత్స్య శాఖ అదనపు సంచాలకులు శ్రీనివాస్, ఏడి వెంకన్న, ఆర్డిఓ వాసుచంద్ర, జిల్లా పశుసంవర్ధక అధికారి సదానందం, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో డానియల్, ముదిరాజ్ సంఘం జిల్లా ఇంచార్జ్ శ్రీధర్ బాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈసీఐ మార్గదర్శకాల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు డి ఆర్ సి సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ తో పాటు ఎన్నికల సామాగ్రి భద్రపరిచేందుకు , లెక్కింపు కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్ అధికారులకు సూచించారు.కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన డి ఆర్ సి (డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్) సెంటర్, స్ట్రాంగ్‌రూమ్ ను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్‌తో కలిసి ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకుడు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకుడు సంజీవ్ కుమార్ లాల్‌లు శుక్రవారం క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఎన్నికల అధికారులు సిద్ధం చేసిన లే అవుట్ పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ, ఈవీఎంల నిల్వ, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై డీఈవో నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంఖాల్ పారిశ్రామిక వాడ నుంచి పొగ...?

- ఆయిల్ కంపెనీల నుంచి విడుదలవుతున్న కాలుష్యం...!
- పట్టించుకోని పొల్యూషన్ బోర్డ్ అధికారులు



**మహేశ్వరం, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** పరిశ్రమలు వస్తే పదిమందికి ఉపాధి లభిస్తుందని అనుకుంటే పరిశ్రమల నుంచి కాలుష్యం వస్తుంది.పరిశ్రమల చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలన్ని కాలుష్యంగా మారుతున్నాయి.దీనికి నిదర్శనమే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని మంఖాల్ పారిశ్రామిక వాడ.మంఖాల్ పారిశ్రామిక వాడలో ఉన్న ఆయిల్ కంపెనీల నుంచి ప్రతిరోజు పొగ విపరీతంగా,విషపూరితమైన కెమికల్ నీరు విడుదలవుతుంది.మరో ప్రక్క ఆయిల్ కంపెనీలు విషపూరితమైన కెమికల్ తో కూడిన నీరును బయటికి పంపుతున్నారు.దీంతో పారిశ్రామిక వాడ ప్రక్కన ఉన్న పంట పొలాలు పూర్తిగా కాలుష్యం అయ్యాయి.కాలుష్యం వల్ల భూమిలో పంటలు కూడా పండటం లేదు.భూగర్భ జలాలు కాలుష్యం అయ్యాయని మొహబ్బత్ నగర్,మంఖాల్ గ్రామానికి చెందిన పలువురు రైతులు పేర్కొంటున్నారు.ఆయిల్ కంపెనీల నుంచి నీరు మంఖాల్ చెరువు మీదిగా రావిర్యాల పెద్ద చెరువులో కలుస్తాయి.దీంతో మంఖాల్,రావిర్యాల చెరువులో ఉన్న చేపలు మృత్యువాత పడుతున్నాయి.పశువులు కూడా కెమికల్ తో కూడిన నీటిని త్రాగడంతో పశువులు అనారోగ్యానికి గురవుతున్నయంటున్నారు.గుట్టుచప్పుడు కాకుండా కొన్ని ఆయిల్ కంపెనీలు రాత్రిపూట పొగను విడుదల చేస్తున్నాయి.భారీ వర్షాల కారణంగా కంపెనీల నుంచి విషపూరితమైన కెమికల్ నీరు మహేశ్వరం గేట్ మహేశ్వరం మండల కేంద్రం వెళ్ళే ప్రధాన రహదారిపై నుంచి వెళ్తుంది.దీంతో మహేశ్వరం మండల వైపు వెళ్ళే ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్తున్నారు.పారిశ్రామిక వాడ ప్రక్కన ఉన్న మొహబ్బత్ నగర్,తుమ్మలూరు,ప్రాజెయ్ విల్లాలో నివాసం ఉండే ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆయిల్ కంపెనీల నుంచి విచ్చలవిడిగా వ్యర్థ పదార్థాలు కెమికల్ తో కూడిన నీరును బయటకి వదులుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కెమికల్ తో కూడిన నీరును, విచ్చలవిడిగా పొగను బయటకు వదులుతున్న ఆయిల్ కంపెనీల పైన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### వ్యర్థాలు వదిలే కంపెనీలపై చర్యలు తీసుకోవాలి



మంఖాల్ పారిశ్రామిక వాడ నుంచి విపరీతంగా కెమికల్‌తో కూడిన వ్యర్థాలను వదులుతున్న కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయిల్ మిల్ కంపెనీల వ్యర్థాల వల్ల రావిర్యాల చెరువులో చేపలు చనిపోతున్నాయి.కంట్రోల్ బోర్డ్ అధికారులు కళ్ళు తెరిచి ఆయిల్ మిల్ వైపు చూడాలన్నారు.

**శివ యాదవ్, మహేశ్వరం మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు**

## బోడుప్పల్ రాచెరువులో అభివృద్ధి పనుల పరిశీలన

**బోడుప్పల్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాచెరువులో జరుగుతున్న వాకింగ్ ట్రాక్, రహదారి నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులను బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచెరువు పరిసర ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజల సౌకర్యార్థం నాణ్యమైన పనులు జరగాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు రాసాల వెంకటేష్,



బొమ్మక్ కళ్యాణ్, కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్, జక్కా పద్మా రాములు, చీరాల నర్సింహా, పులకండ్ల జంగా రెడ్డి, అలాగే కంటెస్టెడ్ కార్పొరేటర్లు హరినాథ్ రెడ్డి, శివ యాదవ్, తోటకూర రవీందర్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, పోగుల దిలీప్ రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలు, పాఠశాలలపై అకస్మాత్తు తనిఖీ



**శామీర్‌పేట్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** తూంకుంట మున్సిపల్ పరిధిలోని తూంకుంట, సింగాయి పల్లి,హకీంపేట్ ప్రాంతాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు,ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత , మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి , ఇంది రమ్మ కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం రోజు అకస్మాత్తు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడి,ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్యా సదుపాయాలను,దుస్తులు, పుస్తకాలు,మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది గదుల కొరత,ఉపాధ్యాయుల కొరత,టాయిలెట్ల నిర్మాణం పూర్తయినా బిల్లులు విడుదల కాకపోవడం వంటి సమస్యలను కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, పరానంది కృష్ణ, పరానంది బాల్ రాజు, మహమ్మద్ జాఫర్,వజ్జల శేశాంత్ , నాయకులు యాదగిరి,నక్క మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ, శబ్ద కాలుష్య నియంత్రణలో 'మెట్రో' కీలక పాత్ర

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ప్రధాన నగరాల్లో విపరీతంగా పెరుగుతున్న ట్రాఫిక్, పర్యావరణ సవాళ్లకు మెట్రో, ఎంఎంటీఎస్ వంటి ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడం ఒక్కటే మార్గమని హైదరాబాద్ మెట్రో రైల్‌కి కేంద్ర ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్ డీవీఎస్ రాజు అన్నారు. ప్రభుత్వ విభాగాలు ఈ లక్ష్యంగా ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.పర్యావరణ సుస్థిరతకు రవాణా వ్యవస్థలో పరిశోధనలు అనే అంశంపై వివిఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం శుక్రవారం నిర్వహించిన రెండు రోజుల సదస్సును డీవీఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో రైల్ నగర ప్రజలకు ఎంతో సౌకర్యవంతమైన సేవలు అందిస్తూ, నగర రవాణా అవసరాలను కొంత వరకు తీర్చగలుగుతోందని అన్నారు. అయితే మొదటి దశలో ఎల్ అండ్ టీ తో కలిసి పిపిపి పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టులో పలు సవాళ్లు ఎదురయ్యాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్ట్ విషయంలో మరింత పటిష్టంగా అడుగులు వేస్తున్నామని




ఆయన వెల్లడించారు. ఒక కిలోమీటర్ మెట్రో రైల్ నడపడం అంటే ఏడు బస్సు లైన్లు, 24 కార్ లైన్ల ప్రయాణంతో సమానమని, అందువల్ల మెట్రో రైల్ లేదా ఎంఎంటీఎస్ రైల్ ప్రయాణమే ట్రాఫిక్ సమస్యలను తగ్గించగలవని ఆయన తెలిపారు. ఇంధన పొదుపులో మెట్రో రైల్ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని ఆయన చెప్పారు. ఈ సదస్సులో సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్ వేలుమురుగన్ తన బృందం, విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీడీ నాయుడు, దేశవ్యాప్తంగా వివిధ విద్యా సంస్థలకు చెందిన నిపుణులు, కళాశాల సీనియర్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

- తాండూర్‌లో మైదానం నిర్మాణానికి రూ.5 కోట్లు
- యువత చెడు వ్యసనాలు వదిలి మైదానం బాట పట్టాలి
- ముదిరాజ్ భవన నిర్మాణనికి శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి.
- కాంగ్రెస్ పార్టీలోనే ముదిరాజ్‌లకు ప్రాధాన్యత, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- నియెజకవర్గ యువతకు క్రికెట్ కిట్స్ పంపిణీ

**తాండూరు, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తిచేస్తామని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం తాండూర్ పట్టణంలోని బైపాస్ రోడ్ సమీపంలో రూ.50 లక్షల వ్యయంతో ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి మరియు మత్స్య సంపద, క్రీడలు, యువజన సేవలు మంత్రి. వాకిటి శ్రీహరి ,ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మరియు ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సోర్ట్స్ ఆథారటి చైర్మన్ శివ సేన , ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి , ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ మెంబర్ రమేష్ మహారాజ్ తో పాటు ముదిరాజ్ సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తాండూర్ లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేసి చూపిస్తామన్నారు.ముదిరాజ్ భవన నిర్మాణానికి పూర్తి సహకరం అందిస్తామని తెలిపారు. యుతకు స్వయం ఉపాధి కోసం సెట్విన్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. తాండూర్ లో మైదానం నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయిస్తామని వేల్లడించారు. యువత చెడు వ్యసనాలు వదిలి, మైదానం బాట పట్టాలని సూచించారు.ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై ఏ ప్రాంతంలో అడుగుపెట్టిన,పోరాట స్ఫూర్తి, సాంస్కృతి సంప్రదాయాలు, ఉద్యమ చరిత్రలు స్వాగతం చెబుతాయన్నారు. తెలంగాణలోని తాండూర్‌లో బీసీలలో సంఖ్యాపరంగా అధికులైన ముదిరాజులు, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో ముదిరాజుల పాత్ర కీలకమని తాండూరు ఎమ్మెల్యేగా నా గెలుపే దానికి నిదర్శనమన్నారు. 2023 నవంబర్ 24న వందలాది మంది ముదిరాజ్ బిడ్డలందరూ కాంగ్రెస్ పార్టీ గెలుపుకై కదంతొక్కి నాకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదిస్తే తాండూర్ నియోజకవర్గంలో ముదిరాజ్ భవనం ఏర్పాటుకు కృషి చేస్తామని మాట ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం ముదిరాజ్ భవన్ కు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ఇది కేవలం ఒక్క ముదిరాజ్ భవన్ శంకుస్థాపన మాత్రమే కాదు. భవిషత్తులో ఈ భవనం ముదిరాజ్‌ల ఆత్మగౌరవానికి ప్రతిక కావాలన్నారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలు, బీసీలలో అధిక భాగం ఉన్న ముదిరాజ్ లు విద్య, ఉద్యోగాలు, రాజ్యాధికారం కోసం బీసీ, ముదిరాజ్ సంఘాలు ఉద్యమాలు చేస్తూనే వస్తున్నాయి. కానీ గత ప్రభుత్వాలు బీసీలను, ముదిరాజ్ లను పట్టించుకోలేదు. ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో పదేళ్ళ కాలంలో ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేకపోయారు. పదేళ్ళలో పాలన ఫామ్ హౌస్ కే పరిమితం అయింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన అనే పద్దతిలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలో అధిక సంఖ్యలో ఉన్న



ముదిరాజ్ వర్గం నుండి శ్రీహరి అన్నకు మంత్రి పదవి, మన నియోజకవర్గం నుండి రమేష్ మహారాజ్ కి కార్పోరేషన్ మెంబర్, పార్టీ పరంగా అనిల్ కు యూత్ ప్రెసిడెంట్ గా కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. గతంలో అభివృద్ధి అంటే తెల్ల కాగితాలకే పరిమితం అయ్యిందని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి మీ కళ్ళ ముందు కనిపిస్తుందన్నారు. ఇప్పుడు మన సభ స్థలం ముదిరాజ్ లకు,దీని ప్రక్కన యాదవ కుర్వ సోదరులకు స్థలన్ని కేటాయించడం జరిగిందన్నారు. తాండూర్ మెకానిక్ అసోసియేషన్ వాళ్ళ చిరకాల స్వప్నం అయిన ఆటో నగర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన బైపాస్ రోడ్ నత్తనడకన పనులు ఆగిపోవడం జరిగిందని విమర్శించారు.మళ్ళీ మన ప్రభుత్వం ఏర్పాటయినా తర్వాత బైపాస్ రోడ్ సమస్యను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్ళడంతో రూ.108 కోట్ల రూపాయలు మంజూరు చేయ్యడం జరిగిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఎటిసి సెంటర్ ను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.

## విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్స వాల్లో భాగంగా నారాయ ణపేట జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, కళాశాలలో టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన వ్యాస రచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టే దిశగా అవగాహన అవసరమని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు.డ్రగ్స్ నివారణలో పోలీసులు విద్యార్థుల పాత్ర మాదకద్రవ్యాల నుండి ఎలా దూరంగా ఉండవచ్చు అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, పోలీసులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- గణితంపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండల పరిధిలోని చందాపూర్, చిట్యాల గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. గ్రౌండింగ్ ప్రారంభించిన ఇళ్లు బెస్‌మెట్ లెవల్‌కు చేరితే మొదటి విడత చెల్లింపులు జరుగుతుందని అన్నారు. ఏమైనా సమస్యలుంటే



అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. పెండింగ్ లేకుండా లబ్ధిదారులకు నగదు పడే విధంగా చూసుకోవాలని, పెండింగ్ సమస్యలు ఏమైనా ఉంటే నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు ఇసుకకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

### గణితంపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

చందాపూర్ గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల గణితం మార్కుల నివేదికతో పాటు ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ గురించి ఆరా తీశారు. గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, గృహ నిర్మాణ శాఖ డి ఈ విఠోబా, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీవో, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# చిప్ డిజైన్ తయారీలో అపార అవకాశాలు

**పటాన్‌చెరు, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** జాతీయ 'మేక్ ఇన్ ఇండియా' నినాదంతో చిప్ డిజైన్, తయారీపై గణనీయంగా దృష్టి సారించిన నేపథ్యంలో, మనదేశంలో సెమీకండక్టర్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోందని మైక్రోచిప్ ఇండియా సీనియర్ టెక్నికల్ స్టాఫ్ ఆర్. సంజీవ్ కుమార్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) విభాగం 'వీఎల్ఎస్ఐ కెరీర్లు: మార్గాలు, నైపుణ్యాలు, సెమీకండక్టర్ యుగంలో అవకాశాలు' అనే అంశంపై గురువారం నైపుణ్యోపన్యాసాన్ని ఏర్పాటు చేసింది. పరిశ్రమ నిపుణుడి హోదాలో పాల్గొన్న సంజీవ్ కుమార్ మాట్లాడుతూ, వీఎల్ఎస్ఐలో విజయవంతమైన కెరీర్ ను నిర్మించడానికి ప్రాథమిక అంశాలపై మంచి అవగాహన అవశ్యమని చెప్పారు. ఒక అంచనా ప్రకారం, 2030 నాటికి ఈ రంగంలో 1.15 లక్షల కొత్త ఉద్యోగ అవకాశాలున్నట్టు ఆయన వెల్లడించారు. వీఎల్ఎస్ఐ పరిశ్రమలో ఫ్రంట్-ఎండ్ డిజిటల్ డిజైన్, బ్యాక్-ఎండ్ లేదా ఫిజికల్ డిజైన్, అనలాగ్ అండ్ మిక్స్ డ్-సిగ్నల్ డిజైన్, ఆర్ఎఫ్ అండ్ వైర్ లెస్, మెమరీ అండ్ డివైజెస్, ఈడీఏ లేదా మెథడాలజీ, ఎమర్జింగ్ సిస్టమ్ అప్లికేషన్స్ వంటి కీలకమైన కెరీర్



మార్గాలను ఆయన వివరించారు. స్వీయ-అభ్యాసం, ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా అనుభవాన్ని గడించడం, ఎన్ పీ టెల్ వంటి ఆన్ లైన్ కోర్సులు, ఐ ట్రిపుల్ ఈ, ఇతర ప్రముఖ జర్నల్స్ నుంచి పరిశోధన సాహిత్యంతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సంజీవ్ కుమార్ విద్యార్థులను ప్రోత్సహించారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి పర్యవేక్షణలో, ప్రొఫెసర్ సీహెచ్.సుమంత్ కుమార్, ఎం.నరేష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకే రాజ్యాధికారం దక్కాలి

- రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా తెలంగాణ రాష్ట్రంలో 90 శాతం ఉన్న ఎస్సీ,ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కాలని అలంపూర్ జోగులాంబ ఆలయం నుండి అదిలాబాద్ వరకు రథయాత్ర చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్సీ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణంలోని హరిత హోటల్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ కళా సహకారం అవుతుందని అనుకుంటే ఒకే కుటుంబం తెలంగాణను లూటీ చేసిందని అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. ప్రజలు ఆ పార్టీని గద్దెని దింపి కాంగ్రెస్ పార్టీని గద్దెనెక్కించగా కాంగ్రెస్ పార్టీకి చెందినవారు ఊరికి ఐదుగురు లూటీ దారులు తయారై దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం రక్షించుకోవాలంటే ఎస్సీ,ఎస్టీ,బీసీల ఐక్యతతోనే సాధ్యమన్నారు ప్రభుత్వ ప్రైవేటు పరిశ్రమలలో స్థానికులకే 95 శాతం ఉద్యోగాలు కల్పించేలా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న



28 లక్షల మంది నిరుద్యోగులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారికి నైపుణ్య శిక్షణను ప్రభుత్వము ఇప్పించాలన్నారు. నిరుద్యోగులు సొంత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వము ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి ఆదుకోవాలని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులతోపాటు టి ఆర్ ఎల్ డి రాష్ట్ర నాయకులు మల్లేష్ ముద్దం రిషబ్ జైన్ జానీ నరసింహారావు సుధాకర్ బుల్లెట్ వెంకన్న కళాబృందం తదితరులు పాల్గొన్నారు.

## హెటిరో డ్రగ్స్ కంపెనీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

- పటాన్‌చెరు పీసీబీ ఈఈని సస్పెండ్ చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



**సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామం నల్లచెరువు కాలుష్యానికి కారణమైన హేట్రో డ్రగ్స్ యాజమాన్యంను వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంకు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ మాధురి కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దోమడుగు కాలుష్యంకు కారణం అయినా హెట్రో డ్రగ్స్ యాజమాన్యంపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా రైతులు, ప్రజలు ఆందోళన చేస్తా ఉంటే పీసీబీ రెవిన్యూ అధికారులు కనీసం గ్రామాన్ని సందర్శించడం లేదని విమర్శించారు. కాలుష్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పిసీబీ ఈఈని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 4 గొలుసు కట్టు చెరువులు క్రింద 5400 ఎకరాలు భూములు నష్టం జరుగుతుందన్నారు..గ్రామంలో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బోర్లు పాడవుతున్న, వందల సంఖ్యలో బర్లు, గోర్లు చనిపోతున్న అధికారులు స్పందించటం లేదన్నారు. త్రాగు నీళ్లు కూడా సరిగ్గా లేవన్నారు.రైతులు, ప్రజలు, వృతిదారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.కాలుష్య వ్యర్థ పదార్థాలు నక్క వాగు ద్వారా జిల్లాకు గుండెకాయలాంటి మంజీరా నది కూడ కాలుష్యం అవుతున్నదని అన్నారు. సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎ పటాన్చెరు ఏరియా కార్యదర్శి బి.నాగేశ్వరరావు,రైతు సంగం జిల్లా అధ్యక్షులు రాజయ్య, నాయకులు నర్సింహా రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

- జిల్లా గృహ నిర్మాణాధికారి చలపతిరావు

**న్యాల్‌కల్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** ఇందిరమ్మ గృహ పథకం అమల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరు ఇండ్లను నిర్మించుకోవచ్చు అని, ఇండ్ల నిర్మాణాలను చేపట్టిన అర్హులైన ప్రతి ఒక్కరికి సకాలంలో బిల్లులు చెల్లిస్తామని, ఇండ్ల నిర్మాణాలను చేపట్టని గృహ లబ్ధిదారులు వెంటనే పనులను ప్రారంభించాలని జిల్లా గృహ నిర్మాణాధికారి చలపతిరావు సూచించారు. శు క్రవారం మండలంలోని మెటల్ కుంట గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను పరిశీలించారు. గ్రామానికి 31 ఇండ్లు మంజూరు అవ్వగా 18 ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానిక గృహ నిర్మాణ అధికారులు వివరించారు. జహీరాబాద్ డివిజన్ గృహ నిర్మాణాధికారి ఆంజనేయులు, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్



చైర్మన్ తిరుపతి రెడ్డి, మండల ఏఈ శివానంద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇందిర, తదితరులతో కలిసి ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికార పార్టీ శ్రేణులు పాండు రంగారెడ్డి, శ్రీకాంత్, సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయకత్వ లక్షణాలపై అవగాహన

**కొండాపూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** కొండాపూర్ మండల మల్కాపూర్‌లో రావు'స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ 2025 ను సంగారెడ్డి శాఖలో విద్యార్థులకు న్యాయకత్వ లక్షణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో రావు'స్ గ్రూప్‌కు చెందిన ఏడు శాఖల విద్యార్థులు, యునైటెడ్ నేషన్స్‌కి చెందిన 35 దేశాల ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రపంచ సమస్యలపై చర్చిస్తూ, యుఎన్ విధానాలను అనుసరించి, సృజనాత్మక పరిష్కారాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. ఎం.ఆర్. మురళీ ప్రసాద్ హాజరయ్యారు. యుకే కామన్‌వెల్త్ ఫెలో, యుకే కామన్‌వెల్త్ సెక్రటేరియట్ కమిషన్ కౌంట్రీ అంబాసిడర్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషియల్ స్టడీస్ హైదరాబాద్ లో లైబ్రేరియన్ (ప్రొఫెసర్ స్థాయి)గా, భారత ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలో సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రావు'స్ గ్రూప్ సీఈఓ శ్రీ నిధిన్ రావు పొల్సాని, అకాడెమిక్ డైరెక్టర్ శ్రీమతి కె.లక్ష్మీరావు, అకాడెమిక్ అడ్వైజర్ డా. పార్థసారథి,అధ్యక్షత వహించారు.



విద్యార్థుల ప్రదర్శన, ఆత్మవిశ్వాసం, పరిశోధనాధారిత చర్చలకు నాయకత్వ బృందం అభినందనలు తెలిపింది. కార్యక్రమం చివర్లో బెస్ట్ డెలిగేట్, బెస్ట్ స్పీకర్, బెస్ట్ కాస్ట్యూమ్, బెస్ట్ టీచర్ (ట్రైనింగ్), బెస్ట్ స్కూల్ (పార్టిసిపేషన్) అవార్డులు అందజేయబడ్డాయి. మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ 2025 విద్యార్థుల్లో గ్లోబల్ ఆలోచన, సమస్యల పరిష్కారం, నాయకత్వ లక్షణాలను మరింతగా ప్రేరేపిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగింపు చేశారు.

## మహిళా సంఘాలతో బాల్య వివాహాలను నిరోధించాలి



**చిలప్‌చేడ్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు మండల సమైక్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ మండల సమైక్య సమావేశంలో మండలంలోని ప్రతి గ్రామంలో బాల్యవివాహాలను నిరోధించాలని, అందుకుగాను మహిళా సంఘాలతో మహిళలకు తగు అవగాహన కల్పించాలని తీర్మానం చేయడం జరిగింది. అదేవిధంగా వచ్చే మార్చి 8వ తారీఖు లోపు అన్ని గ్రామాలలోని మహిళలకు రక్తహీనత పరీక్షలు చేయించి, తదుపరి తగుపోషక విలువలపై అవగాహన కల్పిస్తూ వారిని పూర్తి ఆరోగ్యవంతులుగా చేయుటకు ప్రతి మహిళ కంకణం కట్టుకునేలా మండల సమైక్యలో తీర్మానం చేయడం జరిగింది. అనంతరం పోషణ మాసం సంబరాల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ పొందిన ఏపీఎం గౌరీ శంకర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్న సందర్భంగా వారికి మండల సమైక్య సభ్యులు శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, ఏపీఎం గౌరీశంకర్, సీసీలు శ్రీకాంత్, పురుషోత్తం, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, లక్ష్మన్,అకౌంటెంట్ మానస, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# అయోడిన్ లోప రుగ్మతలను నివారించాలి

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా అయోడిన్ సూక్ష్మ పోషక లోపం వలన శారీరక, మానసిక అభివృద్ధి కుంటుపడుతుందని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ తెలిపారు. తేదీ 24/10/2025, శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ అయోడిన్ లోప రుగ్మతల నివారణ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ ఓ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినము నిర్వహిస్తూ వారం రోజులు పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు. అయోడిన్ ముఖ్యమైన సూక్ష్మ పోషకమని, అయోడిన్ లోపం వలన థైరాయిడ్ గ్రంధి పనితీరుపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని, థైరాయిడ్ నుంచి విడుదలఅయ్యే హార్మోన్ వలన మానవ శరీరంలో ముఖ్యమైన జీవన క్రియలు జరుగుతాయి. కావున ప్రతిరోజు అయోడిన్ సూక్ష్మ పోషకము అవసరం. అయోడిన్ లోపం వలన గాయిటర్ (గండ మాల)



హైపో థైరాయిడిజం వంటి సమస్యలు ఏర్పడతాయి. ముఖ్యంగా గర్భవతులలో అయోడిన్ లోపం వలన గర్భస్రావము, మృత శిశు జననము (స్టిల్ బర్త్), పుట్టిన శిశువుల్లో బుద్ధి మాంద్యం, కురచతనం, చెవుడు, మూగ తదితర అవయవ లోపాలతో జన్మిస్తారు. కావున అయోడిన్ లోప నివారణకు ప్రతిరోజు ఆకుకూరలు, కాయగూరలు, నట్స్, పాలు మరియు పాల సంబంధ పదార్థాలు తప్పకుండా తీసుకోవాలి. ప్రజలు సాధారణ ఉప్పు కాకుండా అయోడిన్ కలిపిన ఉప్పును వినియోగించాలి.

ప్రతిరోజు అయోడిన్ సూక్ష్మ పోషకము 150 మైక్రోగ్రామ్స్, గర్భవతులకు మరియు బాలింతలకు 200 మైక్రోగ్రామ్స్ అవసరము. అయోడిన్ ఉప్పును సూర్య రష్మి, వేడితగలకుండా, గాలి చొరబడకుండా శుభ్రమైన సీసాలో భద్రపరుచుకోవాలి అని డిఎంహెచ్ఓ తెలియజేశారు. ఆశా కార్యకర్తలు తమ పరిధిలోగల ఇండ్లలో ఉప్పును పరీక్షించి 15 పిపిఎం అయోడిన్ ఉండేలా పర్యవేక్షణ చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఈ కార్యక్రమం పై విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి అని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏన్ సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, వైద్యాధికారి డాక్టర్ వాణి ,డాక్టర్ నీరజ్, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, ఎం ఎల్ హెచ్ పి లు డాక్టర్ రామకృష్ణ, సూర్య శ్రీ, డిపిఎంఓ సుకుమార్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ, పర్యవేక్షణ సిబ్బంది కొట్ర నిరంజన్, ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్, హెల్త్ అసిస్టెంట్లు రాజవర్ధన్ రెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీనివాసులు, డి వి ఎల్ ఎం కుమార్, ఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల జీవితాలు చిరస్మరణీయం



**మక్తల్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామ్ లాల్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టే దిశగా అవగాహన అవసరమని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాల నుండి ఎలా దూరంగా ఉండవచ్చు అనే అంశంపై వ్యాస రచన నిర్వహించి పోటీలలో అత్యుత్తమ విజేతలను స్టేట్ కాంపిటీషన్‌కు పంపించడం జరుగుతుందని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ అమర వీరుల త్యాగాలు వృథా కావు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** పోలీస్ అమర వీరుల త్యాగాలు వృధా కావని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకొని వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో రక్తదాన శిబిరాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం ప్రారంభించారు. ఆర్మూడ్ రిజర్వ్, ట్రాఫిక్,స్థానిక పోలీస్ స్టేషన్ల అధ్వర్యంలో రెడ్ క్రాస్ రక్తనిధి సహకారంతో పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని రాణి రుద్రమదేవి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది యువతకు స్పూర్తి కలిగించే రీతిలో ఈ రక్తదాన శిబిరంలో ముందుగా వరంగల్ పోలీస్ కమిషనర్ స్వచ్ఛందంగా రక్తందానం చేశారు. అనంతరం ఆర్మూడ్ రిజర్వ్,లా అండ్ ఆర్డర్,ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ వ్యక్తిగతంగా కలుసుకోని అభినందించడంతో పాటు వారికి పండ్లు, సర్టిఫికేట్లను అందజేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షిం చడమే కాదు సేవా కార్యక్రమాల్లోను ముందు వరసలో వుంటారని, ముఖ్యంగా రక్తదానంపై వున్న ఆపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపి అంకిత్ కుమార్ , అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ, నాగయ్య, జాన్ నర్సింహులు, జితేందర్ రెడ్డి,ఆర్.ఐలు సతీష్, శ్రీధర్, చంద్రశేకర్, శ్రీనివాస్,స్పర్జన్, రాజ్, హన్మకొండ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు డా. విజయ్ చందర్ పాల్గొన్నారు.శ్రీనివాస్ రావు, రమణ రెడ్డితో పాటు పోలీస్ యూనిట్ వైద్యులు, ఇతర పోలీస్ అధికారులు, పరిపాలన, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గోన్నారు.

# రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం

- భర్తకు తీవ్ర గాయాలు..ఎంజీఎం లో చికిత్స
- దీపావళి పండుగకు తల్లిగారింటికి వెళ్తుండగా దుర్ఘటన



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** దీపావళి పర్వదినం సందర్భంగా కేదారేశ్వర వ్రతం పూజలో పాల్గొనేందుకు తన తల్లి గారి ఇంటికి వెళ్తున్న భార్య భర్తలలో భార్య రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలై నా విషాదకరమైన సంఘటన వరంగల్ నగర సమీపంలోని మామ్నూర్ వద్ద చోటు చేసుకుంది. మామునూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. అయినవోలు గ్రామానికి చెందిన కొమ్మోజు శ్రావణ్ కుమార్ వరంగల్ చారుబౌలిలో ఉండే తన అక్క పెట్రోజు హారిక ఆమె భర్త రాజ్ కుమార్ ను దీపావళి పండుగకు ఆహ్వానించి ఈనెల 23న వెంట తీసుకెళ్తుండగా తనకంటే ముందు స్కూటీపై అక్క హారిక, బావ రాజ్ కుమార్లు వెళ్తున్న క్రమంలో రాత్రి 11 గంటల 50 నిమిషములకు మామునూరు సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి స్కూల్ వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న టీఎస్ 03 ఈజె , 8080 ఐ 20 హుందాయి కారు స్కూటీని ఢీకొట్టడంతో ఎగిరి పడిపోయిన హారిక(36) అక్కడికక్కడే దుర్మరణం చెందింది.తీవ్ర గాయాలతో ఉన్నటువంటి భర్త రాజ్ కుమార్ ను అంబులెన్స్ లో ఎంజీఎం కు తరలించగా అక్కడ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. అతివేగంగా వచ్చి తన అక్క మరణానికి, బావకు తీవ్ర గాయాలకు కారకులైనటువంటి వారికి తగిన విధంగా శిక్ష విధించి తమకు న్యాయం చేయాలని మామునూరు పోలీసులకు శ్రవణ్ కుమార్ ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో మామునూర్ సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణవేణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అంధకారంలో ఎల్లయ్యగూడెం!

- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు...

**చెన్నారావుపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలో విద్యుత్ సరఫరా లేక పోవడంతో గత మూడు రోజులుగా గ్రామస్తులు అంధకారంలో ఉంటున్నారు. విద్యుత్ అధికారులకు తెలిపిన పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక గ్రామంలో గత ఆరు నెలల నుండి వర్షం చినుకు పడగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని దీంతో రాత్రి వేళల్లో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ ఏఈకి సమాచారం అందిస్తే మీ జూనియర్ లైన్ మెన్ ను అడగండి అని సమాధానం చెబుతున్నాడని జూనియర్ లైన్ మెన్ ను అడిగితే సమస్యను పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రాత్రి వేళలో ఫోన్ చేసిన కూడా స్పందించడం లేదని సబ్ స్టేషన్ లో విధుల్లో ఉన్న సిబ్బందికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసి పడుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రి వేళల్లో దోమలతో సహవాసం చేస్తున్నామని చిన్నపిల్లలకు జ్వరాలు వస్తున్నాయని వెంటనే విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై చెన్నారావుపేట విద్యుత్ ఏఈ జోగానంద్ ను వివరణ కోరగా విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇవ్వాలి


- ప్రాజెక్ట్‌లో భూసేకరణ ముఖ్యమైనది
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** చిన్న కాళేశ్వరం చాలా ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్ట్ అని, ప్రాజెక్టు పూర్తి చేయడంలో భూ సేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ మొదటి, రెండు దశలకు భూ సేకరణ ప్రక్రియపై, ఎస్‌డీసీ, ఎల్‌ఏ, ఆర్‌ఆర్, ఇరిగేషన్, మెగా కంపెనీ విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు, మ్యుటేషన్ ప్రక్రియలు, పరిహారం చెల్లింపులు త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. ఎస్‌డీసీ, భూ సేకరణ, ఆర్‌ఆర్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టు పనుల్లో ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదా రులకు తగిన పరిహారం అందేలా, పునరా వాస కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు పురోగ తిపై ప్రతివారం సమీక్షలు నిర్వహించి, ప్రగతిని అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశిం చారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్ట ర్ మయాంక్ సింగ్, ఎస్డీసి రమేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, ఇరిగేషన్, మెగా కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదం బాధాకరం

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బస్సు ప్రమాదంలో ప్రయాణికులు సజీవదహనం కావడం బాధాకరమని శాసన మండలి ప్రతిపక్షనేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తెల్లవారుజామున కర్నూలు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై బస్సులో మంటలు చెలరేగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ట్రావెల్స్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు.

# మెరిసే ఉత్సాహంతో 5కే రన్

- కదిలి వచ్చిన యువత



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన 5కే రన్ మెరిసే ఉత్సాహంతో కొనసాగింది. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా పాల్గొని యువతలో స్ఫూర్తినింపారు. అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవ సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించిన ప్రజాహిత కార్యక్రమాలలో భాగంగా పోలీస్ అమరవీరుల స్మారకార్థం శుక్రవారం ఉదయం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి లో కిలోమీటర్ల పరుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ 5కే రన్ పరుగులు జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత దాదాపు 1500 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ పరుగు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా కలెక్టర్ చౌరస్తా, ఎన్టీఆర్ చౌక్, వినాయక చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్ గుండా కొనసాగి తిరిగి అదే మార్గంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంకు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత ప్రశాంత జిల్లాకు కారణం ఒకప్పటి పోలీసు ప్రాణ త్యాగాల ఫలితమే అని, వారి జ్ఞాపకార్థం, వారి త్యాగాలను స్మరిస్తూ వారం రోజుల పాటు నిర్వహించే అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పలు ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అందులో భాగంగా శుక్రవారం ఉదయం 5కే రన్ ను ప్రారంభించినట్లు, ఇందులో ఉత్సాహంగా పాల్గొనడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పోలీసు వ్యవస్థ సంఘవిద్రోహశక్తులతో నిరంతరం పోరాడి అభివృద్ధికి కారణముకున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం మారుమూల ఆదివాసి గ్రామాలను సైతం నిర్భయంగా ప్రజలు సందర్శించే అవకాశాలు ఉన్నాయని దానికి కారణం ఒకప్పుడు పోలీసులు చేసిన కృషి ఫలితమే అని గుర్తు చేశారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు గ్రామ గ్రామాన అభివృద్ధి బాటలో, పయనం కావడానికి నిదర్శనం అని తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించడానికి ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు పోలీసు యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్క పోలీసు పండుగలను త్యాగం చేసి ప్రజారక్షణకై విధులు నిర్వర్తిస్తుంటారని తెలియజేశారు. ప్రజలను మోసం చేస్తున్న దొంగలను పట్టుకోవడానికి కేడీలను పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తూ ప్రాణాలను సైతం విడిచిన ఘటనలను గుర్తు చేశారు. త్వరలో జిల్లాలో హాఫ్ మారథాన్ ఏర్పాటు చేయనున్నట్లు దీనికి ప్రతి ఒక్క యువత సంసిద్ధమై హాఫ్ మారతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా ఐదు కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి సిబ్బందికి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, హాసీబుల్లా, పట్టణ సిఐలు, ఎస్ఐలు, యువత, స్పోర్ట్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులు త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

- నిర్మాణం చేపట్టని ఇందిరమ్మ ఇళ్లు రద్దు చేస్తాం
- అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

**మహదేవపూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణం చేపట్టాలని నిర్మాణం చేపట్టని ఇందిరమ్మ ఇండ్లను రద్దు చేయడం జరుగుతుందని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మహదేవపూర్ మండలంలోని ఎలికేశ్వరం గ్రామపంచాయతీలో నూతనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు చేపడుతున్నటువంటి ఇళ్లనిర్మాణం పనులను పరిశీలించారు. ఈనెల ఆఖరిలోగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహప్రవేశం చేసేటట్టుగా వేగవంతంగా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా. ఇంకా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని మొదలుపెట్టని లబ్ధిదారులు వెంటనే నిర్మాణం పని ప్రారంభించాలని ఏమిచో వారికి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు రద్దు పరచడం జరుగుతుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రనాథ్ .ఉపాధి హామీ ఎపిఓ సునీత. ఎలికేశ్వరం గ్రామపంచాయతీ కార్యదర్శి గాయత్రి. ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- పంచాయతీ కార్యదర్శులతో అడిషనల్ కలెక్టర్ సమీక్ష




**సారంగాపూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పంచాయతీ కార్యదర్శి అధికారులతో శుక్రవారం రైతు వేదికలో జరిగిన సమావేశంలో ఆదేశించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి, రుణాలు సకాలంలో అందేలా చూడాలని ఆయన సూచించారు. ఈ పథకం లక్ష్యం పేదల సొంత ఇంటి కలను నెరవేర్చడమేనని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా చూడాలని అడిషనల్ కలెక్టర్ నొక్కి చెప్పారు. డిసెంబర్ 15 లోపు లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణం పూర్తి చేయించాలి అధికారులతో సూచనలు చేశారు ఆర్థికంగా లేనివారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు, ఎం పి ఓ అజీజ్ ఖాన్, గృహ నిర్మాణశాఖ అధికారులు, మండల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# మార్గన్స్ ఫిట్ సింగరేణి లీజు భూములను కాపాడండి

- సబ్‌కలెక్టర్‌కు సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుల వినతి



**బెల్లంపల్లి, అక్టోబర్ 23, (జనంసాక్షి) :** బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ కబ్జా కోరులకు అడ్డాగా మారిందని, సింగరేణి లీజు భూములన్నీ కబ్జాకు గురయ్యాయని వాటిని కాపాడాలని కోరుతూ శుక్రవారం సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి మార్గన్స్ ఫిట్ 44డీప్ ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన భూగర్భ గని అని అన్నారు. వందల ఎకరాల్లో విస్తరించి ఉండేదని, సింగరేణిలో వచ్చిన సంస్కరణల మూలంగా, భూగర్భగనులు మూతపడి ఓపెన్ కాస్ట్ ల పరంపరలో బెల్లంపల్లి డివిజన్ లో ఏ ఒక్క భూగర్భగని మిగలకుండా తుడిచి పెట్టుకుపోయిందన్నారు. బెల్లంపల్లిలో సింగరేణికి ప్రభుత్వం ఇచ్చిన లీజ్ గడువు తీరిపోవడంతో ప్రభుత్వానికి ఆ భూములను అప్పగించిందన్నారు. ప్రభుత్వానికి అప్పగించిన భూముల్లో 68, 44, 28, 24 గనులకు సంబంధించిన భూమితో పాటుతో పాటు సౌత్ క్రాస్ కట్ 2, ఇంక్లైన్, 65డీప్, 85డీప్ భూములు, గనులు ఏర్పడిన తర్వాత కార్మికుల కోసం నిర్మించిన గృహాలు అప్పగించారని వివరించారు. జీవో 76 ద్వారా కొద్దిమంది కార్మికులకు రిజిస్ట్రేషన్లు కాగా, శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను మరమ్మత్తులు చేసుకుని ఉంటున సింగరేణేతరులకు రిజిస్ట్రేషన్లు అయ్యాయన్నారు. నిషేధిత ప్రాంతంగా ప్రకటించబడిన గనుల ఆవరణను కూడా దర్జాగా కబ్జాలు చేస్తూ, ప్రశ్నించిన వారిని బెదిరిస్తూ, సింగరేణి సంస్థ నిర్మించిన వివిధ నిర్మాణాలను నేలమట్టం చేస్తూ కబ్జాదారులు నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ కాంట్రాక్టర్ ఏకంగా ఇళ్ళ నిర్మాణం పేరుతో అక్రమ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా అక్కడ సిమెంటు ఇటుకల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల శివారు ప్రభుత్వ భూములకు సంబంధించి జరుగుతున్న అవకతవకలపై భూముల అన్యాక్రాంతంపై ప్రశ్నించిన అప్పటి సర్పంచ్ మంద రవిని కన్నాల గ్రామపంచాయతీ ఆవరణలోనే అత్యంత దారుణంగా కిరాతకంగా హత్య చేశారన్నారు. ఈహత్య భూముల అన్యాక్రాంతం, కబ్జాలపై ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురిచేసి మూగబోయేల చేసిందన్నారు. ఇన్ని కబ్జాలు జరుగుతున్న సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జా రాయుళ్లు ఎవరు అధికారంలో ఉంటే వారి పంచన చేరి కబ్జా పెట్టిన భూములను కాపాడుకుంటున్నారని ఆరోపించారు. 141, 142, 143, 60 సర్వే నెంబర్ల భూములు, నూతన కోర్టు ఆవరణ, మిషన్ భగీరథ, ఇరిగేషన్ ఆఫీస్, జర్నలిస్టు కాలనీ, ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్ ల వెనక కోట్లాది రూపాయల విలువైన భూములను కబ్జా చేసి దర్జాగా వ్యవసాయ పనులు కొనసాగిస్తున్నారన్నారు. ఇంత బహటంగా కబ్జా జరుగుతున్న అధికారుల్లో చలనం లేకపోవడం విడ్డూరమన్నారు. ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రం హడావిడి చేసి అనంతరం పత్తా లేకుండ ఉంటున్నారన్నారు. కబ్జాలపై చర్యలు చేపట్టి, భవిష్యత్తు ప్రభుత్వ అవసరాలకు, ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఠాకూర్ మణిరాం సింగ్, నాయకులు ఎండీ చాంద్ పాషా, అంబాల మహేందర్, గోగర్ల శంకర్, బొల్లు మల్లయ్య, పాండే తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు

- బకాయి వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలని డిమాండ్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 24 (జనం సాక్షి) :** తమకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, అలాగే కార్మికులక ఖాతాల్లో జమ చేయాల్సిన మొత్తాలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మెబాట పట్టారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. కార్మికులకు గత 3 నెలలుగా వేతనాలు చెల్లించకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రతినెల కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సిన రు.2 కోట్ల పైచిలుకు ఈఎస్ఐ, పిఎఫ్ మొత్తాలను వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. జీతాలు రాక కనీసం కూరగాయలు, కిరాణా సరుకులు కొనుగోలు చేయలేని దుస్థితిలో తమ కుటుంబాలు ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి, సమాన వేతనం అమలు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ, తమకు మాత్రం కనీ సం జీతం కూడా ఇవ్వడం లేదని వారు బాధను వ్యక్తం చేస్తున్నారు. గతం నెల పరిశుద్ధ కార్మికులు జీతాలు చెల్లించాలని ఆందోళన చేశారు. దీంతో ఎమ్మెల్సీ దండే విటల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ వెంకటేష్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్ ను జీతాలు చెల్లించాలని ఆదేశించారు.1 నెల జీతం మాత్రమే చెల్లించి సమస్యను గాలికి వదిలేశారు. దీంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము సమ్మె బాట పట్టినట్లు మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు శంకర్, సంజీవ్, శంకరమ్మ కార్మికుల పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25 అక్టోబర్ 2025

# పోలియో నిర్మూలన ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే డా.తెల్లం వెంకటరావు

**భద్రాచలం, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ భద్రాచలం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన భారీ ర్యాలీకి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థినిలు, రోటరీ క్లబ్ సభ్యుల ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పోలియో నిర్మూలన ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలనీ, ప్రపంచ రోటరీ సంస్థ ప్రపంచంలో పోలియోని నిర్మూలించడానికి ఎంతో కృషి చేస్తుందనీ, ప్రపంచం మొత్తానికి పోలియో వ్యాక్సిన్ ప్రపంచ రోటరీ సంస్థ సరఫరా చేస్తుందన్నారు. ర్యాలీలో పాల్గొన్న సమూహాన్ని ఉద్దేశించి ప్రస్తుత భద్రాచలం రివర్ సైడ్ రోటరీ క్లబ్ అధ్యక్షులు, రెండు తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ డా. బూసిరెడ్డి శంకర్ రెడ్డి ప్రసంగిస్తూ, పోలియో చుక్కలు వేయించడంపై ప్రజల్లో అవగాహన తేవాల్సిన బాధ్యత ముఖ్యంగా యువతకు ఉందని, భవిష్యత్తులో ఒక్క పోలియో కేసు కూడా రాకుండా నివారించాలని, తద్వారా పోలియోని ఈ ప్రపంచం నుండి నిర్మూలించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థుల సమూహాన్ని ఉద్దేశించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కే జాన్ మిల్టన్ ప్రసంగిస్తూ, సేవా కార్యక్రమాల్లో తామెప్పుడూ ముందుంటామని తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చాలా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటారని, భవిష్యత్తులో రోటరీతో కలిసి సమాజ సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటామన్నారు. సుమారు 500 మంది పాల్గొన్న ఈ అవగాహన ర్యాలీ నందు రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు డా. రమేష్ బాబు, రోటరీ క్లబ్



ఉపాధ్యక్షులు ధనకొండ రాఘవయ్య, గంజి సంపత్, కళాశాల ప్రణాళిక, అభివృద్ధి కమిటీ సభ్యులు కొడాలి శ్రీనివాసు, బుడగం శ్రీనివాసరావు, తుమ్మలపల్లి ధనేశ్వరరావు, ప్రముఖ క్రీడాకారుడు దాట్ల శ్రీనివాసరాజు లతో పాటు ఎన్ఎస్ఎస్. పిఓ. డా. ఎం కిరణ్ కుమార్, అకాడమిక్ కోర్డినేటర్ హిమజ, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ డా. ఏ.శ్రీను, అధ్యాపకులు డా. నాగసమీరా, డా. వి రాఘసుమ, రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, సంఘ సేవకులు పాల్గొన్నారు.

## టేకులపల్లి మోడల్ స్కూల్ హాస్టల్ వార్డెన్ ప్రవర్తనపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం

- వార్డెన్ ప్రవర్తన తొ విద్యార్థి నులకు తీవ్ర అసౌకర్యం
- పురుగులతో కూడిన నాసిరకం భోజనం
- ఇదేమని అడిగే సాహసం చేయలేని పరిస్థితి విద్యార్థినులది



**పెనుబల్లి, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** పెనుబల్లి మండలం టేకులపల్లి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల హాస్టల్ విద్యార్థినులకు అందిస్తున్న పురుగులతో కూడిన నాసిరకం భోజనం, హాస్టల్ వార్డెన్ ప్రవర్తనవలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థినుల సమస్యల పట్ల స్పందించిన సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి శుక్రవారం హాస్టల్ వసతి ఏర్పాట్లు, రోజు వారి భోజనాలు, నాసిరకం కూరగాయలు, నిత్యావసర సరుకులు, నీటి సమస్యలను పరిశీలించారు, హాస్టల్ వార్డెన్ పని తీరు, ప్రవర్తన పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసి హెచ్చరించారు. ఈ సందర్భంగా హాస్టల్ సమస్యలు పై జిల్లా కలెక్టర్ కి ఫోన్ ద్వారా సమస్యలు పూర్తిగా తెలియజేసారు. హాస్టల్ సమస్యలు అధికారులు ద్వారా వెంటనే పరిష్కరిస్తామని విద్యార్థిని లకు హామీ ఇచ్చారు, ఎస్ఓ హాస్టల్ కాంట్రాక్టర్, వార్డెన్ పై తీవ్రంగా మండిపడ్డారు, విద్యార్థినిలు మరల సమస్యలకు గురి కాకుండా చూడాలి అని లేకుంటే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యులు పై కఠిన చర్యలు తీసుకుంటుంది అని హెచ్చరించారు, కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

**గుర్రంపోడు, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా గుర్రంపోడ్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ దాన్యాన్ని విక్రాయించి మద్దతు ధర పొందాలని అన్నారు. కేంద్ర నిర్వాహకులు అన్ని రకాల మౌళిక వసతులు రైతులకు కల్పించాలని ఆయన అన్నారు. పిఏసిఎస్ చైర్మన్ యాదవ రెడ్డి మాట్లాడుతూ జిన్నాయిచింత,పోచంపల్లి గ్రామాల్లో త్వరలో మరో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ పాంత్య నాయక్, ఆర్డివో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు,ఏఓ మాధవరెడ్డి,ఎంపిడివో మేకల విజయ్ భాస్కర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తగుళ్ల సర్వయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ గాలి రవి కుమార్,మాజీ ఎంపిపి చనమళ్ళ జగదీష్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్ రెడ్డి,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమతం జగదీశ్ రెడ్డి,ఎస్సి సెల్ అధ్యక్షులు మేడి వెంకన్న,యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ కొత్త నాగరాజు, పిఏసిఎస్ సిబ్బంది, రైతులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఎస్పీ కె. నరసింహా




**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా పోలీసు అమరవీరుల త్యాగాల జ్ఞాపకార్థం శుక్రవారం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పోలీసు అధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరం నందు ఎస్పీ పాల్గొని మొదటగా రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఎస్పీ జనార్ధన్ రెడ్డి, డీఎస్పీ నరసింహ చారి,ఆర్ఎస్ఐలు అశోక్, రాజశేఖర్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పౌరులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాల స్మారకంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. పోలీసుల త్యాగాలు బలిదానాలను ప్రజలు గుర్తించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానం ప్రాణదానమని, ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు అత్యవసర సమయంలో ఎందరో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా అవసరమైన వారికి సరైన సమయంలో రక్తం అందాలని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్ద ఎత్తున యువత తరలివచ్చి రక్తదానం చేయడం సంతోషకర విషయమని అన్నారు. ఖమ్మంకు చెందిన సికి సెల్ సొసైటీ వారు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల కోసం రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరం నందు పోలీస్ సిబ్బంది, ఆటో యూనియన్ వారు కలిసి 100 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహా చారి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్, ఆర్ఎస్ఐలు అశోక్, సురేష్, రాజశేఖర్, సాయిరాం, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

## తీగల వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** ఖమ్మం మున్నేరు నదిపై చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం నగరంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, కాల్వొడ్డు తీగల వంతెన పనులు, మున్నేరు భూ నిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ వెంచర్ పురోగతి పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు ఇచ్చే ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నిపుణుల కమిటీ చేసిన డిజైన్ ల ప్రకారం మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించాలని, రెండు వైపుల నుంచి ప్రణాళికాబద్ధంగా పని జరగాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, ఏజెన్సీ అదనపు బృందాలు ఏర్పాటు చేసి పనులు చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్%డ%బీ ఎస్ఇ యాకుబ్, ఇఇ పవార్, ఆర్డీఓ నరసింహారావు, ఇరిగేషన్ డిఇ రమేష్ రెడ్డి, ఖమ్మం అర్బన్, రూరల్ మండల తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్‌ఫామ్ సాగు లక్ష్యం పూర్తి చేయాలి



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందించే పథకాల లక్ష్యంను పూర్తి చేసేందుకు అధికారులు,ఆయిల్ ఫామ్, డ్రిప్ కంపెనీ సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి తీగల నాగయ్య అన్నారు. శుక్రవారం ఉద్యాన అధికారులు, పతంజలి ఆయిల్ ఫామ్ కంపెనీ, డ్రిప్ కంపెనీ, సిబ్బందితో ఆయిల్ ఫామ్ సాగు, ఉద్యాన శాఖ పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని,ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సూర్యాపేట జిల్లాకు ప్రభుత్వం ఇచ్చిన సాగు లక్ష్యం 3వేల ఎకరాలు ఉందని అన్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసుకొని ఈ సంవత్సరం జిల్లాకు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారులు ముత్తినేని మహేష్, కట్ట స్వాతి,అనిత, ప్రదీప్తి, ప్రమిత , ఆయిల్ ఫామ్ మేనేజర్లు జె.హరీష్,శశి కుమార్, ఉద్యాన విస్తరణ అధికారులు రంగు ముత్యంరాజు, సుధాకర్ రెడ్డి, అనిల్, ప్రభాకర్, డ్రిప్ కంపెనీ డిసిఓలు నర్సింహా, అఖిల్, మల్లేష్, అనిల్, ఫీల్డ్ ఆఫీసర్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్‌లో సుఖ ప్రసవాలు పెంచాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు

**మధిర, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** తెలంగాణ ఆరోగ్యశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాలు మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, తెలంగాణ వైద్య విధానపరిషత్ సంయుక్తంగా స్థానిక మధిర రిక్రాయేషన్ క్లబ్ లో మధిర ప్రభుత్వ హాస్పటల్ పీహెచ్ సీ బనిగండ్లపాడు, పీహెచ్ సీ మాటూరుపేట, పీహెచ్ సీ దెందుకూరు వైద్య అధికారులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్ ఆఫీసర్స్ సిబ్బంది కలిపి ప్రత్యేక ప్రభుత్వ హాస్పిటల్ లో సుఖ ప్రసవాలు పెంచాలి అనే విషయం మీద సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం మధిర సివిల్ హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కనక పుడి అనిల్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరుపున జిల్లా మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం, జిల్లా అసంక్రమిక వ్యాదుల నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామారావు ముఖ్య అతిధిగా పాల్గొని హాస్పిటల్ కానుపు మీద ప్రత్యేక దృష్టి పెట్టి డాక్టర్ లు డెలివరీలు పెంచాలని, దీనికి క్రింది స్థాయి పారామెడికల్ సిబ్బంది సూపర్ వైజర్ క్యాడర్ లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు హెచ్ఈఓ లు నర్సింగ్ ఆఫీసర్లు అందరూ ప్రతి గర్భిణీ స్త్రీ కీ సంపూర్ణ ముగా ఆరోగ్య సేవలు అందించాలి అని సూచించారు. అదే విధంగా మధిర ప్రభుత్వహాస్పిటల్ లో త్వరలో దియేటర్ ల్లో అన్ని



సౌకర్యాలు ఏర్పాటు చేసి సిజేరియేన్ ఆపరేషన్ లు నిర్వహించడం జరుగుతుంది అని మధిర హాస్పిటల్ సివిల్ సర్జన్, గైన కాలజిస్టు ప్రసన్న జ్యోతి తెలిపారు. అదే విధంగా స్కానింగ్ సౌకర్యం ఏర్పాటు మరియు గర్భిణీ స్త్రీ లు 5వ నెల నుండి 7వ నెల ప్రత్యేక చెకప్ లు తప్పకుండా అన్ని పీహెచ్ సీ లు నుండి మధిర ప్రభుత్వ హాస్పిటల్ కు పంపాలని సూచించారు. షుగర్ బిపి టెస్ట్ ల గురించి సంపూర్ణ వ్యాది నిరోధక టీకాలు కార్యక్రమం మొదలగు ప్రోగ్రాం లు టార్గెట్ పూర్తి చెయ్యాలి అని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, పీహెచ్ సీ డాక్టర్ లు వీరబాబు, పృథ్వి రాజ్, ప్రశాంత్ రామ్మోహన్ నాయక్, మోదుగు వెంటేశ్వర్లు, శ్రీనివాస్ రావు, షహనాజ్ తదితరడాక్టర్ బృందం వివధా పారామెడికల్ సిబ్బంది ఆశ నోడల్ పర్సన్ లు పల్లె దావఖాన్ సిబ్బంది బీడీకే సిబ్బంది ఎఎన్ఎమ్ లు ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి శస్త్ర చికిత్సా శిబిరం విజయవంతం

**భద్రాచలం, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** అంధత్వ నివారణకు, గిరిజన సంక్షేమం మారుమూల ప్రాంతాల్లో వైద్య సదుపాయం అందించడం కొరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ భద్రాచలం, లయన్ క్లబ్ జటావు, వికాస తరంగిణి, ఎన్.ఆర్.ఐ. వాసవి అసోసియేషన్ యుఎస్ వార్ల ఆధ్వర్యంలో "పుష్పగిరి కంటి ఆసుపత్రి' సికింద్రాబాద్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరములు విజయవంతమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం 14వ బ్యాచ్లో 46 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు సికింద్రాబాద్లోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించు కార్యక్రమం ను ఐటిసి కాంట్రాక్టర్ పాకాల దుర్గా ప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ వై.సూర్యనారాయణ జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించి స్వచ్ఛంద సంస్థల సేవలను అభినందించినారు. ఈ శిబిరంలో డా.ఎస్.ఎల్. కాంతారావు డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ప్రాజెక్టు ఆఫీసర్ ఐటిడిఎ భద్రాచలం బి. రాహుల్ సహాయ సహకారాలతో ఈ శిబిరములు నిర్వహించగలిగామని వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 600 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికవగా, వారందరికీ 14 బ్యాచ్లుగా కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందని డా.ఎస్.ఎల్. కాంతారావు



తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్యంత మారుమూల ప్రాంతాలైన కరకగూడెం, గుండాల, దుమ్ముగూడెం, చర్ల మండలాలల్లోని 190 గ్రామాల ప్రజలకు కంటి వైద్యచికిత్స అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్.ఎల్.కాంతారావు ఐఆర్సిఎస్ జిల్లా కోఆర్డినేటర్, ఐటిసి కాంట్రాక్టర్ పాకాల దుర్గా ప్రసాద్, లయన్, వై. సూర్యనారాయణ, నక్కా వెంకన్న యాదవ్, జి. సంజీవరావు, లయన్ గోళ్ళ భూపతిరావు, కమలా రాజశేఖర్, లయన్ పల్లంటి దేశప్ప, డా. భాను ప్రసాద్, జి. రాజారెడ్డి, ఆదినారాయణ, మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి సేవిస్తున్న యువకులను పట్టుకున్న పోలీసులు

**టేకులపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** టేకులపల్లి ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇల్లందు, కొత్తగూడెం ప్రధాన రహదారిలో టేకులపల్లి సమీపానగల సమ్మక్క సారక్క గద్దెల వద్ద కొంతమంది యువకులు పోలీసుల వాహనాలు చూసి పారిపోతున్న క్రమంలో వారిని వెంబడించి పట్టుకొని విచారించడంతో ఆ యువకులు గంజాయి సేవించడానికి అక్కడికి చేరుకున్నట్లు తెలిసింది. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన సుమారు మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో జరిగింది. ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను ఇల్లందు డిఎస్పి చంద్రబాను వివరాలను వెల్లడించారు. టేకులపల్లి ఎస్సై రాజేందర్ సిబ్బంది తో కలిసి టేకులపల్లి ఏరియా లో పెట్రోలింగ్ చేయుచుండగా సమ్మక్క, సారక్క గద్దెల వద్ద 5 గురు వ్యక్తులు పోలీసు వాహనాన్ని చూసి పారిపోతుండగా పట్టుకొని వారిని విచారించారని తెలిపారు. ఆ వ్యక్తులు తడబడుతు వారి వద్ద గంజాయి ఉన్నదని ఒప్పుకున్నారని, దాంతో ఎస్సై ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా జరిపి అయిదుగురు వ్యక్తుల నుండి మొత్తం 0.531 గ్రాముల గంజాయి (విలువ 26,550/- రూపాయలు ) నాలుగు సెల్ ఫోన్ లు, ఒక మోటార్ సైకిల్ నెంబర్ ఏపీ 20 క్యూ 3152, 1500/- రూపాయలు నగదును స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఐదుగురు వ్యక్తుల వివరాలు 1)బానోత్ కుమార్ ఏ డిజే కుమార్, లారీ డ్రైవర్, ఓనర్ టేకులపల్లి కి చెందిన వాడు. 2)తేజావత్ అనిల్, ఆటొ డ్రైవర్,ఏ' కాలనీ తండా గ్రామం, టేకులపల్లి మండలం, పిచ్చుకలపాడు గ్రామం, నెల్లిపాక మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏపీ స్టేట్, 3)జాటోత్ శివ,ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తుంటాడు. లచ్యా తండా గ్రామం, టేకులపల్లి మండలం. 4)గూగులోత్ సాయి, లారీ డ్రైవర్, %దీ% కాలనీ తండా గ్రామం, టేకులపల్లి మండలం,5)గూగులోత్ వినాయక్ ఏ సిద్దూ లారీ మెకానిక్,




లచ్యా తండా గ్రామం, టేకులపల్లి మండలంకు చెందినవారు. ఈ ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో టేకులపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎస్సై రాజేందర్, టేకులపల్లి పోలీసులు ఉన్నారు.

## పారిశుధ్య పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ



**ఖమ్మం, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 46 డివిజన్ ప్రధాన పారిశుధ్య సమస్యలను మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు , మేయర్ పునుకొల్లు యువ నాయకులు తుమ్మల యుగంధర్ తెలియజేయగా వారు మున్సిపల్ అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు అట్టి పనులను కార్పోరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ శుక్రవారం పర్యవేక్షించారు. ప్రధానంగా మంత్రి తుమ్మల సహకారంతో ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఎప్పుడు మురికి నీళ్లు నిలువ ఉండి ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నందున ప్రత్యేక వాహనం ద్వారా మురుగును తొలగించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఫిషరీస్ ఆఫీస్ వెనుక భాగం నుండి ఎఫ్ సి ఐ బైపాస్ రోడ్ వరకు గల కాలువలో గల మురికి వ్యర్ధాలను జెసిబితో తొలిగించారు అని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, మున్సిపల్ శానిటరీ సూపర్వైజర్ సాంబయ్య, జవాన్ శ్రీనివాస్, నాయకులు ఎమ్మే రామకృష్ణ, నర్సిరెడ్డి, మురళి, ఓరుగంటి రాజనరేష్, మున్సిపల్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

# విపణి



## పాత కారు.. కొత్త క్రేజ్..

# ఆక్టేవియా ఆర్ఎస్

## 20 నిమిషాల్లో మొత్తం కొనేశారు!

**న్యూఢిల్లీ:**భారత్‌లో పాతికేళ్ల ప్రయాణం సందర్భంగా స్కోడా ఆటో ఇండియా సరికొత్తగా 'ఆక్టేవియా ఆర్ఎస్' మోడల్‌ను తిరిగి తీసుకొచ్చింది. స్పోర్టీ డిజైన్, అధునాతన సాంకేతికత, ట్రాక్ – బ్రెడ్ ఇంజనీరింగ్ అంశాల సమ్మేళనంగా రూపొందించారు.ఎక్స్‌షోరూం ధర రూ.4 9,99,000గా నిర్ణయించారు. ప్రీ బుకింగ్స్ ప్రారంభమైన తొలి 20 నిమిషాల్లో మొత్తం కార్లు అమ్ముడయ్యాయి. ఇది పరిమిత ఎడిషన్ కావడంతో కేవలం 100 యూనిట్లు మాత్రమే విక్రయానికి ఉంచారు. డెలివరీలు నవంబర్ 6న ప్రారంభమవుతాయి. ఏరోడైనమిక్ లైన్స్, యాగ్రెసివ్ ఫ్రంట్ గ్రిల్, రెడ్ బ్రేక్ క్యాలిపర్స్, సిగ్నేచర్ ఆర్ బ్యాడ్జ్ ఇవన్నీ కలిసి మోడల్ లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ఇంటీరియర్‌లో స్పోర్ట్స్ సీట్స్, టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ వంటి ఫీచర్లు ఉన్నాయి.ఇందులో 2.0–లీటర్ టీఎస్ఐ టర్బోచార్జ్ పెట్రోల్ ఇంజిన్ అమర్చబడి ఉంది. ఈ ఇంజిన్ గరిష్ఠంగా 245బీహెచ్‌పీ పవర్, 370ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజిన్‌కు 7–స్పీడ్ జీఎస్‌జీ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ జత చేశారు. కేవలం 6.4 సెకన్లలోనే 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చు.పది ఎయిర్‌బ్యాగ్‌లు, ఈబీడీతో కూడిన ఏబీఎస్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, 360 డిగ్రీల ఏరియా వ్యూ కెమెరా వంటి ఆధునిక భద్రతా ఫీచర్లున్నాయి. అయిదు అద్భుతమైన రంగుల్లో లభిస్తుంది. ఈ మోడల్‌కు నాలుగేళ్లు లేదా లక్ష కిలోమీటర్ల వారంటీ, నాలుగేళ్ల పాటు కాంప్లిమెంటరీ రోడ్–సైడ్ అసిస్టెన్స్ ఉంటాయి.

## ప్రైవేట్ ఉద్యోగుల జీవితాలకు అండగా

# ఈపీఎఫ్‌వో

### ఉచితంగా రూ.7 లక్షలు బీమా



**అకాల మరణం.. ప్రతి ఉద్యోగి జీవితంలో అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రమాదం. ఉద్యోగులు చనిపోతే ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న వారికి ప్రత్యేక వెసులుబాట్లు ఉంటాయి కాబట్టి వారి కుటుంబం ఆర్థికంగా పెద్దగా ఇబ్బంది పడకపోవచ్చు. అదే చిన్న సంస్థలో తక్కువ జీతానికి పనిచేస్తూ ఇంటి ఖర్చులను నెట్టుకొస్తున్న వారి కుటుంబాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఆ సమయంలో ఉద్యోగి పోగుచేసుకున్న ఈపీఎఫ్‌తోపాటు మరొక కీలకమైన భద్రత తోడుగా ఉందని గుర్తుంచుకోవాలి. అదే ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్. దీనికి గురించి వివరాలు తెలుసుకుందాం..**

**న్యూఢిల్లీ:**ఈపీఎఫ్ఓ ఆధ్వర్యంలో 1976లో ప్రారంభమైన ఈ పథకం ఉద్యోగుల కుటుంబాలకు ఒక నిర్దిష్ట మొత్తంలో బీమా ప్రయోజనాన్ని అందిస్తుంది. ఉద్యోగులకు ఆర్థిక భద్రతను అందించే ఈపీఎఫ్ఓ ఫ్రేమ్‌వర్క్‌లో ఇది కీలకంగా ఉంది.ఈడీఎల్ఐ అనేది ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సభ్యుల కోసం ఉద్దేశించిన బీమా పథకం. ఈపీఎఫ్ఓ పరిధిలోకి వచ్చే ఏ ఉద్యోగి అయినా సర్వీసులో ఉండగా మరణిస్తే వారి నామినీ లేదా చట్టపరమైన వారసులకు ఈ పథకం కింద ఏకమొత్తంలో బీమా మొత్తాన్ని చెల్లిస్తారు.చాలా మందికి వచ్చే సందేహం ఇదే. ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి ఈపీఎఫ్ ఖాతాలో ఉన్న మొత్తం, పెన్షన్ అందుబాటులో ఉంటాయి. అయితే ఈడీఎల్ఐ వీటి కంటే భిన్నంగా పనిచేస్తుంది. ఈపీఎఫ్ అనేది ఉద్యోగి దాచుకున్న పొదుపు. కాగా, ఈడీఎల్ఐ అనేది బీమా. ఇది తక్షణమే బాధిత కుటుంబానికి ఏకమొత్తంలో ద్రవ్య సహాయాన్ని అందించి, ఆర్థిక భరోసాను కల్పిస్తుంది.ఈడీఎల్ఐ ప్రీమియాన్ని పూర్తిగా కంపెనీయే భరిస్తుంది. ఉద్యోగి వేతనంలో ఎలాంటి కోత లేకుండా ఉచితంగా ఈ బీమా కవరేజీని పొందవచ్చు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వ్యక్తి ఈపీఎఫ్ బ్యాలెన్స్ తక్కువగా ఉన్నప్పటికీ ఈడీఎల్ఐ కింద రూ.7 లక్షల వరకు బీమా కవరేజీకి అర్హత పొందుతాడు. అంటే ఈపీఎఫ్ పొదుపుతో సంబంధం లేకుండా బీమా భద్రత లభిస్తుంది. 20 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న అన్ని సంస్థలు ఈపీఎఫ్ చట్టం కింద నమోదు చేసుకోవాలి. ఈపీఎఫ్‌కు అర్హత ఉన్న ప్రతి ఉద్యోగికి ఈడీఎల్ఐ కవరేజీ ఆటోమేటిక్‌గా వర్తిస్తుంది. ఈ పథకం ఉద్యోగంలో ఉన్నప్పుడు సంభవించే సహజ మరణం, ప్రమాదం లేదా అనారోగ్యంతో మరణించినా కవరేజీ లభిస్తుంది. ఈపీఎఫ్‌కు ఉన్న నామినీలే దీనికి వర్తిస్తారు.ఈడీఎల్ఐ కింద చెల్లించే మొత్తం గరిష్ఠంగా రూ.7 లక్షలకు పరిమితం చేశారు. ఈ మొత్తాన్ని లెక్కించే విధానంలో బోనస్ ఒక కీలక పాత్ర పోషిస్తుంది. మరణించిన ఉద్యోగి కుటుంబానికి స్థిర బోనస్ కింద రూ.2.5 లక్షలు చెల్లిస్తారు. ఈడీఎల్ఐ ప్రయోజనాన్ని కింది విధంగా లెక్కిస్తారు. సగటు నెలవారీ వేతనం కింద మరణానికి ముందు 12 నెలల్లో ఉద్యోగి తీసుకున్న వేతనాన్ని లెక్కిస్తారు. ఈడీఎల్ఐ లెక్కల ప్రకారం ఈ వేతనాన్ని రూ.15,000కు పరిమితం చేశారు. ఉద్యోగి జీతం రూ.15,000 కంటే తక్కువగా ఉన్నప్పటికీ కనీసం రూ.2.5 లక్షల హామీ చెల్లింపు లభిస్తుంది.

**ఎలా విత్‌డ్రా చేసుకోవాలి?**

ఉద్యోగి మరణించిన సందర్భంలో నామినీ లేదా చట్టపరమైన వారసులు ఈ ప్రయోజనాలను క్లెయిమ్ చేయవచ్చు. ఫారంను పూర్తి చేసి అవసరమైన డాక్యుమెంట్లతో పాటు ప్రాంతీయ ఈపీఎఫ్ కార్యాలయంలో సమర్పించాలి. ఖాతాదారుడి మరణ ధ్రువీకరణ పత్రం, గార్డియన్షిప్ పత్రం (వర్తిస్తే), క్యాన్సల్ చెక్ జతచేయాలి. దరఖాస్తు సమర్పించిన తర్వాత క్లెయిమ్‌ను 30 రోజులలోపు పరిష్కరించాల్సి ఉంటుంది. ఆలస్యం అయితే 12% వార్షిక వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది.

## 2025 మార్చి నాటికి 150 కొత్త శాఖలు

### యూకో బ్యాంక్

ప్రభుత్వరంగ యూకో బ్యాంక్ తన కార్యకలాపాల విస్తరణపై దృష్టి సారించింది. వచ్చే మార్చి నాటికి 150 కొత్త శాఖలను తెరవనున్నట్టు ప్రకటించింది.ఇందుకు బోర్డు ఆమోదం తెలిపినట్టు యూకో బ్యాంక్ ఎండీ, సీఈవో అశ్వినీ కుమార్ తెలిపారు.ప్రస్తుతం యూకో బ్యాంక్‌కు దేశవ్యాప్తంగా 3,322 శాఖలు ఉన్నాయి. సెప్టెంబర్ చివరికి యూకో బ్యాంక్‌లో ఉద్యోగుల సంఖ్య 21,266గా ఉన్నట్టు చెప్పారు. క్యూ2లో యూకో బ్యాంక్ మెరుగైన స్థిరమైన పనితీరు సాధించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే క్యూ2 పోల్చి చూస్తే రూ.603 కోట్ల నుంచి రూ.620 కోట్లకు, ఆదాయం రూ.7,071 కోట్ల నుంచి రూ.7,421 కోట్లకు వృద్ధి చెందింది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.45 | ₹ 5.47 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
| --- | --- |
| ₹ 1,14,000 (22 క్యారెట్లు) | ₹ 1,24,370 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,70,000

## పంక్చర్ షీల్డ్ ప్యాడ్.. టైరు చాలా సేఫ్!



**న్యూఢిల్లీ:**ప్రస్తుతం ట్యూబ్ టైర్ల నుంచి ట్యూబ్‌లెస్ టైర్ల వరకు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. అయితే ఇప్పుడు ఫంక్చర్ నుంచి కాపాడే పంక్చర్ షీల్డ్ ప్యాడ్ అనేది తెరమీదకు వచ్చింది.ఇదెలా పనిచేస్తుంది?, దీనివల్ల ఉపయోగాలేమిటి అనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.పంక్చర్ షీల్డ్ ప్యాడ్.. టైర్లలో ఉపయోగించడం వల్ల, పంక్చర్‌ను తక్షణమే మూసివేయడం మాత్రమే కాకుండా.. ఎయిర్ లీక్ వంటి వాటిని కూడా ఆపుతుంది. దీనిని టైర్లలో ఫిక్స్ చేయడం కూడా చాలా సులభం. దీనికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.వీడియోలో గమనిస్తే.. టైరు మధ్యలో క్లీన్ చేసుకుని, పంక్చర్ షీల్డ్ ప్యాడ్ అమర్చడం కనిపిస్తుంది. ఆ తరువాత అల్లాయ్ వీల్‌కు ఫిక్స్ చేశారు. ఇలా చేసిన తరువాత ఒక స్క్రూను టైరులో దింపి టెస్ట్ చేస్తారు. కానీ టైరుకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. ఆ తరువాత కారుకు టైరును ఫిక్స్ చేస్తారు. ఇలా చేయడం వల్ల ఇది ఎక్కువ రోజులు మన్నికగా ఉంటుందని, సురక్షితమైన డ్రైవ్ అందిస్తుందని తెలుస్తోంది. ఇక ట్యూబ్ టైర్లు.. ట్యూబ్‌లెస్ టైర్ల విషయానికి వస్తే, ఈ రెండింటినీ వాహనాల్లోనే ఉపయోగించినప్పటికీ.. కొన్ని తేడాలు గమనించవచ్చు. ట్యూబ్ టైర్.. రబ్బర్ ట్యూబ్ కలిగి ఉంటుంది. ఈ ట్యూబ్‌లోనే గాలి నింపుతారు. అయితే ట్యూబ్‌లెస్ టైర్లలో ట్యూబ్ ఉండదు. పైగా దీనిని అల్లాయ్ వీల్‌కు ఫిక్స్ చేసి.. గాలిని నింపుతారు.ట్యూబ్ టైరు పంక్చర్ అయినప్పుడు.. టైరులోని గాలి మొత్తం బయటకు వచ్చేస్తుంది. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.


## ఎన్ఎస్ఈ మ్యూచువల్ ఫండ్ కొత్త యాప్‌లు

**న్యూఢిల్లీ:**నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) తన ఎన్ఎస్ఈ ఎంఎఫ్ ఇన్వెస్ట్ మ్యూచువల్ ఫండ్ ప్లాట్‌ఫామ్నుమరింతమెరుగుపరిచింది. ఇందులోభాగంగానాలుగు కొత్త మొబైల్ సొల్యూషన్స్, కీలక అప్ డేట్ లను జోడించినట్లు ప్రకటించింది. మదుపరులు, ట్రేడింగ్ సభ్యులు, లిస్టెడ్ కంపెనీలకు ప్రాప్యత, పారదర్శకత, సౌలభ్యాన్ని పెంచడం లక్ష్యంగా వీటినితీసుకొచ్చినట్లుఎన్ఎస్ఈవెల్లడించింది.మాన్యువల్ ఎంట్రీ ద్వారా లేదా ఎన్ఎస్ఈలో అమలు చేసిన వారి ట్రేడ్‌ను లింక్ చేయడం ద్వారా సులభంగా పోర్ట్‌ఫోలియోను ట్రాక్చేసేలాఅభ్గేద్చేసిన ఇన్వెస్టర్ యాప్ను ఎన్ఎస్ఈరూపొం దించింది. ఇది ఇంగ్లీష్, హిందీతో సహా 13 భాషలలో అందుబాటులో ఉంది.యుసిఐలో ఎన్ఎస్ఈలో నమోదు చేసుకున్న తమ బ్రోకర్ ఖాతాకు లింక్ను యూజర్లుపొందవచ్చు.ఐఓఎస్, ఆండ్రాయి డ్లోమొబైల్ యాప్ వివిధ భాషలలో అందుబాటులో ఉంది. మార్కెట్ అప్డేట్స్, కోసం ఎన్ఎస్ఈ వాట్సాప్ చాట్బాట్ను కూడా ప్రారంభించింది. సమర్పణ, జరిమానా స్థితి వంటి అంశాలను రియల్ టైమ్‌లో ట్రాక్ చేయడానికి కంప్లయన్స్ డ్యాష్‌బోర్డులు, మదుపరుల అవగాహన కార్యక్రమాలు, సర్క్యులర్లు, గణాంకాలకు సులభ ప్రాప్యత కలిగించే సభ్య పోర్టల్ యాప్ను ప్రవేశపెట్టింది.

## శాంతి.. సమానత్వం.. ఆదర్శాలతో అవతరించిన

# ఐక్యరాజ్యసమితి

## 80వ అవతరణ దినోత్సవం



**న్యూయార్క్:**రెండవ ప్రపంచ యుద్ధం వల్ల ప్రపంచం తీవ్ర అశాంతిని అనుభవించింది. దీంతో శాశ్వతమైన శాంతి కోసం ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించుకుని, 1945 అక్టోబర్ 24న 51 దేశాలు కలిసి 'ఐక్యరాజ్యసమితి చార్టర్'ను అమల్లోకి తెచ్చాయి. ఆ తరువాత అనేక దేశాలు ఐక్యరాజ్య సమితిలో చేరాయి. అంతర్జాతీయ శాంతిని కాపాడడం, దేశాల మధ్య స్నేహ పూర్వక సంబంధాలను పెంపొందిస్తూ, అంతర్జాతీయ సహకారాన్ని సాధించడం, మానవ హక్కులను పరిరక్షించడం, సుస్థిరాభివృద్ధిని సాధించడం, యుద్ధాలను నివారించడం ఐక్యరాజ్యసమితి (యూఎన్ఓ) ప్రధాన లక్ష్యాలుగా చెప్పవచ్చు.యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు చోటు చేసుకున్న ప్రాంతాల్లో ఐక్యరాజ్యసమితి శాంతిస్థాపన కోసం బలగాలను పంపి, వివాదాలను పరిష్కరించడంలో ప్రధాన పాత్ర పోషించింది. ఉదాహరణకు, కొరియా, కాంగో, లెబనాన్, సూడాన్, సిరియా వంటి దేశాల్లో ఐక్యరాజ్యసమితి బలగాలు శాంతిస్థాపనకు ఎంతగానో కృషి చేశాయి. 1948లో 'మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన' ను ఆమోదించడం ఈ సంస్థ గొప్ప విజయంగా చెప్పవచ్చు. అదేవిధంగా, 'ప్యారిస్ ఒప్పందం', 'క్యోటో ఒప్పందం' వంటి వాతావరణ మార్పుల నియంత్రణ కోసం చేపట్టిన కార్యక్రమాలు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో విజయవంతమయ్యాయి. కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, జీవవైవిధ్యం పరిరక్షణ వంటి అనేక అంశాల్లో అంతర్జాతీయ చర్చలకు ఐక్యరాజ్యసమితి ఒక వేదికగా మారింది. యూఎన్‌డీపీ, యునెస్కో, యునిసెఫ్ వంటి ఉపసంస్థల ద్వారా, పేదరిక నిర్మూలన, విద్యా విస్తరణ, ఆరోగ్య సంరక్షణలో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా పోలియో, మలేరియా, టీబీ వంటి వ్యాధుల నిర్మూలనలో యూఎన్ఓ విజయవంతమైంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించడం ద్వారా ప్రపంచంలో సమానాభివృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం యూఎన్ఓ కృషి చేస్తోంది. ఎస్‌డీజీల ద్వారా 2030 నాటికి ప్రపంచ అభివృద్ధికి లక్ష్యాలను నిర్ధారించింది. శరణార్థుల సమస్యలపై మరింత దృష్టి పెట్టింది. ప్రపంచవ్యాప్తంగా మహిళా సాధికారత, సమాన హక్కులు, విద్య, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడం ప్రత్యేక లక్ష్యంగా గుర్తించి ఆ దిశలో కృషి చేసింది. దేశాల మధ్య అణు ఆయుధాల పరిమితులు, అణుసమర పరికరాల నియంత్రణలో ఐక్యరాజ్యసమితి కీలక పాలకురాలిగా నిలిచింది. ప్రపంచ ఆహార కార్యక్రమం ద్వారా కోట్లాది ప్రజలకు ఆహారం అందిస్తోంది.అనేక విజయాలు సాధించిన మాట నిజమే కానీ ఇప్పుడు ఐరాసను ఎందుకు స్థాపించారో ఆ లక్ష్యాల సాధనలో విఫలమవుతున్నట్లు స్పష్టమవుతోంది. అంతర్జాతీయ రాజకీయాల్లో విభజనల ఫలితంగా ఈ పరిస్థితి చోటుచేసుకుంది. ముఖ్యంగా అమెరికా పెత్తనం ఎక్కువవ్వడం, నిధుల్లో ఆ దేశం కోత విధించడం వంటి కారణాలు ఐరాసను డమ్మీగా మార్చేస్తున్నాయి. ప్రపంచ శాంతిని కాపాడడంలో చిన్న, పెద్ద దేశాలు అనే తేడా లేకుండా వ్యవహరించాలి. లేకపోతే, మనం ఎదుర్కొంటున్న యుద్ధాలు మరింత తీవ్రతరమవుతాయి. ఫలితంగా ప్రపంచం అశాంతిమయం అవుతుంది.

## విషాదం.. చిన్న వయసులోనే హఠాన్మరణం



**అబుదాబి:**చిన్న వయసులో గుండెపోటుతో మరణించే వారి సంఖ్య పెరుగుతోంది. తాజాగా దుబాయ్‌లో భారతీయ విద్యార్థి ఒకరు గుండెపోటుతో హఠాన్మరణం పాలయ్యాడు. దీపావళి వేడుకల్లో ఉండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో అతడు మరణించినట్టు స్థానిక మీడియా 'గల్ఫ్ న్యూస్' వెల్లడించింది. మృతుడు కేరళకు చెందిన వైష్ణవ్ కృష్ణకుమార్ (18)గా గుర్తించారు. దుబాయ్‌లోని మిడిల్‌సెక్స్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం బీబీఏ మార్కెటింగ్ చదువుతున్నాడు. అతడికి యూఏఈ గోల్డెన్ వీసా ఉందని సమాచారం.దుబాయ్ ఇంటర్నేషనల్ అకడమిక్ సిటీలో మంగళవారం జరిగిన దీపావళి వేడుకల్లో వైష్ణవ్ పాల్గొన్నాడు. సంబరాల్లో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు గుండెపోటు కారణంగా మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. అయితే వైష్ణవ్‌కు ఎటువంటి గుండె సమస్యలు లేవని అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. దుబాయ్ పోలీస్ ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ తదుపరి దర్యాప్తు జరుపుతోందని చెప్పారు.వైష్ణవ్ మృతదేహాన్ని కేరళకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలని అతడి తల్లిదండ్రులు భావిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు తాను చూసుకుంటున్నట్టు దుబాయ్‌లోని వైష్ణవ్ బంధువు నితీశ్ 'ఖలీజ్ టైమ్స్'తో చెప్పారు. శుక్రవారం నాటికి వైష్ణవ్ మృతదేహం కేరళకు చేరుకుంటుందని భావిస్తున్నారు. అలప్పుజ జిల్లా చెన్నితల పంచాయతీలోని కరాజ్మా ప్రాంతానికి చెందిన వైష్ణవ్ కుటుంబంలో దుబాయ్‌లో సెటిలయింది. వైష్ణవ్ తండ్రి కృష్ణకుమార్ 20 ఏళు పైగా దుబాయ్‌లోని ఉద్యోగం చేస్తున్నారు. వైష్ణవ్, అతడి చెల్లెలు దుబాయ్‌లోనే పుట్టిపెరిగారని వారి బంధువు గోపి కర్ణవర్ తెలిపారు. అలప్పుజలో ఆయన పీటీఐతో మాట్లాడుతూ.. వైష్ణవ్ చాలా తెలివైన కుర్రాడని చెప్పారు. వైష్ణవ్ కుటుంబం చాలా అరుదుగా స్వస్థలానికి వస్తుందని, రెండేళ్ల క్రితం వారు కొత్తగా నిర్మించిన ఇంటి గృహప్రవేశ వేడుక కోసం చివరిసారిగా ఇక్కడికి వచ్చారని వెల్లడించారు.వైష్ణవ్ కృష్ణకుమార్ మరణం పట్ల మిడిల్‌సెక్స్ యూనివర్సిటీ సంతాపం తెలిపింది. చిన్న వయసులోనే అతడు చనిపోవడం ఎంతో కలచివేసిందని సంతాప ప్రకటనలో పేర్కొంది. వైష్ణవ్ చదువుకున్న జెమ్స్ అవర్ ఓన్ ఇండియన్ స్కూల్ కూడా సంతాపం ప్రకటించింది. వైష్ణవ్ ప్రతిభావంతుడైన విద్యార్థి అని కొనియాడింది. వైష్ణవ్ మరణంతో అతడి తండ్రి కృష్ణకుమార్, తల్లి విధు, చెల్లెలు వృష్టి విషాదంలో మునిగిపోయారు.

## ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది



ప్రపంచవ్యాప్తంగా ఖండించినప్పటికీ.. పాకిస్థాన్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. యూఎన్ సమావేశాల్లో పదేపదే కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు భారత్‌పై నిందలు మోపే ప్రయత్నాలు చేస్తుంది. అయితే, భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతుంది. ఈ పరిణామాల నేపథ్యంలో జై శంకర్ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇక, గురువారం యూఎన్‌లో జరిగిన సమావే శాల్లో పాక్ దౌత్యవేత్తలు ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అయితే, భారత్ వీటిని తీవ్రంగా వ్యతిరేకించింది.



# 'స్లీపర్'లోనే ఎందుకీ ప్రమాదాలు?

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరీ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు గురువారం అర్ధరాత్రి దాటాక కర్నూలు శివారులో ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే.ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలి బూడిదై పోయింది. ఫిట్‌నెస్ లేని బస్సు, పైగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘోరం సంభవించిందని అధికారులు ప్రాథమిక అంచనాకి వచ్చేశారు.ఈ ప్రమాదంలో 19 మంది మృత్యువాత పడగా, 27 మంది ప్రాణాలతో బతికిబయటపడ్డారు. అయితే బస్సులు అగ్ని ప్రమాదాలకు గురైన సమయంలో అత్యధికంగా ప్రాణానష్టమే కన్పిస్తుంది. ప్రధానంగా స్లీపర్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైందంటే ప్రాణనష్టం అనేది భారీగా ఉంటుంది. పది రోజుల క్రితం రాజస్థాన్‌లోనూ ఇదేతరహా ప్రమాదం జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. గత కొన్నేళ్లుగా స్లీపర్ బస్సుల్లో జరుగుతోన్న ప్రమాద ఘటనలు ప్రయాణికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. మరి ఈ ప్రమాదాలకు కారణాలేంటనేది ఒక్కసారి చూస్తే..! సుమారు 250 కిలోమీటర్ల నుంచి 1,000 కి.మీ దాటే వరకూ కూడా ఎక్కువగా ప్రయాణికులు స్లీపర్ బస్సులనే ఆశ్రయిస్తున్నారు. ఈ బస్సులు రాత్రి వేళల్లోనే ఎక్కువగా తిరుగుతూ ఉంటాయి. ఇక్కడ డ్రైవర్లకు అలసట అనేది కీలకంగా మారుతుంది. డ్రైవర్లు అలసట బారిన పడి, నిద్ర మత్తులోకి జారుకోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణంగా నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 2018లో నిర్వహించిన ఓ సర్వేలో.. తాము డ్రైవింగ్ సమయంలో నిద్రమత్తుకు లోనవుతున్నట్లు 25 శాతం మంది డ్రైవర్లు ఏడేళ్ల నాడు నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడించారు.స్లీపర్ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు డిజైన్ లోపం కూడా భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరగడానికి ప్రధాన కారణంగా కనబడుతోంది. బస్సులో పడుకోవడానికి ఏమీ ఇబ్బంది లేకపోయినా, బస్సులో బెర్తులు, సీట్ల మధ్య ఉన్న గ్యాప్ చాలా తక్కువగా ఉంటుంది. కేవలం సింగిల్ మనిషి మాత్రమే వెళ్లేలా ఉంటుంది. ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఇది కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఒకర్ని తోసుకుంటూ ఇంకొకరు వెళ్లడం మరింత గందరగోళాన్ని సృష్టించి తొక్కిసలాటకు కూడా కారణమయ్యే చాన్స్‌లు కూడా అత్యధికంగా అనేది నిపుణులు అభిప్రాయం. సీట్ల మధ్యలో పరిమిత స్థలం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువమంది లోపల చిక్కుకుపోతున్నారని అభిప్రాయపడుతున్నారు. ఇక ఎత్తు కూడా మరొక సమస్య. వీటి ఎత్తు 8–9 అడుగుల వరకు ఉంటుంది. బస్సు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు ప్రయాణికులు ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టంగా ఉంటుంది. బస్సు ప్రమాదం జరిగినప్పుడు చాలా స్వల్ప సమయంలోనే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. రెండు, మూడు నిమిషాల్లో తప్పించుకుంటే ప్రాణాలతో బయటపడుతున్నారు. లేకపోతే అగ్నికి ఆహుతి అయిపోతున్నారు. స్లీపర్ బస్సులు సాధారణంగా ఏసీ బస్సులే అధికంగా ఉంటాయి. ఏసీ బస్సుల్లో ప్రమాదం జరిగితే డోర్స్ ఓపెన్ కావడం కూడా కష్టమే. ఏమైనా అద్దాలు బ్రేక్ చేయాలంటే కూడా ఎంతో కొంత సమయం ఉండాలి. అంటే ఇక్కడ మేల్కొని ఉన్న ప్రయాణికులే ఎంతో కొంత ప్రతిఘటించి బయటకు వచ్చే చాన్స్ ఉంటుంది. ఆ కంగారు, తొందరలో మిగతా వారిని నిద్ర లేపే చాన్స్ కూడా తక్కువగానే ఉంటుంది.

# యువ చైతన్య సదస్సు విజయవంతం

- కరీంనగర్ సదస్సులో మేధావుల దిశా నిర్దేశం
- విజ్ఞానంతోనే విజయ పథంలోకి .. యువతీ మణులు చైతన్యానికి ప్రతిరూపాలు
- సమాజ మార్పు , యువత చేతిలోనే .. తమలోని నిద్రపోయిన శక్తిని మేల్కొలపాలి
- మహాదేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి) :**
మహాదేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎస్బిఎస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించిన యువ చైతన్య సదస్సులో మేధావులు, వందలాది యువతీ, యువకులు పాల్గొని ప్రేరణతో ఊగిపోయారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉరుమల్ల విశ్వం సారథ్యంలో జరిగిన ఈ సాదస్సుకు ముఖ్య అతిధిగా జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపాక అధ్యక్షుడు వెన్న పూస బ్రాహ్మరెడ్డి పాల్గొన్నారు. మేధావులు మాట్లాడుతూ, నాయకుల వెంట తిరిగితే నాయకులు అయిపోరూ నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటేనే నువ్వు మార్పు దిశలో అడుగుపెడతావని పిలుపునిచ్చారు. సెల్‌ఫోన్ స్ర్కీన్‌లలో కాదు, ఐలమ్మలాంటి పోరాటాలలోనే యువత భవిష్యత్తు దాగి ఉందన్నారు. విద్యతో పాటు సమాజానికి సేవ చేయాలనే తపన ఉండాలని సూచించారు. అలాగే, మూడ నమ్మకాలను వదిలి, మనపై విశ్వాసం, సమాజంపై బాధ్యత, దేశం పై నిబద్ధత ఇవి జీవితాన్ని మార్చే మంత్రాలని స్పష్టం చేశారు. విజ్ఞానం వైపు అడుగులు వేయాలని, సాంకేతిక పరిజ్ఞానం ఆధునిక ప్రపంచంలో మనకు ఆయుధమని గుర్తుచేశారు. యువతీ, యువకులు విద్యతో పాటు విలువలు, సంస్కారం, ఆత్మవిశ్వాసం కలగలిపి ముందుకు సాగాలని మేధావులు సూచించారు. మంచి వస్త్రధారణ, మనోధైర్యం, ఆత్మరక్షణ, ఇవే ఆధునిక యువతీ మణుల శక్తి చిహ్నాలన్నారు. సమాజంలో చైతన్యం రగిలించేది, కొత్త దిశ చూపేది యువతేనని స్పష్టం చేశారు. విమర్శ కాదు, విజ్ఞానం నేర్చుకో ఫిర్యాదు కాదు, ప్రయత్నం చెయ్యి అని మేధావులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పలువురు కవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ ముని మనుమరాలు చిట్యాల శ్వేత ఐలమ్మ, శ్రీ రామోజు అంజనాదేవి, పి. సుగుణాకర్‌రావు, డా. బిఎన్‌రావు, డా. చాట్ల శ్రీధర్, కె. వేణుగోపాల్, ఎం.అలేఖ్య, బి.కాంత, సామానపల్లి లక్ష్మి, వినోద్, నటేష్, రఘ రాజు, తదితర మేధాకవులు 15వందల మంది యువతీయువకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 (జనంసాక్షి) :**
వేములవాడ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారము వేములవాడ అర్బన్ మండలంలో గుర్రం మానిపల్లెలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గృహప్రవేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు పక్క ఇల్లు ఉండాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారని, రాష్ట్రంలో రాజకీయాలకు పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నమన్నారు.ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశారన్నారు.ఇళ్లు లేని వారికి గూడు కల్పించడం కోసం ప్రభుత్వం రూ 5 లక్షల నిధులు మంజూరు చేస్తుందని, దేశ వ్యాప్తంగా ఇంటి నిర్మాణానికి రూ 5 లక్షల ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వడం లేదన్నారు. పేదల స్వంత ఇంటి కల నేడు ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుంద న్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తానని మోసం చేసిందని,పట్టణంలో గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతు న్నాయన్నారు. ఇప్పటికే కొందరికి బేస్మెంట్ లెవెల్ పూర్తయి, కొందరికి స్లాబ్ దశలో ఉండి తమ తమ ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంద న్నారు. ఆయన వెంట అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# తేనెటీగల దాడిలో గాయపడిన రైతులకు చల్మెడ పరామర్శ

**కోనరావుపేట (జనంసాక్షి):**
కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన దాదాపు 18 మంది పత్తి రైతులు పని నిమిత్తం కనగర్తి-సుద్దాల గ్రామాల మధ్య ఉన్న చేనులోకి వెళ్ళగా తేనెటీగలు ఒకేసారి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాల య్యారు. వెంటనే విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సిరిసిల్ల ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. వారి వెంట మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ అరుణ రాఘవరెడ్డి,మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య సీనియర్ నాయకులు చంద్రయ్య, మంతెన సంతోష్, లక్ష్మణ్, మహేందర్, శివతేజ ఉన్నారు.

# దళారులకు ధాన్యం విక్రయించొద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలి
- కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య



**కోనరావుపేట(జనంసాక్షి):** దళారులకు ధాన్యం విక్రయించొద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలని కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య తెలిపారు. రైతులకు అందుబాటులో కేంద్రాల ఏర్పాటు చేశామని అన్నారు. శుక్రవారం సుద్దాలలో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఏగ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ 2389, సాధారణ రకానికి రూ 2369 మద్దతు ధర ప్రజాపాలన ప్రభుత్వంలో కల్పిస్తున్నామని తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 అదనంగా బోనస్ అందిస్తామని ప్రకటించారు. రైతులు అధికారుల సూచన మేరకు ధాన్యం తరలించాలని, తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. సుద్దాల గ్రామంలో రైతుల సంఖ్య ఎక్కువని, వారికి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అంతకు ముందు ఆయన గ్రామంలోని సోడాలమ్మ బీరయ్యలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్‌పర్సన్ ఇంచార్జ్ రాములు ఏఎంసీ డైరెక్టర్‌లు సాసల మల్లారెడ్డి,నాయిని ప్రభాకర్,కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చేపూరి గంగాధర్ నాలుక సత్యం నిరంజన్ రావు,నీరటి సంజీవ్ మాజీ సర్పంచ్ కచ్చకాయల బాలరాజు,గంగయ్య, రెడ్డి,నీరటి రవి,బుచ్చి రాములు,బొడ్డు రమేష్,దొబ్బల దేవయ్య,వంగాల శ్రీనివాస్,బాపురెడ్డి జగిడి,బుర్ర రమేష్,మాసం సురేష్,ఎర్రవెల్లి విజయ్,ఉప్పుల అంజయ్య,సీఈఓ రాజేశం,అమర్,పర్శరాం పాల్గొన్నారు

# బోనస్ హామీలపై రైతుల ఆగ్రహం

- రైతుల ఆందోళనల మధ్య ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- అడిషనల్ కలెక్టర్‌కు నిరసన సెగ



**సైదాపూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి):**
సైదాపూర్ మండలంలోని విశాల ప్రాథమిక సహకార సంఘం పరిధిలో 14 గ్రామ పంచాయతీలలో శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు వచ్చారు. అయితే, రాయికల్ గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద ఆమెకు రైతుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. గత యాసంగి సీజన్‌లో సన్న వడ్లకు ప్రకటించిన రూ.500 బోనస్ ఇప్పటి వరకు జమ కాకపోవడం, మరోసారి రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం బ్యానర్లు, పత్రికా ప్రకటనలు చేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం రైతులకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని, సకాలంలో రుణమాఫీ అమలు కాలేదని, పంట దిగుబడి సమయంలో ఎరువులు, ముఖ్యంగా యూరియా తీవ్ర కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని రైతులు అడిషనల్ కలెక్టర్ ముందు తమ నిరసనను వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు రైతులను శాంతింపజేసేందుకు ప్రయత్నించినప్పటికీ, రైతులు వినిపించు కోలేదు. ఈ సందర్భంగా స్పందించిన అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, గత యాసంగి సీజన్‌లో సన్న వడ్లకు రూ.500 బోనస్‌కు సంబంధించి కరీంనగర్ జిల్లాకు సుమారు రూ.16 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల కానున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఈ వానాకాలం సీజన్‌లో కూడా బోనస్ కల్పించి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఆమె తెలిపారు. అయినప్పటికీ, రైతులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో చేసేది లేక, లక్ష్మీ కిరణ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వెనుదిరిగారు.
ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్డీవో రమేష్, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, విశాల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలును వేగవంతం చేయాలి



**కథలాపూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :**
మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు అరకురగా ఏర్పాటు చేసిన ఈ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలను వేగవంతం చేయాలని మరిన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నాయకులు కోడిపల్లి గోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గత 25 రోజుల క్రితమే మొక్కజొన్న రైతుల వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వల్ల ఇప్పటివరకు కొనుగోలు ప్రారంభించక పోవడం చాలా బాధాకరం ప్రారంభించిన సెంటర్లలో గోనె సంచుల కొరత ఉన్నది వెంటనే గోనె సంచులను సప్లై చేసి కొనుగోలు వేగవంతం చేయాలని అదేవిధంగా ఎక్కువ కొనుగోలు కేంద్రాలను డీసీఎంఎస్ మరియు పిఎసిఎస్ లా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ,రైతులు దళారు ల చేతిలో మోసపోవడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2400 ఉండగా దళారులు కేవలం 19000 మరియు 2000 రూపాయల కు క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తున్నారని దానివల్ల రైతులు నష్టపోవడం జరుగుతుందని వెంటనే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది ప్రభుత్వం లోని ఎమ్మెల్యేలు కలెక్టర్లు చొరవ తీసుకొని కొనుగోలు కేంద్రాలను ఎక్కువగా ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా రైతులకు తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరడం జరిగింది కథలాపూర్ మండలం లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి నా మండలం లో రైతులకు అందుబాటూ లో ఉండడం లేదు అన్ని గ్రామాలలో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ని కోరుతున్నారము ఈ విలేకరుల సమావేశంలో రైతు నాయకులు ఏనుగు తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు



# ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

- విద్యార్థిని మృతదేహంతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆందోళన
- రూ. కోటి ఎక్సిగ్రేషియా చెల్లించాలని డిమాండ్

**హుజురాబాద్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :**
భీమదేవరపల్లి మండలం వంగర గురుకుల హాస్టల్ లో 10వ తరగతి చదువుతున్న శ్రీ వర్షిత ఆత్మహత్య ఘటనపై హుజరాబాద్ లో ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థిని మృతదేహం తో హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆందోళనకు దిగారు. వరంగల్ - కరీంనగర్ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రాంపూర్ గ్రామానికి చెందిన శ్రీ వర్షిత మృతదేహానికి హుజరాబాద్ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయిన తర్వాత, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్వయంగా మృతదేహాన్నీ మోసుకుంటూ ఆసుపత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం చౌరస్తాలో మృతదేహాన్ని ఉంచి బైఠాయించి ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి గురుకుల పాఠశాలల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అమాయక గురుకుల విద్యార్థులు బలవుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వానికి మూడు ప్రధాన డిమాండ్లను వినిపించారు. శ్రీ వర్షిత కుటుంబానికి తక్షణమే రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. ఉదయం తల్లిదండ్రులతో మాట్లాడిన విద్యార్థిని వెంటనే ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన గురుకుల ప్రిన్సిపాల్, సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి, డిమాండ్లను తెలియజేయగా, కలెక్టర్ ఈ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఇక కలెక్టర్ హామీతో ఎమ్మెల్యే ధర్నాను విరమించారు. అనంతరం మృతదేహంతో రాంపూర్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై ప్రభుత్వం నుండి తక్షణమే విచారణ మరియు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని విద్యార్థి, ప్రజా సంఘాలు సైతం డిమాండ్ చేశాయి. మృతురాలు శ్రీ వర్షిత తండ్రి వనం తిరుపతి ఫిర్యాదు మేరకు వంగర పోలీసులు కేసు నమోదు చేశారు. తన కుమార్తె ఆత్మహత్యకు స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది ఒత్తిడి కారణమని ఆయన ఆరోపించారు.



## పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రాజేష్ కాశిపాక

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):**
టీపీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కాశిపాక రాజేష్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేష్ కాశిపాక, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు దీపావళి పండుగ , కార్తీక మాసం ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ సందర్భంగా, రాజేష్ కాశిపాక బృందం కమిష నర్‌కు దీపావళి కానుకను అందజేసి, శాలువా తో సత్కరించారు. అనంతరం, జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితులపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా రాజేష్ కాశిపాక మాట్లాడుతూ, జిల్లాలో పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను అభినందించా రు. ముఖ్యంగా, ప్రజలతో పోలీసులు మరింత సత్సంబంధాలు ఏర్పరచుకోవడం, ప్రజలకు అందుబాటులో ఉండడం వంటి అంశాలపై చర్చ జరిగింది. కరీంనగర్ జిల్లాలో శాంతి యుత వాతావరణం కొనసాగడానికి పోలీసులు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ధన్యవాదాలు తెలిపి జిల్లాలో ప్రజలకు భద్రత కల్పించడంలో, మెరుగైన సేవలందించడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్ కాశిపాక తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**బోధన్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలి..ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదల ఆత్మగౌరవ లోగిళ్లు కావాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం బోధన్ మండలం భవానిపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిది గంగాశంకర్, బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, సాలూర మండల అధ్యక్షులు మందర్న రవి, నరేందర్ రెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ గారు, విఠల్ రెడ్డి, దాము, గంగాధర్, రఫీ, బోధన్ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు అనిల్, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు ఎప్పటికప్పుడు కొనుగోళ్లు చేయాలి

### వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి

- రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్



**తంగళ్లపల్లి, అక్టోబర్ 24(జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 17 తేమ శాతం ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం కుప్పలు పరిశీలించారు. ఇప్పటి దాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం వచ్చిందని,ఎంత కొనుగోలు చేశారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. గన్ని సంచులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, డీసీఎస్ఓ చంద్ర ప్రకాశ్, తహసీల్దార్ జయంత్, ఏపీఎంలు సిబ్బంది ఉన్నారు.

# అమృత్ మిత్ర ఇన్నియేటివ్‌లో స్వశక్తి మహిళలకు భాగస్వామ్యం



- మెప్మా సిబ్బందితో సమావేశం..
- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీ

**గోదావరిఖని, జనంసాక్షి :** అమృత్ మిత్ర ఇన్నియేటివ్‌లో భాగంగా నీటి సరఫరా నిర్వహణ, నాణ్యత పరీక్ష, లీకేజీల మరమ్మత్తు తదితర పనుల్లో స్వశక్తి మహిళలకు భాగస్వామ్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2.0 కింద రామగుండం నగర పాలక సంస్థకు ప్రత్యేకంగా మంజూరైన రూ 65.00 లక్షలతో ఏడు ప్యాకేజీలతో వివిధ పనులు స్వశక్తి మహిళా సభ్యులతోనే చేపట్టి వారికి జీవనోపాది కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ పనులను చేయడానికి ఆశక్తి, అర్హతలు ఉన్న స్వశక్తి మహిళలను గుర్తించాలని మెప్మా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక నైపుణ్యం అవసరం ఉన్న పనులు చేపట్టడానికి వీలుగా నేషనల్ అకాడమీ కన్స్ట్రక్షన్ సెంటర్, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ సహకారంతో శిక్షణ కూడా ఇప్పించడం జరుగుతుందని అన్నారు. అలాగే ఇంకుడు గుంతలు నిర్మించ డానికి ఇంటింటా నిర్వహిస్తున్న సర్వేలో వార్డు అధికారులు, వార్డు అసిస్టెం ట్‌లతో పాటు ఆర్‌పిలు కూడా పాల్గొనాలని అన్నారు. నవంబర్ 1, 2021 తర్వాత నల్లా కనెక్షన్ పొందిన వారి కనెక్షన్ ఫోటోలు, డాక్యుమెంట్లు అమృతమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదన పు కమిషనర్ మారుతీ ప్రసాద్, ఎస్ఇ గురువీర, ఇఇ. పివి రామన్, సెక్రెట రీ ఉమామహేశ్వర్‌రావు, మెప్మా టిఎంసి మౌనిక, సిఓలు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల వ్యసనంతో బంగారు జీవితం నాశనం

- ఎపిఎ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలిపల్లి నాగేశ్వర్
- సాన్విలో నషా ముక్తి భారత అభియాన్ కార్యక్రమం




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి) :**
మత్తు మాదకద్రవ్యాల వ్యసనం యువత బంగారు భవిష్యత్తును సర్వ నాశ నం చేస్తుందని, తద్వారా వ్యక్తి అభివృద్ధి, కుటుంబ అభివృద్ధి ఆగిపోతుందని ప్రముఖ సైకాలజిస్ట్, ఎపిఎ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వర్ గాలిపల్లి అన్నారు. శుక్రవారం రోజు ప్రకృతి ఐఆర్‌సి ఎ రెహబిలిటేషన్ సెంటర్, అడ్వాన్స్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక రేకుర్తి లోని సాన్వి డిఫెన్స్ కాలేజీ లో జరిగిన నషా ముక్తి భారత్ అభియాన్ 5వాళ్ళు వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన 'మిషన్ పరివర్తన్ సే నో టు డ్రగ్స్ యెస్ టు డ్రీమ్స్ అండ్ గోల్స్' అనే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో మత్తు పదార్థములకు బానిస అవడం అనేది దుర దృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎర్రం శెట్టి మునిందర్, ప్రముఖ గ్రాఫాలోజిస్ట్ బొల్లంపల్లి సత్య ప్రకాష్, ప్రకృతి ఐ ఆర్ సి ఏ ఇంచార్జి మారుతి మోహన్ రావు, కల్పన, మహేష్, సంతోష్, సైకాలజిస్ట్ లు అనురాధ, అనివేణి, శిరీష, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.




- సమాచారం లేదంటున్న శేరిలింగంపల్లి డిసి, జోనల్ సిటీ ప్లానర్
- ఉన్నతాధికారులు చెప్పేనే నేను సీజ్ చేశా.. : శేరిలింగంపల్లి ఏసిపి వెంకటరమణ
- ఆందోళనలో తల్లిదండ్రులు.. అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహావేశా



# పాఠశాల లేక.. ఇంట్లోనే విద్యార్థులు

## అధికారుల దుందుడుకు.. యాజమాన్యం ఉదాసీనత

- వారం రోజులుగా శ్రీ చైతన్య స్కూల్ సీజ్..
- అగమ్యగోచరంగా పిల్లల భవిష్యత్తు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి)**
దేశ భవిష్యత్తు తరగతి నాలుగు గోడల మధ్యనే నిర్మితమవుతుందని ఆనాడే మేధావులు సూత్రీకరించారు. పేదరికం ఎంత వెక్కిరించినా.. ఎన్ని కష్టాలు ఎదురైనా.. కనీసం తమలాంటి పరిస్థితి తమ పిల్లలకు ఎదురుకాకూడదనే ఉత్కృష్ట లక్ష్యంతో ఓ పూట తిని ఓ పూట పస్తులుండి నేడు వేలాదిమంది తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలలో, శ్రీ చైతన్య నారాయణ వంటి ఫ్రాంచైజీ పాఠశాలలలో లక్షలు కుమ్మరించి విద్యాబుద్ధులు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం చేపడుతున్న దుందుడుకు చర్యలు, మరోవైపు శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు ఉదాసీన వైఖరి కనబరుస్తుండడంతో నేడు శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో దాదాపు వెయ్యిమంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా ఒకింత ఆందోళనకరంగా మారింది.

**సమాచారమే లేదంటున్న అధికారులు**
శేరిలింగంపల్లి ప్రాంతంలో అత్యంత కీలకమైన విద్యా సంస్థలలో ఒకటిగా వెలుగొందుతున్న శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో కనీసం వెయ్యి మంది విద్యార్థుల వరకు విద్యనభ్యసిస్తున్నారని, గత పది సంవత్సరాలుగా శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో ఎదురులేని పాఠశాలగా కొనసాగుతున్న శ్రీ చైతన్య పాఠశాలను శేరిలింగంపల్లి సర్కిల్ ఏసిపి సిబ్బందితో కలిసి వచ్చి సీజ్ చేసిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపినట్టు లేదు. ఇదే విషయమై సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి ని 'జనంసాక్షి' సమాచారం కోరగా పాఠశాలను సీజ్ చేసిన విషయం తనకు తెలియనే తెలియదని, సీజ్ చేసిన అధికారులతో మాట్లాడి వివరాలు అందిస్తానని చెప్పడం విస్మయాన్ని కలిగిస్తుంది. దీంతో ఉన్నతాధికారులను అడిగి సమాచారం తీసుకునే క్రమంలో శేరి లింగంపల్లి జోనల్ సిటీ ప్లానర్ కు ఫోన్ చేసి వివరాలు అడగగా తనకు సైతం ఎలాంటి సమాచారం లేదని, తాను ఎన్నికల విధులలో ఉన్నందున ఇతరులను అడిగి సమాచారం తెలుసు కోవాల్సిందిగా సూచించడం అధికారుల మధ్య ఉన్న సమన్వయ లోపం, ఒకింత బాధ్యతారాహిత్యాన్ని స్పష్టం చేస్తుండడంలో సందేహమే లేదు. కాగా ఇదే విషయంపై శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరత్నం ను 'జనంసాక్షి' మరోమారు వాకబు చేయగా తనకు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం నుండి ఆదేశాలు లభించాయని... అందుకే తాను శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయడం జరిగిందని తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అడగగా... అది నాకు సంబంధం లేని అంశం అని, మరింత సమాచారం కావాలంటే డైరెక్టుగా ఉన్నతాధికారులకే ఫోన్ చేసి వివరాలు అడుగుకోమని చెప్పడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారి జవాబుదారితనం అంటే ఇదేనా అని విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజికవేత్తలు, స్థానికులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు.

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేధావులు**
ప్రభుత్వ ఉన్నతాధికారులు చెప్పారు.. మేం చేసేసాం మిగతాది మాకు ఏం సంబంధం లేదు అనే ధోరణిలో శేరిలింగంపల్లి సర్కిల్ జిహెచ్ఎంసి అధికారులు ఓవైపు.. ఉన్నపలంగా ప్రభుత్వం దుందుడుకుగా వ్యవహరించింది, పరిస్థితిని సమీక్షిస్తున్నాం, సమస్యకు పరిష్కారాన్ని కనుగొంటాం అని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో మరి నెక్స్టేంటి, ఆ పిల్లల భవిష్యత్తు ఏంటి అని ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు, అటు మేధావులు సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెయ్యి మంది విద్యార్థుల భవిష్యత్తు అన్న కనీస విచక్షణ లేకుండా అధికారులు వ్యవహరిస్తుండడం, సమస్యను సత్వరమే పరిష్కరించుకొని పాఠశాలను కొనసాగించేలా శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ఆశించిన మేర ప్రయత్నం చేయడం లేదనే ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతుండడం అక్కడ పరిస్థితికి అద్దం పడుతుంది.

అయితే శ్రీ చైతన్య పాఠశాల సీజ్ వెనక శేరిలింగంపల్లి సర్కిల్ ఏసిపి అత్యుత్సాహం, వివాదాస్పద వ్యవహారం గోచరిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తు అనేది ఎంతో సున్నితమైన అంశమని, ఇలాంటి పరిస్థితులలో ఉన్నతాధికారులతో సమాలోచనలు, సీజ్ వల్ల కలిగే పరిణామాలు అంచనా వేసి మరికొంత సమయం ఇచ్చి విద్యార్థులకు ఇబ్బందు లు కలగకుండా సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సింది పోయి కనీసం శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ సిటీ ప్లానర్ కు సైతం సమాచారం అందించలేదంటే ఇక్కడ ఉద్దేశపూర్వకంగానే ఏసిపి వ్యవహరించినట్లు మేధావులు భావిస్తున్నారు. మరి ఈ జటిల సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుంది? ఎలాంటి మలుపులు తీసుకోనుందనే మిలియన్ డాలర్ల ప్రశ్న శేరిలింగంపల్లి సమాజాన్ని వేధిస్తుంది.

### వారం రోజులుగా ఇంటి వద్దనే విద్యార్థులు

గత మంగళవారం (ఈ నెల 14న) శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరమణ నేతృత్వంలో జిహెచ్ఎంసి అధికారులు హడావుడిగా తరలివచ్చి శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యానికి నోటీసు అందజేసినట్లు తెలిసింది. ఆ తర్వాత కేవలం నాలుగు రోజుల వ్యవధిలో శనివారం పాఠశాలను ఉన్నపలంగా సీజ్ చేయడం జరిగింది. దీపావళి పండుగ సెలవులు ఉండడంతో రెండు, మూడు రోజులు విషయం తెలియని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం రోజున పిల్లలతో కలిసి పాఠశాలకు వెళ్లగా అది సీజ్ చేసి ఉండడంతో అవాక్కై పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా ఈరోజు, రేపు సమస్య పరిష్కారం అవుతుందని దాటేస్తున్నారే తప్ప పాఠశాలను ఓపెన్ చేయడం లేదు. దీంతో గత వారం రోజులుగా పాఠశాల విద్యార్థులు విద్యకు దూరమై అయోమయ పరిస్థితిలో బిక్కుబిక్కుమంటున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థుల దైనందిన జీవితంలో చదువే అత్యంత కీలకమైన అంశం కాబట్టి ఏకంగా దానికే దూరం అవడం వారికి ఎటూ పాలుపోని పరిస్థితి కనిపిస్తుండగా మరోవైపు ఈ అకాల సెలవులతో చదువుతున్న విద్యపైనుండి మరోవైపు దృష్టి మరలిపోయే దుస్థితి నెలకొందని విద్యావంతులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేద విద్యార్థులకు అండగా

# ఈఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్

- ఎంబీబీఎస్ విద్యార్థులకు 1,50,000 ఆర్థిక సహాయం
- సేవా కార్యక్రమాలను విస్తరిస్తున్న ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్



**మర్రిగూడ, అక్టోబర్ 24 (జనం సాక్షి) :**
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నలుగురు నిరుపేద ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించిన ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్. చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎర్ర మధుశ్రీ, మర్రిగూడం మండల కేంద్రానికి చెందిన ఈద గిరి, కొండ మల్లేపల్లి మండలం ఎస్సి కాలనీకి చెందిన అందుగుల తేజశ్రీ, అందుగుల ప్రవల్లికలు ఎంబిబిఎస్‌లో ర్యాంకులు సాధించి ఆర్థిక ఇబ్బందులతో పై చదువులకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ సూచన మేరకు డైరెక్టర్ అశోక్ చేతులమీదుగా ఒక్కొక్కరికి 50,000 యాభై వేల రూపాయల చొప్పున మొత్తం లక్షా యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందించారు. మును ముందు వారి ఎంబిబిఎస్ చదువుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొన్నారు.

వీణవంక ప్రేమ వివాహం హత్య కేసు

# నలుగురికి జీవిత ఖైదు

కుటుంబ పరువు హత్య.. కరీంనగర్ కోర్టు కీలక తీర్పు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 24 (జనం సాక్షి):** వీణవంక మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో జరిగిన ప్రేమ వివాహం హత్య కేసులో కరీంనగర్‌లోని కుటుంబ కోర్టు కమ్ నాల్గవ అదనపు జిల్లా, సెషన్ జడ్జి కోర్టు శుక్రవారం నలుగురు కుటుంబ సభ్యులకు జీవిత ఖైదు విధించింది. వీణవంక పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 131/2019 కింద నమోదైన ఈ కేసులో ఈ కీలక తీర్పు వెలువడింది. దోషులుగా తేలిన వారు మండల ఓదేలు (48, మృతుడి మామ), మండల సంపత్ (28, మృతుడి బావ), మండల దేవేందర్ (25, మృతుడి బావ), మండల లక్ష్మి (45, మృతుడి అత్త). మృతుడు ఎ. శ్రీనివాస్ హత్యకు సంబంధించి భారత శిక్షాస్మృతి (ఐపిసి) సెక్షన్ 302 (హత్య) రీడ్ విత్ సెక్షన్ 34 కింద నిందితులను దోషులుగా నిర్ధారించిన కోర్టు, వారికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధించింది. ఈ సంఘటన 2019 జూన్ 23న జరిగింది. ఎ. శ్రీనివాస్, మండల ఓదేలు, లక్ష్మి దంపతుల కుమార్తెతో ప్రేమ వివాహం చేసుకోవడంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వివాదం హత్యకు దారితీసింది. 'డయల్ 100' ద్వారా సమాచారం అందడంతో వీణవంక పోలీసులు మొదట సెక్షన్ 307 (హత్య ప్రయత్నం) కింద కేసు నమోదు చేశారు. అయితే, గాయాలతో శ్రీనివాస్ మరణించడంతో అభియోగం సెక్షన్ 302 రీడ్ విత్ 34 ఐపిసిగా మార్చబడింది. జమ్మికుంట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ. రాములు, ఎస్హెచ్ఓ ఎ. తిరుపతి సహాయంతో దర్యాప్తును పూర్తి చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. శ్రీరాములు ప్రాసిక్యూషన్‌ను విజయవంతంగా నడిపించారు. 2025 సంవత్సరంలో ఈ కోర్టు విధించిన 22వ శిక్షగా ఈ తీర్పు నమోదైంది.

# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

హుజురాబాద్ ఏసిపి మాధవి



**వీణవంక అక్టోబర్ 24(జనం సాక్షి):** వీణవంక నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. వీణవంక మండలంలోని హిమ్మత్ నగర్ గ్రామంలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి ప్రారంభించిన మార్నింగ్ వాక్ ఇన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా హిమ్మత్ నగర్ గ్రామస్థుల సహకారంతో సుమారు ఒక లక్షతో ఏర్పాటు చేసిన 3 సోలార్ కెమెరాలు, 4 ఫిక్స్ కెమెరాలను శుక్రవారం హుజూరాబాద్ ఏసీపీ మాధవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు మండలంలోని అన్ని గ్రామాలలో దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం హిమ్మత్ నగర్ గ్రామస్తులు ఏసీపీ మాధవి, రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి లకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. సీసీ కెమెరాలు అందించిన గ్రామ దాతలు మ్యాక రమేష్, నల్ల తిరుపతిరెడ్డి, గెల్లు మల్లయ్య, శ్రీకాంత్, గెల్లు కొమురయ్య, వీరయ్య, మ్యాక సమ్మయ్య, తోపాటు పలువురు దాతలను ఏసీపీ మాధవి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, కొండాల్ రెడ్డి, బాబురావు, తిరుపతిరెడ్డి, లడె సంపత్ రావు, అంగన్వాడీ టీచర్లు లావణ్య, స్వరూప, మాజీ ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు, ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి ఆదర్శంగా నిలవాలి

- ప్రతి విద్యార్థిని తమ ప్రాంత పిల్లలకు స్ఫూర్తిగా ఉండాలి
- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి
- ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్



**తంగళ్లపల్లి, అక్టోబర్ 24(జనం సాక్షి) :**
విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి, వివిధ ఉద్యోగాల్లో, ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని తంగళ్ళపల్లి మండలం నేరెళ్లలోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆకస్మిక తనిఖీలో అన్నారు. ముందుగా విద్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించి, ఎవరైనా సెలవులో ఉన్నారా అని ఆరా తీశారు. సెలవుల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. వంటగదిలో మెనూ చార్ట్ ను పరిశీలించి, మెనూ ప్రకారం భోజన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లో ఉన్న కూరగాయలు, కోడిగుడ్లు పరిశీలించారు. నాణ్యత సరిగా లేకపోవడంతో వాటిని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. అందుబాటులో ఉన్న సరకుల వివరాల రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థుల వసతి గదులు పరిశీలించి, ఏమైనా ఇబ్బందులపై ఆరా తీశారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడి అధ్యాపకుల భోధన ఎలా ఉంద అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారని ఇంటర్మీడియట్ పూర్తయ్యాక ఎవరెవరు ఏయే విభాగాల్లో విద్యను అభ్యసించడానికి ఆసక్తిగా ఉన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, అనే వివరాలను క్లుప్తంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదిగితే తమ ప్రాంతంలోని మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తారని స్పష్టం చేశారు. మెనూ లో అందించే పోషకాహారం ఖచ్చితంగా తినాలని సూచించారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే మీరు నిర్దేశించుకున్న లక్ష్యం ఎంత పెద్దదైనా అది సాధించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి సులభతరం అవుతుందని, ఈ విషయాన్ని గ్రహించి చదవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జయంత్, ప్రిన్సిపాల్ రాధ, తదితరులు ఉన్నారు.



### సెస్ డైరెక్టర్ నారాయణరావు పరామర్శించిన.. మృత్యుంజయం

**గంభీరావుపేట అక్టోబర్ 24(జనం సాక్షి ) :**
గంభీరావుపేట మండల కేంద్రంలోని శ్రీ గదా గ్రామంలో ఇటీవల సెస్ డైరెక్టర్ నారాయణ రావు కాలుకు దెబ్బ తగిలిందని తెలుసుకొని ఆయనను శుక్రవారం రోజు మాజీ డిసిసి అధ్యక్షులు మృత్యుంజయం పరామర్శించారు, ఈ కార్యక్రమంలో రాజు గౌడ్, కుమార్, శంకర్, వెంకటి, రాములు, నాంపల్లి, అబ్దుల్ రహీం, రమేష్, పల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు

# లావణ్య వైద్య ఖర్చులకు రూ.5 లక్షలు చెల్లించాలి

- చావుబతుకుల్లో ఉన్న బాధితులను పట్టించుకోకుండా ఫోన్‌లో మాటలా..?
- ప్రభుత్వ డాక్టర్ సుప్రజ, ఆర్టీసీ డ్రైవర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలి
- షాద్‌నగర్‌లో ప్రజాసంఘాల నాయకుల డిమాండ్






**షాద్‌నగర్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :**
బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా కిందపడి తీవ్ర గాయాలపాలైన షాద్‌న గర్ పట్టణానికి చెందిన లావణ్య వైద్యు ఖర్చుల నిమిత్తం 5 లక్షల రూపాయలు చెల్లించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తోటి ప్రయాణికులు వెంటనే అంబులెన్సులో లావణ్యను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తే.. అక్కడి డాక్టర్ సుప్రజ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, చావుబతుకుల్లో ఉన్న బాధితురా లిని పట్టించుకోకుండా ఫోన్‌లో సంభాషించడం దారుణమని పేర్కొన్నారు. లావణ్య సోదరుడు మిద్దెల సత్యనారాయణ చాక చక్యంగా స్పందించి స్కానింగ్ తీయించడం, వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి తన సోదరి లావణ్యను ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించాడని, లేకపోతే లావణ్య పరిస్థితి మరింత విషమంగా మారేదని తెలిపారు. ఒకవైపు తీవ్ర గాయాలతో పాటు వాంతులు చేసుకుంటున్న క్షతగాత్రురాలిని పరిశీలించ కుండా.. బాగానే ఉంది, ఇంటికి తీసుకెళ్లొచ్చని డాక్టర్ సుప్రజ చెప్పడం తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోందన్నారు. కుటుంబ సభ్యుల పట్ల దురుసుగా మాట్లాడుతూ.. ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసిన సత్యనారాయణ పట్ల కోపోద్రిక్తురాలైందని, ఎవరికి ఫోన్ చేశావ్, బెదిరిస్తున్నావా అంటూ సదరు వైద్యురాలు దబాయింపులకు దిగారని తెలిపారు. ఈ క్రమంలో పరిస్థితి క్షణక్షణం విషమిస్తుండటంతో స్కానింగ్ అనంతరం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి లావణ్యను తరలించారని, అక్కడి వైద్యులు ఎమర్జెన్సీ సర్జరీ చేసి ఆమెను బతికించారని పేర్కొన్నారు. ఒక వేళ ఆలస్యం చేసినా, డాక్టర్ సుప్రజా మాటలు నమ్మినా లావణ్య ప్రాణాలకు ముప్పు ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారికి ఇంకెక్కడి దిక్కు అంటూ ప్రశ్నించారు. ఈ ఘటనలో బాధ్యత మరిచిన డాక్టర్ సుప్రజను, ఆర్టీసీ డ్రైవర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లావణ్య వైద్యు ఖర్చుల నిమితం ఐదు లక్షలు చెల్లించాలని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదల పట్ల డాక్టర్లు ప్రేమగా బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళల పట్ల ఆర్టీసీ సిబ్బంది చులకనభావాన్ని వీడాలని, గౌరవంగా మసలుకోవాలని సూచించారు. ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు టీజీ శ్రీనివాస్ (తెలంగాణ విద్యావంతుల వేదిక), తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు అర్జునప్ప, టీజేఏసీ చైర్మన్ జనార్ధన్, పాలమూరు అధ్యయన వేదిక రవీంద్రనాథ్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహకారదర్శి తిరుమలయ్య పాల్గొన్నారు.

# కప్పేటలో కండ్లుగప్పి ఇసుక దోపిడీ




అడ్డగోలుగా తవ్వేస్తున్నారు..! ० నామమాత్రపు దాడులతో అధికారుల కాలక్షేపం

**మహబూబ్‌నగర్ బ్యూరో 24 (జనంసాక్షి) :**
మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి కూతవేట దూరంలో ఉన్న భూత్పూర్ మండలం కప్పేట గ్రామం ఇసుక అక్రమ రవాణాకు ప్రధాన కేంద్రంగా మారింది. నిత్యం వందలాది ట్రాక్టర్లలో, ట్రిప్పర్లలో కప్పేట గ్రామం నుంచి మహబూబ్ నగర్ వంటి ప్రాంతాలకు అక్రమ మార్గనా ఇసుకను తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా సాగుతున్న ఈ అక్రమ రవాణను అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది.
ఆధికారుల దృష్టికి విషయాన్ని చేరవేస్తే రెవిన్యూ అధికారులు నామ మాత్రపు దాడులు నిర్వహించి చేతులు దులుపుకోవడం వెనక పెద్దమనుషుల హస్తం ఉన్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. శుక్రవారం నాడు భారి వర్షం కురుస్తున్నా కూడ రోడ్డు ప్రక్కనే ఉన్న కాలువలో జేసిబి ఉంచి వర్షంలోనే ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తుండం చూస్తుంటే వీరు కప్పెట ఇసుక అక్రమ తంతు వ్యవహారం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం అవుతుంది.

**ఆధికారులకు తెలిసే ఈ అక్రమ తంతు**
భూత్పూర్ మండలం కప్పెట గ్రామంలో జరుగుతున్న అక్రమ ఇసుకతో అటు రెవెన్యూ అధికారులకు పోలీసు అధికారులకు తెలిసే సాగుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నుంచి వార్తలు వినిపిస్తున్నాయి. పోలీస్ వాహనాల ముందరే దర్జాగా అక్రమ ఇసుక రవాణా సాగుతున్న పోలీస్ శాఖ కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ శాఖ అధికారులు కూడా నామమాత్రపు దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని భూత్పూరు మండల ప్రజల నుంచి బాహాటంగానే విమర్శలు వస్తున్నాయి.



> **అక్రమ ఇసుకకు అడ్డగా కప్పేట**
> అక్రమ ఇసుక తరలింపుకు భూత్పూర్ మండలంలోని కప్పేట గ్రామం ప్రధాన అడ్డగా మారింది. ఇక్కడి నుంచి నిత్యం అర్ధరాత్రి ఇసుక వివిధ ప్రాంతాలకు అక్రమమార్గంలో తరలివెళ్తుంది. అటు నాగర్ కర్నూల్ జిల్లా ఇటు వనపర్తి జిల్లా గ్రామాలు కప్పేట గ్రామానికి దరిదాపుల్లోనే ఉండటంతో అధిక రేటుకు ఇసుకను అటువైపు కూడ రాత్రి సమయాల్లో తరలించేస్తున్నారు. ఓక్కో ట్రాక్టర్ ఇసుకను 6000 వరకు విక్రయిస్తు కాసులు దండుకుంటున్నారు. ట్రిప్పర్ ఇసుకకు 40000 వరకు వసూళ్ళు చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25 అక్టోబర్ 2025



# ఫ్రెండ్స్ ప్యానల్‌ను ఎందుకు గెలిపించాలంటే..

## జర్నలిస్టుల స్వేచ్ఛ, రక్షణ విషయంలో కీలక పాత్ర పోషిస్తాం

- ప్రెస్‌క్లబ్ సభ్యులందరికీ రూపాయి చెల్లించకుండా రూ.5 లక్షల జీవిత బీమా
- వారి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ఆరోగ్య బీమా, కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం
- మహిళా జర్నలిస్టులకు మరిన్ని సదుపాయాలు, మహిళలు, పిల్లల కోసం స్పెషల్ లాంజ్ ఏర్పాటు
- 1996లో కేటాయించిన 4840 గజాల స్థలంపై పూర్తి హక్కులు సాధిస్తాం
- ప్రెస్‌క్లబ్ అధ్యక్ష అభ్యర్థి శ్రీగిరి విజయ్ కుమార్ రెడ్డి హామీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రెస్‌క్లబ్ హైదరాబాద్‌ను స్వతంత్ర వ్యవస్థగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు జర్నలిస్టుల స్వేచ్ఛ, రక్షణ విషయంలో మరింత క్రియాశీలక పాత్ర పోషిస్తామని సాక్షి రెసిడెంట్ ఎడిటర్ ఎస్ విజయ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని ఫ్రెండ్స్ ప్యానల్ హామీనిచ్చింది. ఈ మేరకు ఫ్రెండ్స్ ప్యానల్ కార్యాచరణను విజయ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సభ్యులకు ఎలాంటి ఫీజు లేకుండా పుస్తకావిష్కరణ, ఇతర కార్యాక్రమాలకు ఏసీ హాల్‌ను ఒకరోజు (సెషన్) పూర్తి ఉచితంగా కేటాయిస్తామని హామీనిచ్చారు. ప్రెస్‌క్లబ్ సభ్యులందరికీ ఒక్క రూపాయి చెల్లించకుండా రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనున్నట్టు పేర్కొన్నారు. సభ్యుల కుటుంబ సభ్యులకు కూడా రూ. 5 లక్షల ఆరోగ్య బీమా, ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే బాధ్యత విజయ్‌కుమార్ రెడ్డి, వరికుప్పల రమేష్ ఆధ్వర్యంలోని ఫ్రెండ్స్ ప్యానల్ తీసుకుంటుందన్నారు. 1996లో కేటాయించిన 4840 గజాల స్థలంపై పూర్తి హక్కులు సాధిస్తామని తెలిపారు. క్యాంటీన్ నిర్వాహణ, మెనూలో మార్పులు తేవడంతో పాటు ప్రెస్‌క్లబ్ స్థలంలోనే అధునాతన వసతులతో కూడిన భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. జర్నలిస్టుల వృత్తి నైపుణ్యం పెంచే ఓరియంటేషన్, కుటుంబ సభ్యులకు మరిన్ని రిక్రియేషన్ కార్యక్రమాలు, ప్రతినెలా పౌర సేవల క్యాంపులు కూడా నిర్వహిస్తామన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మహిళా జర్నలిస్టుల కోసం సదుపాయాలు, మహిళలు, పిల్లల కోసం స్పెషల్ లాంజ్‌లు, వేసవి క్రీడా శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వయోధిక పాత్రికేయులతో సహా సభ్యులందరికీ ప్రత్యేక హెల్త్‌చెకప్ క్యాంపులు క్రమం తప్పకుండా చేపడతామని, చేసేదే చెబుతాం.. చెప్పిందే కచ్చితంగా చేస్తామని, రేపు (అక్టోబర్ 26) జరగబోయే ఎన్నికల్లో భాగంగా ఫ్రెండ్స్ ప్యానల్‌ను గెలిపించాలని విజయ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.




# నేడు హుజూర్‌నగర్‌లో మెగా జాబ్‌మేళా

- రెండు రోజులపాటు నిర్వహణ
- జాబ్ మేళాకు హాజరయ్యే యువతీ, యువకులకు అల్పాహారం, భోజనాలు ఏర్పాటు
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్ నగర్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** నిరుద్యోగ అభ్యర్థులు అంచనాకు మించి ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా ఉండడం కోసం నేడు 25, 26 వ రోజు కూడా మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మెగా జాబ్ మేళాకు వస్తున్న విశేష స్పందన దృష్ట్యా రెండో రోజు కూడా కొనసాగుతుందని అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్ నేషనల్ స్కూల్ లో నిర్వహించే జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తయిన సందర్భంగా 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు యువతకు కల్పించడం జరిగిందని, ప్రైవేటులో మారుమూల గ్రామీణ ప్రాంత యువతి, యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ జాబ్ మేళ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద కంపెనీలు హుజూర్ నగర్ కు తరలిరానున్నాయని, వాటితో పాటు, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంట్, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు కూడా ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే 36,000 వేల మందికి పైగా నిరుద్యోగులు జాబ్ మేళాలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని, తెలంగాణ ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ స్థాయిలో జాబ్ మేళా జరిగి ఉండదని నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ఈ ప్రాంతంలో ప్రైవేట్ స్థాయిలో ఉద్యోగం కనిపించడమే లక్ష్యంగా ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కనీ విని ఎరుగని రీతిలో నిరుద్యోగులు జాబ్ మేళాకు తరలి వస్తున్న దృష్ట్యా రద్దీ పెరగకుండా క్రమబద్ధీకరించడంతో పాటు, ప్రతీ నిరుద్యోగి జాబ్ మేళాలో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలన్న తలంపుతో రెండో రోజు కొనసాగింపుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని చెప్పారు. అందువల్ల జాబ్ మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకున్న యువతీ, యువకులు రెండో రోజు కూడా హాజరు కావచ్చని అన్నారు.



జాబ్ మేళాలో పాల్గొంటున్న 275 పై చిలుకు పరిశ్రమల వివరాలను కేటగిరీ వారిగా విభజించి పూర్తి వివరాలను ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శన ప్రదర్శించడం జరుగుతుందని, జాబ్ మేళాకు హాజరయ్యే యువతీ యువకులకు ముందు రోజు అల్పాహారం, భోజనాది వసతి సౌకర్యాలు, మరుసటి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. జాబ్ మేళాకు హాజరవుతున్న నిరుద్యోగులకు ఎక్కడ అసౌకర్యం కలుగ కుండా ఉండేలా వాలంటరీలతో క్రమ బద్ధీకరణ, ట్రాఫిక్ నియంత్రణ, స్టాల్స్ వద్ద తోపులాట, ఒత్తిడి జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని, జిల్లా యంత్రంగా కూడా మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవర్, ఎస్పీ నరసింహ, డి ఇ ఇ టి అసిస్టెంట్ డైరెక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదంలో ఆచూకీ లేని తల్లీకొడుకు



**పటాన్‌చెరు, అక్టోబర్24 (జనంసాక్షి) :** కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి బయలుదేరిన వారు ఇద్దరు ఉన్నారు. బెంగళూరుకు చెందిన తల్లీ కుమారులు పిలోమి నాన్ బేబీ(64), కిషోర్ కుమార్(41) ఇటీవల దీపావళి పండగకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని కృషి డిఫెన్స్ కాలనీలోని బంధువు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాము ఇంటికి వచ్చారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు అంబేడ్కర్ కూడలి వద్ద వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి బెంగళూరు బయలుదేరారు. అయితే ఈ లోపే చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదానికి గురవడంతో వీరు క్షేమంగా ఉన్నారా లేదా? అనేది తెలియడం లేదు. వారి ఆచూకీ కనుక్కునేందుకు రాము దంపతులు కర్నూలుకు బయలుదేరి వెళ్లారు.

# భారత సంతతి వ్యక్తిపై మూన్‌లైటింగ్ ఆరోపణలు

### కేసు రుజువైతే 15 ఏళ్ల జైలు



**వాషింగ్టన్(జనంసాక్షి):** భారత సంతతికి చెందిన మెహుల్ గోస్వామి అనే వ్యక్తి అమెరికాలో అరెస్టయ్యాడు. మూన్‌లైటింగ్ చేయడమే అతడి అరెస్టుకు కారణం. ఒక వ్యక్తి సాధారణ ఉద్యోగ సమయం తర్వాత కూడా మరో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. న్యూయార్క్ వాసి అయిన గోస్వామి న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఇది అతడి ప్రాథమిక ఉద్యోగం. ఈ సమయంలో అతడు మాల్టాలోని గ్లోబల్‌ఫౌండ్రీస్ సెమీకండక్టర్ కంపెనీలో కాంట్రాక్టర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. 2022 నుంచి అతడు ఇందులో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. ఇ మెయిల్‌ల ఆధారంగా గోస్వామి మూన్‌ల్కెటింగ్‌కు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్ర నిధుల్లోంచి దాదాపు రూ.44 లక్షలు దొంగతనం కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన సమయంలోనే.. ప్రైవేటు కంపెనీ కోసం పనిచేస్తుండటంతో అక్టోబరు 15న అధికారులు అతడిని అరెస్టు చేశారు. 'నిజాయతీగా సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగుల కు ఆ బాధ్యతలు అప్పగిస్తారు. గోస్వామి దాన్ని తీవ్రంగా ఉల్లంఘించాడు. రాష్ట్రం కోసం పనిచేస్తున్నా అని చెప్పుకుంటూ.. మరో కంపెనీ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో సహా ప్రజా వనరులను దుర్వినియోగం చేయడమే' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ లూసీ లాంగ్ పేర్కొన్నారు. ఇటీవల అధికారులు గోస్వామిని కోర్టులో హాజరు పరచగా.. అతడు బెయిల్ లేకుండానే విడుదలయ్యాడు. అయితే, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది. ఇందులో నేరం రుజువైతే అతడికి 15 ఏళ్లు జైలు శిక్ష పడుతుంది. ఇక, గోస్వామి అరెస్టు నేపథ్యంలో మూన్‌లైటింగ్ గురించి మరోసారి చర్చ జరుగుతున్నది.

# తిరుపతిలో విషాదం

- స్వర్ణముఖి నదిలో నలుగురు యువకులు గల్లంతు..
- ఒక మృతదేహం లభ్యం

**తిరుపతి(జనంసాక్షి):** తిరుపతి రూరల్ మండల పరిధిలో విషాదం చోటు చేసుకుంది. ఆగ్రహారానికి చెందిన ఏడుగురు యువకులు శుక్రవారం తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం సమీపంలో స్వర్ణముఖి నదిలోకి ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ ప్రకాశ్ (17), చిన్న (15), తేజు (19), బాలు (16) గల్లంతయ్యారు. స్థానికులు గమనించి విష్ణు, మణిరత్నం, కృష్ణను కాపాడారు. బాలు మృత దేహం లభ్యమైంది. మిగిలిన ముగ్గురి కోసం గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు గాలింపు చేపట్టారు.

# హైడ్రా లాంటి వ్యవస్థ అన్ని రాష్ట్రాలకూ అవసరం

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కితాబు



**హైదరాబాద్, అక్టోబరు 24 (జనంసాక్షి) :** ఓ వివాహ వేడుకకు విజయవాడ వెళ్లిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. హైడ్రా లాంటి వ్యవస్థ ఏపీతో పాటు అన్ని రాష్ట్రాలకూ అవసరమని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అన్నారు. పాలకుల ముందుచూపు.. నిబద్ధత గల అధికారుల పని తీరు ఏ వ్యవస్థకైనా మంచి పేరు తీసుకువస్తాయన్నారు. దేశంలోనే మొట్టమొదటిగా హైడ్రా రూపంలో సరికొత్త వ్యవస్థను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. కొత్త వ్యవస్థను తీసుకురావడమే కాకుండా సరైన అధికారిని నియమించడం.. అధికారాలు కట్టపెట్టడం, పూర్తి స్వేచ్ఛతో పని చేసే అవకాశం కల్పించడం జరిగితే ఫలితాలు బాగుంటాయన్నారు. ఎంతో నిబద్ధతతో పని చేస్తున్న ఏవీ రంగనాథ్ ని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభినందించారు.

# ప్రజల ప్రాణాలతో ట్రావెల్స్ బస్సుల చెలగాటం

- కర్నూలు ఘటనపై బిజెపి అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు దిగ్భ్రాంతి
- కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**హైదరాబాద్, అక్టోబర్24 (జనంసాక్షి) :** కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురైన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య చికిత్సను ప్రభుత్వం వెంటనే అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మరల జరగకుండా ప్రభుత్వం సమగ్ర నియంత్రణ చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని రామచందర్ రావు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్ ఘటనలో ఎక్కువ సంఖ్యలో మృతులు ఉండటం విషాదకరమన్నారు. మృతులకు తీవ్ర సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# పోచారంలో ప్రహారీగోడ తొలగింపు




- హైడ్రా చర్యలతో స్థానికుల ఆనందం

**హైదరాబాద్, అక్టోబర్24 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది. చెరువులు, కుంటలకు కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించి పునరుద్ధరిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ పోచారంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను శుక్రవారం హైడ్రా తొలగించి 8 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించింది. 1978లో 27 ఎకరాల ఎకరాల్లో 400 ప్లాట్లతో జీపీ లే అవుట్ ఏర్పాటు చేయగా.. అందులో ఓ వ్యక్తి 6.18 ఎకరాల భూమిని తమదే అంటూ అక్రమంగా ప్రహరీ నిర్మించాడు. అక్రమ ప్రహరీపై సుమారు 8 ఏళ్లుగా పోరాడిన లే అవుట్ సొసైటీ.. చివరకు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేసింది. సొసైటీ సభ్యుల ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. అక్రమంగా నిర్మించినట్లు గుర్తించారు.దీంతో ప్రహరీ గోడను తొలగించారు హైడ్రా సిబ్బంది. 8 ఏళ్లుగా ఉన్న సమస్యకు హైడ్రాతో పరిష్కారం లభించడంతో హైడ్రా చర్యల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్లీపర్ బస్సుల్లో ప్రమాదాలు ఎక్కువే

- ఇటీవలే రాజస్థాన్‌లో ఇలాంటి ఘోరమే
- స్లీపింగ్ సిస్టమ్‌తో ప్రమాదం నుంచి బయటపడలేని వైనం



**హైదరాబాద్, అక్టోబర్24 (జనంసాక్షి) :** కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న బస్సు దుర్ఘటన అనేక కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగి పలువురు సజీవ దహనమైన సంగతి తెలిసిందే. సరిగ్గా 10 రోజుల క్రితం రాజస్థాన్‌లోనూ ఇదేతరహా ప్రమాదం జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇవే కాదు.. గత కొన్నేళ్లుగా స్లీపర్ బస్సుల్లో జరుగుతోన్న ప్రమాద ఘటనలు ప్రయాణికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. వీటి నిర్వహణకు కఠిన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో 30 నుంచి 36 బెర్త్‌లు ఉంటాయి. అదే మల్టీ యాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరు అడుగుల పొడవు.. 2.6 అడుగుల వెడల్పులో ఉంటుంది. అయితే బెర్త్‌లను అనుసంధానించే గ్యాలరీతోనే ఇక్కడ సమస్య. ఈ గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉండటంతో ఒకసారి ఒక వ్యక్తి మాత్రమే వెళ్లడానికి వీలుంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకైన ప్రాంతం నుంచి వేగంగా బయటకు రాలేకపోతున్నారు. స్లీపర్ బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతంగానే ఉంటున్నా.. సీట్ల మధ్యలో పరిమిత స్థలం వల్ల ప్రయాణికుల కదలికలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువమంది లోపల చిక్కుకుపోతున్నారని అభిప్రాయపడుతున్నారు. ఇక, స్లీపర్ బస్సుల ఎత్తు కూడా మరో సమస్యగా మారుతోంది. సాధారణంగా వీటి ఎత్తు 8-9 అడుగుల వరకు ఉంటోంది. ఒకవేళ బస్సు ఉన్నట్టుండి ఒక వైపునకు ఒరిగిపోయినప్పుడు.. ప్రయాణికులు కిటికీలను లేదా ఎమర్జె న్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టంగా మారుతోంది. ఈ ఎత్తు వల్ల రెస్క్యూ ఆపరేషన్‌కు కూడా ఆటంకం కలుగుతోంది. బస్సు ఎక్కి ప్రయాణికులను బయటకు తీసేలోపు మృతుల సంఖ్య పెరుగుతోందని నిపుణులు భావిస్తున్నారు. 300 నుంచి 1000 కిలోమీటర్ల దూరం ఉండే ప్రయాణాలకు స్లీపర్ బస్సులను అధికంగా వినియోగిస్తున్నారు. సాధారణంగా ఈ బస్సులు రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తాయి. దీంతో డ్రైవర్‌కు అలసట లేదా మగత వచ్చే ముప్పు కూడా ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. అధునాతన బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నా.. వాటి పనితీరు, సామర్థ్యంపై ఇంకా అనుమానాలు ఉన్నాయి. డ్రైవింగ్ సమయంలో తాము నిద్ర మత్తులో ఉంటున్నామని 25శాతం మంది డ్రైవర్లు అంగీకరించినట్లు 2018లో నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అర్ధరాత్రి తర్వాత నుంచి ఉదయం 6 గంటల్లోపు డ్రైవర్లు నిద్రలోకి జారుకునే అవకాశం ఉందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి. ప్రమాదాల సమయంలో మొదటి రెండు నిమిషాల్లో ప్రతిస్పందించే తీరే అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రలోనే ఉంటారు. సీట్లలో మెలకువగా ఉన్నవారు లేదా ప్రమాదం జరిగిన వెంటనే తేరుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక, అప్పర్ బెర్త్‌ల్లో ఉన్నవారు బయటపడటం చాలా క్లిష్టంగా ఉంటోందని అంటున్నారు. ఈ స్లీపర్ బస్సులు తొలుత పశ్చిమదేశాల్లో నడిపేవారు. సిటీల మధ్య వినోద ప్రయాణాల కోసం వీటిని వినియోగించేవారు. ఆ తర్వాత సాధారణ ప్రజా రవాణాలో ఇవి భాగమయ్యాయి. అయితే, వీటిల్లో జరుగుతోన్న ప్రమాదాల కారణంగా కొన్ని దేశాలు స్లీపర్ బస్సుల వినియోగాన్ని తగ్గించుకుంటున్నాయి. చైనాలో 2009 తర్వాత నుంచి 13 స్లీపర్ బస్సు ప్రమాదాలు జరిగి 252 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో 2012లో వీటి రిజిస్ట్రేషన్లను చైనా నిలిపివేసింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370